
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



చిత్తూరు

శుక్రవారం, 4 ఆగస్టు 2017 | 16



దర్జాగా కబ్జా!

- ఆక్రమణలో రూ.6కోట్ల విలువైన భూమి
- ప్రభుత్వ భూమిలో నీలగిరి చెట్ల పెంపకం

ఏర్పేడు- వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన ఇనగలూరు వద్ద 15ఎకరాల ప్రభుత్వ భూమిలో పెరుగుతున్న ఈ నీలం చెట్లను చూశారా? ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.3కోట్లకు పైగా విలువ చేసే ఈ భూమి ఓ నేత ఆక్రమణలో చాలాకాలంగా వుంది. దీని పక్కనే అంతే విలువైన మరో పదిహేను ఎకరాల ప్రభుత్వ భూమిని ఇంకో నేత ఆక్రమించుకున్నాడు.దారినపోయే వారందరికీ కన్పిస్తున్న ఈ ఆక్రమిత భూములు రెవెన్యూ యంత్రాంగం కంటపడకపోవడమే విశేషం.

శ్రీకాళహస్తి: మండలంలోని ఇనగలూరు పంచాయతీ పరిధిలో సర్వే నెం:394-ఏలో 2.33 ఎకరాలు, సర్వే నెం:394-బిలో 2.33 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తికి పట్టాలు ఇచ్చారు. ఇక సర్వే నెం:395లో 5.06ఎకరాలు, సర్వే నెం:396లో 5.14 ఎకరాల అనాధీనం ఉంది. ఈ భూమి మొత్తం ఏర్పేడు - వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన ఉండడంతో ధర బాగా పలుకుతోంది.ది.కొంతకాలంగా ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటవుతుండడంతో భూమి ధర అమాంతంగా పెరిగిపోయింది. ఇక్కడ సెటిల్‌మెంటు ల్యాండ్ ఎకరా సుమారు రూ.50లక్షల వరకు పలుకుతోంది. ఈ నేపథ్యంలో తమకున్న రాజకీయ పలుకుబడిని అడ్డంగా పెట్టుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నీలగిరి చెట్లు పెంచుతున్నారు.మరికొంత భూమిలో ప్లాట్లు వేసి అమ్మకానికి పెట్టారు. ఈ భూఆక్రమణలపై స్థానికులు పలు పర్యాయాలు ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.


ఫిదా సందడి



క్లాస్,మాస్ తేడా లేకుండా ఫిదా సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పేందుకు చిత్ర బృందం విజయయాత్రకు బయలుదేరింది. తిరుపతిలో గురువారం మధ్యాహ్నం జనంతో కలసి చిత్రాన్ని వీక్షించింది.

వివరాలు 16వ పేజీలో

పవిత్రోత్సవ వైభవం



తిరుమల వెంకన్న ఆలయంలో గురువారం ఉదయం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

- మెయిన్ లో

ఆలస్యంగా హెచ్‌ఎంల కౌన్సెలింగ్

- విద్యాశాఖ కమిషనర్ లాగిన్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు
- రాత్రి ఏడు గంటలకు మొదలైన కౌన్సెలింగ్
- నేటి మధ్యాహ్నం నాన్ లాంగ్వేజస్ స్కూల్ అసిస్టెంట్లకు

6

కొండపై 'నిఘా' నేత్రం

- కిడ్నాపులు, మిస్సింగ్ కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాల ఫుటేజ్‌దే కీలక పాత్ర
- మరిన్ని అధునాతన కెమెరాల ఏర్పాటుపై పోలీసులు, విజిలెన్స్ దృష్టి
- తిరుమలలో 'జీరో క్రైం' కోసం పటిష్ఠ ప్రణాళికలు



కమాండ్ కంట్రోల్ రూమ్ - శ్రీవారి ఆలయం ముందు సీసీ కెమెరా

తిరుమల: తిరుమలలో వరుసగా జరుగుతున్న కిడ్నాపులు, మిస్సింగ్ కేసుల పరిష్కారానికి సీసీ కెమెరాల ఫుటేజ్ కీలక పాత్ర పోషిస్తోంది. కెమెరాల ద్వారా రికార్డు అయిన దృశ్యాల సాయంతో అతి తక్కువ సమయంలోనే నిందితులను పోలీసులు గుర్తిస్తున్నారు. 2012 జూన్‌లో యాత్రికుల వసతి సముదాయం-1లో తమిళనాడులోని అంబత్తూరుకు చెందిన రాజు, తగప్రియ దంపతుల ఎనిమిది నెలల బాలుడు ప్రద్యూత్X అపహరణ సంచలనం సృష్టించింది. బాలుడి కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం కనిపించలేదు. అదే ఏడాది ఆగస్టు 31వ తేదీన నెల్లూరుకు చెందిన యశ్వంత్ అనే 10 నెలల బాబు అదృశ్యమయ్యాడు. ఈ బిడ్డ జాడా ఇప్పటివరకు తెలియలేదు. ఈ సంఘటనల దృష్ట్యా సీసీ కెమెరాల సంఖ్యను పెంచారు. గత ఈవో సాంబశివరావు ఆధ్వర్యంలో సీసీ కెమెరా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చారు. 350గా ఉన్న వీటిని సంఖ్యను 600కుపైగా పెంచారు. ముఖ్యమైన ప్రాంతాల్లోని కదలికలన్నీ పూర్తిస్థాయిలో రికార్డు అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

640 కెమెరాలతో 24 గంటల పాటు...

తిరుమలలో వివిధ ప్రాంతాల్లో దాదాపు 640 సీసీ కెమెరాలున్నాయి. వీటి పర్యవేక్షణ కోసం యాత్రికుల వసతి సముదాయం-4 రెండో అంతస్తులో కమాండెంట్ కంట్రోల్ రూం ఏర్పాటైంది. మూడు షిప్టుల్లో 24 గంటల పాటు 20 మంది సిబ్బంది ఇక్కడ విధుల్లో ఉంటారు. ఎక్కడైనా అనుమానాస్పద కదలికలను గమనిస్తే.. వెంటనే సంబంధిత విభాగ సిబ్బందికి సమాచారమిస్తారు. ఏడాదిగా వీరి పనితీరు మెరుగ్గానే ఉంది. ఎందుకంటే ఇటీవల ఈ కెమెరాల ఫుటేజ్ ద్వారానే పలు కేసులు పరిష్కారం కావడమే అందుకు నిదర్శనం. అందువల్ల ప్రస్తుతం ఉన్న 640 సీసీ కెమెరాలతోపాటు అదనంగా 800 అత్యాధునిక కెమెరాలను అందుబాటులోకి తేవడంపై పోలీసులు, విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టారు. ఈ కెమెరాలను వివిధ ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసి నిఘా మరింత పటిష్ఠం చేయాలని నిర్ణయించారు.

ఆరు నెలల్లో ఐదు కీలక కేసులకు తెర

తిరుమలలోని సీసీ కెమెరాల ఫుటేజ్ సాయంతోనే ఆరునెలల్లో ఐదు కీలక కేసులను పరిష్కరించారు.

- ఈ ఏడాది జనవరి 29న అనంతపురం జిల్లాకు చెందిన మహాత్మ, వరలక్ష్మి దంపతుల కుమార్తె నవ్యశ్రీ(5)ని గుర్తుతెలియని ఓ వ్యక్తి యాత్రికుల వసతి సముదాయం - 3లో ముసుగు వేసుకుని అపహరించుకెళ్లాడు. ఈ ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. నవ్యశ్రీతో ఉన్న కిడ్నాపర్ బాలస్వామిని మహబూబ్‌నగర్‌లో పట్టుకున్నారు. ఈ కేసులో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషించాయి.
- జూన్ 14వ తేదీన అనంతపురంజిల్లా వజ్రకరూర్ మండలం ఛాయాపురానికి చెందిన కె.వెంకటేశ్వర్లు, రత్నమ్మ దంపతుల తొమ్మిది నెలల బిడ్డ చెన్నకేశవులు కిడ్నాప్ అయ్యాడు. శ్రీవారి ఆలయం ముందే ఈ ఘటన జరగడంతో పోలీసులకు నిద్రలేకుండా చేసింది. అదే నెల 30వ తేదీన కిడ్నాపర్లు అశోక్, తంగైలను తమిళనాడులోని నామక్కల్ జిల్లా సింగలంతపురంలో అరెస్టు చేశారు.
- తీవ్రమైన తలనొప్పితో బతకలేనని.. తిరుమలలోని లోయలో దూకి చనిపోవటానికి వెళుతున్నానంటూ జూలై 14వ తేదీన కర్నూల్‌జిల్లా కోసగి పట్టణానికి చెందిన సోమేశ్వరి యాత్రికుల వసతి సముదాయం-3లో సూసైడ్ నోట్ రాసిపెట్టి వెళ్లిన విషయం తెలిసిందే. అదే నెల 25వ తేదీన సోమేశ్వరిని గుర్తించి కుటుంబీకులకు అప్పగించారు.
- జూలై 24వ తేదీన శ్రీకాళహస్తి మండలం అమ్మపాళేనికి చెందిన బండి సురేష్ దంపతుల ఏడేళ్ల చిన్నారి నందినిని పీఏసీ-4 వద్ద ఓ మహిళ కిడ్నాప్ చేసింది. ఫుటేజ్ ఆధారంగా 28వ తేదీన కిడ్నాపర్ షాలినిని బెంగళూరులో అరెస్ట్ చేశారు.
- తాజాగా ఆదివారం వేకువజామున రెండు గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు పసిబిడ్డను వదిలేసి వెళ్లారు. ఈ కేసును కూడా ఫుటేజ్ ఆధారంగానే పరిష్కరించారు. ఫుటేజ్‌లోని దృశ్యాలను టీవీ చానళ్లలో మనవడిని గుర్తించిన అమ్మమ్మ సోమవారం తిరుమలకు చేరుకున్నారు.

విస్తృత ప్రచారం

తిరుమలలో సీసీ కెమెరాలు ఉన్నాయని, నేరానికి పాల్పడినా, నిబంధనలు అతిక్రమించినా ఇట్టే దొరికిపోతారని విస్తృతంగా ప్రచారం చేయాలని టీటీడీ అధికారులు, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది భావిస్తున్నారు. నేరం జరిగినప్పుడు చర్యలు తీసుకునేకన్నా.. నేరాలే జరగకుండా చేయాలని యోచిస్తున్నారు. ఇది పటిష్ఠమైన సీసీ కెమెరా వ్యవస్థ వల్లే సాధ్యమవుతుందన్న నిర్ణయానికి వచ్చారు. మరోవైపు త్వరలో అలిపిరి, కాలినడక మార్గాల్లో 24 ఫేస్ రికగ్నిషన్ కెమెరాలను ఏర్పాటు చేసి పాత నేరస్థులను అదుపుచేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తానికి తిరుమలలో జీరో క్రైం ఉండేలా పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.


కేసుల ఛేదనకు కీలక ఆధారాలుగా నిలిచిన ఫుటేజ్‌లు

'సీమ' అభివృద్ధిపై సీఎం దృష్టి సారించాలి

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

తిరుపతి (యశోదనగర్): రాయలసీమ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ సూచించారు. గురువారం యశోదనగర్‌లోని ఎంబీ భవన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరవు నన్ను చూసి పారిపోతుందని చెప్పిన చంద్రబాబు.. నిజంగానే సీఎంను చూసి వర్షం పారిపోయిందని ఎద్దేవా చేవారు. నాలుగేళ్లుగా కరవుతో సీమ ప్రజలు అల్లాడుతుంటే ఆయన మాత్రం నంద్యాల ఉప ఎన్నికలతో బిజీగా మారిపోయారన్నారు. పట్టిసీమ ప్రాజెక్టు డెల్టా వారికే ఉపయోగపడుతుంది తప్ప రాయలసీమ వారికి ఏ విధంగా ఉపయోగపడుతుందన్నారు. కృష్ణా జలాలు వస్తేనే పడమటి మండలాల్లో వ్యవసాయం సాగుతుందన్నారు.పంటలు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చిత్తూరు జిల్లాలో మన్నవరం ప్రాజెక్టు, కడపలో ఉక్కు కర్మాగారం ఏమయ్యాయని ప్రశ్నించారు.టీటీడీలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీకి నోచుకోవడం లేదని.. టీటీడీ అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి అనుమతి రావాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందారపు మురళీ, జిల్లా కార్యదర్శి కుమార్ రెడ్డి పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్


ఎన్టీఆర్ సర్కిల్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

మద్యంషాపులు తొలగించాలంటూ విద్యార్థుల రాస్తారోకో

పుంగనూరు: స్థానిక బైపాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం షాపులను వెంటనే తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్వీయూ కళాశాల విద్యార్థులు ర్యాలీగా ఎన్టీఆర్ సర్కిల్ చేరుకుని రాస్తారోకో నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. మద్యం షాపుల ఏర్పాటు వల్ల కళాశాల వద్ద మందుబాబులతో ఇబ్బందులు పడుతున్నా మని, ఒంటరిగా రోడ్డుపైకి రావాలంటే భయంగా ఉందని విద్యార్థులు వాపోయారు. మద్యం షాపులను తొలగించాలని తహసీల్దార్, ఎక్సైజ్, పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఆందోళనలు చేసినప్పుడు అధికారులు కొంత గడువు ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తొలగించడానికి కృషి చేస్తామని చెప్పడం తప్ప ఫలితం లేదన్నారు. వెంటనే మద్యం షాపులను తొలగించని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

వేతన బకాయిల కోసం చిత్తూరు షుగర్స్ ఉద్యోగుల ధర్నా

చిత్తూరు లీగల్: చక్కెర ఫ్యాక్టరీ పునఃప్రారంభించే ఆలోచన లేకుంటే మూసివేస్తున్నట్లయినా ప్రకటించండి.. లేదంటే ప్రభుత్వం కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని చిత్తూరు కో-ఆపరేటివ్ షుగర్స్ లిమిటెడ్ ప్రొగ్రెసివ్ వర్కర్స్ యూనియన్ నేతలు లోకనాథరెడ్డి, ప్రసాదరెడ్డి డిమాండ్ చేశారు. అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలంటూ చిత్తూరు షుగర్స్ కార్మికులు, ఉద్యోగులు గురువారం నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 43 నెలలుగా జీతభత్యాల్లేక కార్మికులు వీధిన పడినా ప్రభుత్వం పట్టించుకోక పోవడం న్యాయంకాదన్నారు. ఉద్యోగులు, కార్మికులకు జీతభత్యాల రూపంలో రూ.22 కోట్లు రావాల్సి ఉందన్నారు. ఫ్యాక్టరీ భవనాలను పౌరసరఫరాల శాఖ గోదాములకు, గిరిజన సహకార సంస్థకు ఇచ్చారన్నారు. నెలవారీ రూ.లక్షల ఆదాయం వస్తోందనీ, ఆ నిధులతో తమ బకాయిలు తీర్చాలని కోరారు. నష్టాల పేరిట ముందస్తు సమాచారం లేకుండానే ఫ్యాక్టరీని మూసివేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కార్మిక కుటుంబాలకు మూడుపూటలా తిండి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీలో రూ.రెండు కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు పాడైనా పట్టించుకునే వారు లేరన్నారు. కాగా, షుగర్ ఫ్యాక్టరీ నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులు శ్రీనివాసులు, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, గిరి, శాంతియుత ఉద్యమనేత ఈదల వెంకటాచలం నాయుడు, బాబురెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న చిత్తూరు షుగర్స్ ఉద్యోగులు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ : కూలీ మృతి

ములకలచెరువు: ముంబై-చెన్నై జాతీయ రహదారిలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..మండలంలోని వేపూరికోట పంచాయతీ ఆర్‌ఎస్‌కొత్తపల్లెకు చెందిన సయ్యద్‌వల్లి పుట్టుకతో మూగవాడు.కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య అమ్మాజి, కుమార్తె అమీదలు ఉన్నారు. ఈ క్రమంలో మదనపల్లెలో సొంత పనుల నిమిత్తం సయ్యద్‌వల్లి ఇదే గ్రామానికి చెందిన మహ్మద్‌బాషాతో కలసి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు.వీరి ద్విచక్రవాహనం మార్గమధ్యంలోని వేపూరికోట క్రాస్ వద్దకు వచ్చేసరికి మదనపల్లె నుంచి కదిరి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెనుక కూర్చొన్న సయ్యద్‌వల్లి తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది మధుసూదనX , రమేష్‌లు ప్రథమ చికిత్సలు అందించి మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతికి తరలిస్తుండగా సయ్యద్‌వల్లి(38) మార్గమధ్యంలో మృతి చెందాడు. ప్రమాదంలో మరోవ్యక్తి మహ్మద్‌బాషా(40)కు కాలు విరగడంతో చికిత్సపొందుతున్నాడు. సంఘటనాస్థలాన్ని సీఐ రుషికేశవ, ఎస్‌ఐ ఈశ్వరయ్యలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.కాగా సయ్యద్‌వల్లి మృతితో ఆర్‌ఎస్‌కొత్తపల్లెతో పాటు స్వగ్రామమైన కదిరినాథునికోటలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతిచెందిన సయ్యద్‌వల్లి, (ఇన్‌సెట్‌లో) సయ్యద్‌వల్లి - ఫైల్ ఫొటో

అనుమానాస్పద స్థితిలో టాక్సీ డ్రైవర్ మృతి

తిరుపతి (నేరవిభాగం): ఎస్వీ జూపార్క్ సమీపంలోని ఎన్‌సీసీ క్వార్టర్స్ అటవీప్రాంతంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎమ్మార్‌పల్లి ఎస్సై కృష్ణమనాయుడు, మృతుడి సోదరుడు ఎల్లయ్య తెలిపిన వివరాల మేరకు... తిరుమలలో నివాసముంటున్న మహేష్ (24) టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య కృష్ణకుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా మహేష్ గతనెల 7వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈక్రమంలో బుధవారం ఎంఆర్ పల్లె పోలీసులు సైన్స్ సెంటర్ అటవీ ప్రాంతం వద్ద మృతదేహాన్ని గుర్తించారు. పూర్తిగా కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. మరణించి నెలరోజులు గడిచినట్టు పోలీసులు నిర్ధారించారు. మృతదేహానికి సమీపంలో ఆధార్‌కార్డు, ఏటీఎం కార్డు ఉండడంతో దాని ద్వారా మృతుడు మహేష్‌గా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఎస్వీమెడికల్ కళాశాలకు తరలించారు. ఇదిలా ఉంటే మృతుడి సోదరుడు మాత్రం తన తండ్రి గతనెలలో తిరుమలలో అనుమానాస్పదంగా మృతిచెందాడని, నెలరోజుల వ్యవధిలో తమ్ముడు కూడా అదేతరహాలో మృతిచెందడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాగా పోలీసులు మాత్రం పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చేవరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేస్తామని తెలిపారు.



మహేష్ (ఫైల్‌ఫొటో)

ముచ్చటగా ముగ్గురు !

కుప్పం : కుప్పం పట్టణంలోని ప్రియ నర్సింగ్ హోంలో ఓ మహిళ గురువారం ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలను ప్రసవించింది. కొత్తపేటకు చెందిన గోపి భార్య కళావతి పురిటి నొప్పులు రావడంతో ఆ నర్సింగ్ హోంలో చేరింది. ఈమెను ప్రముఖ సర్జనX డా సుధీర్ పరీక్షించి గర్భంలో ముగ్గురు బిడ్డలున్నట్లు నిర్ధారించారు. గురువారం సాయంత్రం శస్త్ర చికిత్స చేయగా ఈ కాన్పులో ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడ పిల్లకు జన్మనిచ్చింది. ఆమెకు తొలి కాన్పు కావడం విశేషం. పుట్టిన బిడ్డలు ఒక్కొక్కరు 2.5 కిలోల బరువు ఉన్నట్లు డా సుధీర్ తెలిపారు.తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు.



కళావతి ప్రసవించిన బిడ్డలతో డాక్టర్ సుధీర్

ఆటో ఢీకొని నాలుగేళ్ళ చిన్నారి మృతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గిరిజన కాలనీలో గురువారం ఆటో ఢీకొని ఓ చిన్నారి మృతి చెందింది. గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమార్తె వైష్ణవి (4) ఇంటి వద్ద పాల ఆటో దగ్గర ఆడుకుంటుండగా డ్రైవర్ కృష్టయ్య చిన్నారిని గమనించకుండా ఆటోను ముందుకు నడిపాడు. దీంతో ఆటోకు తగిలించి ఉన్న పాల క్యాన్లు తగలడంతో వైష్ణవి కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పోందుతూ మృతి చెందినట్లు ఏఎస్‌ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో టీటీడీ ఉద్యోగి మృతి

ఏర్పేడు: ఏర్పేడు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో టీటీడీ ఉద్యోగి వెంకటముని (55) మృతి చెందాడు. తిరుపతి న్యూఇందిరా నగర్‌కు చెందిన వెంకటముని సొంత పనుల నిమిత్తం గురువారం ద్విచక్రవాహనంలో శ్రీకాళహస్తికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఏర్పేడు పోలీస్‌స్టేషనX సమీపంలో వాహనాల తనిఖీ కేంద్రం వద్ద రోడ్డుపై నిలిపివున్న లారీని ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయమైన అతడిని తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడివద్ద ఉన్న రూ.9,405 నగదు, బంగారు ఉంగరం, ఐడీ కార్డు, ఆధార్ కార్డును 108 సిబ్బంది రాజారెడ్డి, ప్రసాద్ కుటుంబసభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



మృతిచెందిన వెంకటముని

మందలింపుతో మనస్తాపం

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

భాకరాపేట: ఆకతాయిచేష్టలు చేస్తున్న ఇద్దరు విద్యార్థులను కళాశాల సిబ్బంది, తల్లిదండ్రులు, పోలీసులు మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గత శనివారం చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో విద్యార్థులు ఆకతాయి చేష్టలు చేస్తున్నారని స్థానికులు భాకరాపేట పోలీసులకు సమాచామందించారు. విద్యార్థులను కళాశాలలోకి తీసుకెళ్లి వారి తల్లిదండ్రుల సమక్షంలో పోలీసులు, కళాశాల సిబ్బంది కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థులు మన్సూర్‌ఆలీ, ఉపేంద్ర అదేరోజు చిట్టేచర్ల సమీపంలో గుళికలమందు తిన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వారిని చిన్నగొట్టిగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ఐరాల: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఎంసీ చైర్మన్ మురళీరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చక్కగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. ప్రభుత్వ సదుపాయాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం తులసీబాబు, పీడీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


యూనిఫాం పంపిణీలో మురళీరెడ్డి

ప్రత్యేక ప్రతిభావంతులను ఆదరించాలి


క్రీడా పోటీలు నిర్వహిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

పూతలపట్టు: ప్రత్యేక ప్రతిభావంతులను ఆదరించాలని ఎంఈవో కృష్ణారెడ్డి కోరారు. స్థానిక భవిత కేంద్రంలో గురువారం విద్యార్థులు, ప్రత్యేక ప్రతిభావంతులకు క్రీడలు, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహితకక్ష విద్యార్థులతో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సహితవిద్య సమన్వయకర్తలు గోపాలకృష్ణ, సుప్రజ, హెచ్ఎం సిద్ధయ్యమూర్తి, ఉపాధ్యాయులు గణేష్, రాజశేఖర్, నిర్మల పాల్గొన్నారు.

13 ఎర్రచందనం దుంగల స్వాధీనం
పోలీసుల అదుపులో ఐదుగురు కూలీలు

పాలసముద్రం: రూ.లక్ష విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఐదుగురు కూలీలను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశులు తెలిపారు. మండలంలోని వెంగళ్రాజుకుప్పం పంచాయతీ కనికాపురం దళితవాడకు చెందిన రాజా(20), భాస్కర్(30), ప్రతాప్(24), కృష్ణమూర్తి(40), రాకేష్(27), రజిని(22), యేసయ్య(41) ఎర్రచందనం రవాణా చేస్తున్నారు. పొలంగట్టు, అటవీప్రాంతాల్లోని ఎర్రచందనం చెట్లను నరికి ఆముదాల సమీపంలోని అటవీ ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. ముందస్తు సమాచారంతో గురువారం పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు జరిపారు. రాజా, భాస్కర్, ప్రతాప్, కృష్ణమూర్తి, రాకేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కూలీలు రజిని, యేసయ్య, చిత్తూరుకు చెందిన ఎర్రచందన వ్యాపారి ధనంజయలు పరారైనట్లు ఎస్ఐ తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ మండలం బి.నరసింగరాయనిపేట ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం డీజిల్ మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ కోర్సుల్లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ప్రధానాచార్యులు, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, బి.నరసింగరాయనిపేట, చిత్తూరు రూరల్ మండలం చిరునామాకు ఈనెల 15వతేదీలోపు పంపాలని కోరారు. ఇతర వివరాలకు నెం.8886882203ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రెయిన్ గన్లతో పంటల రక్షణ

తవణంపల్లె: రెయిన్ గన్ తో రైతులు వేరుశనగ పంటను రక్షించుకోవాలని ఏవో రజనీకుమారి కోరారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో 24 రెయిన్ గన్లు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. వర్షాభావ పరిస్థితులతో పంట బెట్టకు గురై నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. వెంటనే నీటి తడులు అందించి పూతదశలో ఉన్న పంటను కాపాడుకోవాలని సూచించారు.

సక్రమంగా పౌష్టికాహారం అందించాలి

యాదమరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో పారిజాతం పేర్కొన్నారు. గురువారం ఆమె మండలంలోని దాసరాపల్లె ఆదిఆంధ్రవాడ, ఎర్రచేనులోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు పౌష్టికాహారం అందక పోవడంపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో చిన్నపిల్లలు ఆకలితో అలమటించడం ఏమైనా బాగుందా అని ఎంపీడీవో మండిపడ్డారు. ఇకపై ఇలా జరిగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆమె హెచ్చరించారు.

ప్రతి చిన్నారికీ ఎంఆర్ టీకా వేయించాలి

యాదమరి: మండలంలోని పిల్లలందరికీ ఎంఆర్ టీకా తప్పనిసరిగా వేయించాలని పీహెచ్‌సీ డాక్టర్ తనూజ అన్నారు. గురువారం జరిగిన స్థానిక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 9 నెలల నుంచి 15 ఏళ్లున్న పిల్లలకు టీకా వేయించే బాధ్యత తల్లిదండ్రులదే అన్నారు. ఇప్పటి వరకు పీహెచ్‌సీ పరిధిలో 632 మందికి వ్యాక్సిన్ వేశామన్నారు. టీకాపై అపోహలు అవసరం లేదనీ, వందశాతం సురక్షితమైందని వివరించారు.

ఐరాలలో: మండలంలోని ప్రతి చిన్నారికీ ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని వైస్ ఎంపీపీ ధనంజయనాయుడు కోరారు. నాంపల్లె జడ్పీ హైస్కూల్లో జరిగిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎంఆర్ వ్యాక్సిన్‌తో రెండు ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలను రక్షించవచ్చని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దబ్బ, వైద్యాధికారి లీల, ఎంపీహెచ్‌వో ఈశ్వరయ్య, ఎంపీహెచ్ఏ రమాదేవి పాల్గొన్నారు.

పాకాలలో: మీజిల్స్, రూబెల్లా వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి తల్లిదండ్రులు పిల్లలను ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సురేఖ కోరారు. గురువారం పాకాల ఎన్వీఎన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంఆర్ టీకా పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో బాబ్జీ, హెచ్ఎం ఎస్.లక్ష్మయ్య, జ్యోతి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాక్సిన్ పంపిణీలో వైస్ ఎంపీపీ

విద్యార్థులకు బోధన సామగ్రి వితరణ


నోటు పుస్తకాల పంపిణీలో మునీశ్వరరెడ్డి తదితరులు

పాకాల: మండలంలోని ఓబులశెట్టివారిపల్లె, మద్దినాయనిపల్లె, గానుగపెంట పంచాయతీల పరిధిలోని విద్యార్థులకు గురువారం బోధన సామగ్రి పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా నచ్చుకూరు కృష్ణమ్మ, కృష్ణారెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ మునీశ్వరరెడ్డి విద్యార్థులకు నోటుపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సురేష్, ఎంఈవో బాబ్జీ, సర్పంచ్‌లు ధనమ్మ, లక్ష్మీసుధ, రాధ, సతీష్, టీడీపీ నాయకులు ఎం.వెంకటేష్‌బాబు, బి.నాగరాజ నాయుడు, బొల్లినేని విశ్వనాథరావు, ఎం.కిశోర్ నాయుడు, అరుణ, జయదేవ్, ఆనంద, చంద్ర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

గంగాధరనెల్లూరు: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని తహసీల్దార్ పి.సుశీల అన్నారు. స్థానిక హౌసింగ్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆమె గృహనిర్మాణ శాఖాధికారులతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ ప్రతి నీటిబొట్టు భూమిలోకి ఇంకిపోవాలనీ, ఇందుకు ప్లాస్టిక్ వస్తువుల నిషేధం అవసరమన్నారు. హౌసింగ్ ఏఈ వెంకటరమణ మాట్లాడుతూ వనం-మనం కార్యక్రమం కింద జామ, సపోటా, మామిడి, కొబ్బరి, కానుగ మొక్కలు నాటినట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ స్వామిదాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు యామిని, దాము, డేటాఎంట్రీ ఆపరేటర్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న తహసీల్దార్ సుశీల

'అన్న అమృతహస్తం' పథకానికి సహకరించాలి

తవణంపల్లె: అంగన్ వాడీ కేంద్రాల్లో అమలవుతున్న అన్న అమృత హస్తం పథక విజయవంతానికి సర్పంచ్ లు, కార్యదర్శులు సహకరించాలని ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ సతీష్ కోరారు. గురువారం జరిగిన స్థానిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించడమే పథక లక్ష్యమన్నారు. ఇందుకు అవసరమైన కూరగాయలు తదితర వాటికి రూ.5వేల పంచాయతీ నిధులు ఇస్తున్నట్లు చెప్పారు.

చెక్‌డ్యామ్ పనులు వేగవంతం చేయండి: ఎస్ఈ


పల్లెచెరువులో చెక్‌డ్యామ్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ

తవణంపల్లె: నీరు-చెట్టు పథకం కింద మండలంలో జరుగుతున్న చెక్ డ్యామ్ పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ ఎస్ఈ శివరామకృష్ణ సూచించారు. మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లెలో రూ.7.5లక్షలు, దిగువ మాఘంలో రూ.7లక్షలు, యడమలవారిపల్లెలో రూ.6.05లక్షలు, పల్లెచెరువులో రూ.28 లక్షలతో నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వర్షాలు రాకముందే పనులను పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలనీ, లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణమూర్తి, డీఈ ఈశ్వరప్ప, ఏఈ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు హైస్కూళ్లకు కొత్త పీడీలు

గంగాధరనెల్లూరు: మండలంలోని ఐదు హైస్కూళ్లకు కొత్తగా ఫిజికల్ డైరక్టర్లు బదిలీపై వచ్చారు. ఇందులో భాగంగా.. గంగాధరనెల్లూరు హైస్కూల్ పీడీ కోమల నెల్లేపల్లె, అక్కడ పనిచేస్తున్న నాగలక్ష్మి తూగుండ్రానికి, ఐరాల మండలం కాణిపాకం హైస్కూల్ పీడీ సెల్వపాండియన్ గంగాధరనెల్లూరుకు, కార్వేటినగరం మండలం కత్తిరపల్లె హైస్కూల్లో పనిచేస్తున్న రవి మేనాటంపల్లె(సిద్దేశ్వరకొండ)కు, తూగుండ్రం హైస్కూల్లో పనిచేస్తున్న దామోదరం గుడిపాల మండలం నరహరిపేటకు, మేనాటంపల్లె హైస్కూల్లో పీడీగా పనిచేస్తున్న గుర్రప్ప విజయపురం మండలం పన్నూరుకు బదిలీ అయ్యారు.

సినిమా గైడ్

చిత్తూరు

రాఘవ	డీజే
దేవి	నిన్నుకోరి
గురునాథ	పిదా
ఎంఎస్ఆర్	మాయామాల్
విజయలక్ష్మి	గౌతమ్‌నంద
చాణక్య	నక్షత్రం
వెంకటేశ్వర	జబ్‌హ్యారీ మెట్ సెజల్(త)
ఆనంద్	దండుపాళ్యం-2

వరసిద్ధుడికి దాతల విరాళం
దక్షిణామూర్తికి వెండి తొడుగు

ఐరాల(కాణిపాకం): వరసిద్ధుడి అన్నదాన కార్యక్రమానికి అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన నారాయణస్వామి రూ.లక్ష విరాళంగా అందించినట్లు ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. తిరుపతికి చెందిన యుధీర్‌కుమార్ మణికంఠేశ్వర ఆలయంలో వెలసిన దక్షిణామూర్తికి కేజీ బరువున్న వెండి తొడుగును విరాళంగా అందించారన్నారు. అనంతరం విరాళ దాతలకు అధికారులు స్వామి దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కేశవరావు, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వరలక్ష్మీ వ్రతం

వరసిద్ధుడి అనుబంధ వరదరాజస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. ఉదయం 7 గంటలకు గరుడసేవ, 8 గంటలకు మూలవిరాట్‌కు అభిషేకం, 10 గంటలకు స్నపన తిరుమంజనం, 12 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు వివరించారు. రాత్రి కల్పవృక్ష వాహనసేవ జరుగుతుందనీ, భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం నిర్వహిస్తామని ఈవో వివరించారు. ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


వెండి తొడుగు అందజేస్తున్న యుధీర్‌కుమార్



ఈవీఎంలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఈవీఎంల తనిఖీ

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టరేట్ ప్రాంగణంలోని గోడౌన్లలో భద్రపరచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పరిశీలన గురువారం జరిగింది. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత అన్ని నియోజకవర్గాల నుంచి తెచ్చిన ఈవీఎంలను ఇక్కడ భద్రపరిచారు. కాగా, 2006కు ముందు నుంచి గోడౌన్లలో భద్రపరిచి, ఇప్పటి వరకు వినియోగించని ఈవీఎంలను ఎన్నికల విభాగం సిబ్బంది తనిఖీ చేశారు.

కిటకిటలాడిన నగర వీధులు

చిత్తూరు కల్చరల్: జగన్మాత మూడురూపాల్లో లక్ష్మీదేవి రూపం ఒకటి. భక్తిశ్రద్ధలతో తనను కొలిచే వారికి సిరిసంపదలను ప్రసాదించే దేవత వరలక్ష్మి. కాగా, శుక్రవారం జరిగే వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని గురువారం నగర వీధులు జనంతో కిటకిటలాడాయి. చర్చివీధిలోని పూజా సామాగ్రి దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. ఇదే అదనుగా వ్యాపారులు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు వస్తువులను విక్రయించారు. సాధారణంగా అరటి పిలకలు జత రూ.70 ఉండగా రూ.వంద నుంచి రూ.150 వరకు వసూలు చేశారు. మొగలిరేకులు, తామరపువ్వులు, మామిడి ఆకులు ధరలు ఆకాశాన్నంటాయి. కొనుగోలుదారులతో చర్చివీధి రద్దీగా మారడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. కాగా, వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని నగరంలోని అమ్మవారి ఆలయాలను నిర్వాహకులు సుందరంగా ముస్తాబు చేశారు.



చర్చివీధిలో పూజా సామాగ్రి కొనుగోళ్లు

నిధులను మళ్లిస్తే ఊరుకోం

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

చిత్తూరు రూరల్: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిధులను ఇతర పథకాలకు మళ్లిస్తే ఊరుకోమని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.నాగరాజన్ హెచ్చరించారు. గురువారం నగర మార్కెట్ చౌక్ వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడం తప్పుకాదనీ, ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. అయితే కార్మికుల నిధి నుంచి రూ.20 కోట్లను తరలించడం సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికశాఖ కేటాయించిన నిధులను వెనక్కి తీసుకోకుంటే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎం.విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ముగంరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. కార్మికులంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ముత్తుకుమార్, మునస్వామి, రామచంద్ర, పంజా పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

పురపాలక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

ఫ్యాప్టో నాయకుల ఆందోళన



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

చిత్తూరు రూరల్: పురపాలక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) నేతలు డిమాండ్ చేశారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు పి.తులసీనాథం నాయుడు మాట్లాడుతూ.. పదోతరగతి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులను ఆంగ్ల మీడియం వైపు తరలిస్తే ఇబ్బంది పడతారన్నారు. ఇప్పటికీ తెలుగు మీడియం పాఠ్య పుస్తకాల పంపిణీ జాడ లేదని వాపోయారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సహదేవ నాయుడు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల సర్వీసురూల్స్ అమలులో నెలకొన్న సమస్యలను తొలగించాలన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గంటామోహన్ మాట్లాడుతూ మున్సిపల్ టీచర్లకు జీపీఎఫ్ కల్పించాలనీ, అర్ధవేతన సెలవులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఫ్యాప్టో నాయకులు ప్రసూన, ఎం.సుబ్రహ్మణ్యం, మోహన్, వేణుగోపాల్, విజయలక్ష్మి, పరంధామ నాయుడు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మజ్దూర్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా రాజాచంద్ర

చిత్తూరు కల్చరల్: బీజేపీ మజ్దూర్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నగరానికి చెందిన కె.ఎం.రాజాచంద్ర యాదవ్‌ను నియమించినట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో రాజాచంద్రకు బీజేపీ నాయకులు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరు బీజేపీ అనీ, కష్టపడి పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నగరాధ్యక్షుడు మణి నాయుడు, ప్రధాన కార్యదర్శి రామభద్ర, కార్యదర్శి మహేష్, నాయకులు గోకుల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ ఏజెంట్‌పై చర్యలు తీసుకోండి

ఎస్పీకి కార్వేటినగరం రైతుల ఫిర్యాదు



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న రైతులు

చిత్తూరు టౌన్: తిరుపతికి చెందిన ఓ మామిడి కాయల కమీషన్ ఏజెంట్ తమను వేధిస్తున్నాడంటూ కార్వేటినగరానికి చెందిన పలువురు ఎస్పీ రాజశేఖర్ బాబుకు ఫిర్యాదు చేశారు. జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఆయన్ను కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బాధితులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి మార్కెట్ యార్డులో ఓ వ్యక్తి మామిడి కాయల కమీషన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఆయన కార్వేటినగరానికి చెందిన 30 మంది రైతుల నుంచి కాయలను తీసుకెళ్లాడన్నారు. అయితే ఆయన నగదు చెల్లించకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడనీ, ఈ విషయమై న్యాయం చేయాలని ఎస్పీకి విన్నవించారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు



చిత్తూరు కల్చరల్: సమగ్ర సస్యరక్షణతో పంటల అధిక దిగుబడులు సాధ్యమని ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాజశేఖర్ నాయుడు తెలిపారు. గురువారం చిత్తూరు రూరల్ మండలం పి.కొత్తూరు, చెర్లోపల్లె, కమ్మపల్లెలో సాగవుతున్న వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వేరుశనగ పంటను ఆకుముడత తెగుళ్లు ఆశించినట్లు చెప్పారు. వీటి నివారణకు ఎకరాకు క్వినాల్‌ఫాస్ 400 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 320 మి.లీ., క్లోరిఫైరిఫాస్ 500 మి.లీ.ను 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. కలుపు నివారణకు ఇమాజిత్‌ఫర్ 250 మి.లీను 200 లీటర్ల నీటితో కలిపి చాళ్ల మధ్యలో పిచికారీ చేయాల్సి ఉందన్నారు. అదును దాటి పంట సాగు చేసే రైతులు రాగి, కంది తదితర పంటలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారిణి జయంతి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

14, 15వతేదీల్లో ఆడికృత్తిక మహోత్సవం



ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

చిత్తూరు కల్చరల్: నగర చెంగల్వరాయకొండపై వెలసిన వళ్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 14, 15న ఆడికృత్తిక మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ సంపత్ తెలిపారు. గురువారం మహోత్సవ పోస్టరును ఎమ్మెల్యే సత్యప్రభ తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం ఉదయం స్వామి భరణి అలంకారంలో దర్శనమిస్తారని చెప్పారు. మంగళవారం వేకువజామున సుబ్రహ్మణ్యుడికి మహాభిషేకం, మహానైవేద్యం జరుగుతుందని వివరించారు. ఆలయ ఛైర్మన్ సంపత్ మాట్లాడుతూ 15న ఉత్సవమూర్తుల ఊరేగింపు, 16న శాంతి అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కెన్నడీ, సెల్వకుమార్, గీతాంజలి పాల్గొన్నారు.

నేటి నుంచి మురకంబట్టు సత్యమ్మ ఉత్సవాలు



చిత్తూరు రూరల్: నగర పరిధిలోని మురకంబట్టులో వెలసిన గ్రామదేవత సత్యమ్మ ఉత్సవాలు శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి అమ్మవారికి పాలాభిషేకం, అంబళ్ల సమర్పణ, భక్తులకు అన్నదానం, సత్యమ్మ యూత్ ఆధ్వర్యంలో గజమాల, పొంగళ్ల సమర్పణ, అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు జరగనుంది. రాత్రి వడ్డార్లపల్లె చెంగల్రాయ నాయుడు, తులసమ్మ దంపతుల ఆధ్వర్యంలో సత్యమ్మకు ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. శనివారం రాత్రి తిరుపతి శృతి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో భక్తిపాటలు, ఆదివారం సాయంత్రం వసంతోత్సవం, అమ్మవారి నిమజ్జనం జరగనుంది.

కేశవరెడ్డి స్కూల్‌లో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

చిత్తూరు రూరల్: నగర మురుగానిపల్లె కేశవరెడ్డి పాఠశాలలో గురువారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణలో హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఉపాధ్యాయులు వ్రతం ప్రాముఖ్యతను వివరించారు. కాగా, న్యూ బాలాజీకాలనీలోని పాఠశాలలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరిపారు. కార్యక్రమంలో కేశవరెడ్డి ఏజీఎం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా టీచర్ల బదిలీ కౌన్సెలింగ్

● బదిలీ కోరుకునే ప్రతి టీచర్‌కు ఎస్‌ఎంఎస్‌లు
● విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి


ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడుతోన్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

చిత్తూరు సిటీ: టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌ను నిత్యం ఉదయం ఆరు గంటలకు ప్రారంభించి సాయంత్రం ఆరుగంటలకు ముగిస్తామని విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్జేడీ) బి.ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లాలో జరిగే టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ పరిశీలకులుగా ప్రభుత్వం ఆయన్ను నియమించిన విషయం విదితమే. దీంతో గురువారం మధ్యాహ్నం ఆయన పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ... కౌన్సెలింగ్ పూర్తయ్యేంత వరకు జిల్లా పరిశీలకుడిగా టీచర్లకు ఎలాంటి అనుమానాలొచ్చినా నివృత్తి చేస్తానని చెప్పారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని ముందస్తుగా ఆయా టీచర్ల సెల్‌ఫోన్‌కు ఎస్‌ఎంఎస్ చేయడం జరుగుతోందని వివరించారు. ఆ తర్వాతే రావాల్సి ఉందనీ, కౌన్సెలింగ్‌లో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. కౌన్సెలింగ్ సెంటర్ లోపల, వెయిటింగ్ హాలు, రెండు కేంద్రాల వద్ద ప్రత్యేక స్ర్కీన్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. హాజరయ్యే టీచర్లకు తాగు నీరు, కుర్చీలు, షామియానా తదితర వసతులను కల్పించామని చెప్పారు. టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహిస్తామనీ, దీనిపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని సూచించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆయన్ను కలిసి వినతిపత్రాలను అందజేశారు. వీరిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్, వైఎస్ఆర్‌టీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంటామోహన్ తదితరులు ఉన్నారు.

నేడు నాన్ లాంగ్వేజస్ స్కూల్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

చిత్తూరు సిటీ: జిల్లాలోని నాన్ లాంగ్వేజస్ స్కూల్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆర్జేడీ ప్రతాపరెడ్డి గురువారం రాత్రి ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈ కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. కాగా, మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రొవిజినల్ జాబితా ప్రకటన వెలువడుతుందనీ, అనంతరం నాన్ లాంగ్వేజస్ కింద ఉర్దూ, తమిళం మీడియా స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లాకు చెందిన ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లకు సంబంధించిన ప్రొవిజినల్, సీనియారిటీ జాబితా కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు గుర్తుచేశారు. దీనికి సంబంధించి అభ్యంతరాలుంటే శుక్రవారం సాయంత్రం 4 గంటల్లోగా డీఈవోకు అప్పీలు చేసుకోవాలనీ, ఆ తర్వాత వస్తే పరిగణనలోకి తీసుకోమని ఆయన ఆర్జేడీ చేశారు.

వికటిస్తున్న ఎంఆర్ వ్యాక్సిన్

పిల్లలకు జ్వరం, శరీరంపై వాపులు, దద్దులు ● ప్రమాదం లేదంటున్న వైద్యులు

చిత్తూరు టౌన్: జిల్లాలో ఈనెల 1వతేదీ నుంచి 9 నెలల నుంచి 15 ఏళ్లలోపున్న పిల్లలకు ఎంఆర్ టీకా పంపిణీ జరుగుతున్న విషయం విదితమే. తట్టు, రుబెల్లా వ్యాధుల నిర్మూలన లక్ష్యంగా వేస్తున్న వ్యాక్సిన్ వికటిస్తోంది. టీకా వేసుకున్న పలువురు పిల్లలు జ్వరం, ముఖం, శరీర భాగాల్లో వాపు, దద్దుల బారిన పడుతున్నారు. అయితే వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న ప్రతి వంద మంది పిల్లల్లో ఇద్దరు లేదా ముగ్గురికి ఇలా అవడం సహజమని వైదులు చెబుతున్నారు. చిన్నపాటి సమస్యలు తప్ప ఇదేమీ ప్రమాదకరం కాదని వివరిస్తున్నారు. వ్యాక్సిన్ వేసుకున్న 48 గంటల తర్వాత కొందరికి చేతులు, కాళ్లలో ఎరుపురంగు దద్దులు వస్తాయనీ, దీనిపై పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందరాదని సూచిస్తున్నారు. ఎంఆర్ వ్యాక్సినేషన్‌పై వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ కొరవడడంతో ఈ కార్యక్రమఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులు రోజువారీ రిపోర్టులకే పరిమితమవుతూ సరైన


చిత్తూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాదీశ్వరన్

ప్రచారం నిర్వహించలేదని తెలుస్తోంది.

చికిత్స పొందుతున్న విద్యార్థి మాదీశ్వరన్

చిత్తూరు నగర సమీపంలోని బండపల్లెకు చెందిన ఎత్తిరాజులు కుమారుడు మాదీశ్వరన్(5) ఈనెల 1న ఎంఆర్ వ్యాక్సిన్ వేయించుకున్నాడు. గురువారం ఉదయం విద్యార్థికి జ్వరం రావడంతో పాటు కను రెప్పల వాపు, చేతులపై దద్దులతో ఇబ్బంది పడ్డాడు. దీంతో బాలుడిని తల్లిదండ్రులు చికిత్స కోసం చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. మాదీశ్వరన్‌కు ఎలాంటి ప్రమాదం లేదనీ శుక్రవారం డిచ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు.

భయాందోళన అవసరం లేదు....



పిల్లలకు ఎంఆర్ టీకాలు వేయించిన తల్లిదండ్రులు దీనిపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యాధి నిరోధక శక్తి వారికి జ్వరం లేదా శరీరంపై దద్దులు రావడం జరుగుతుంది. సమీప వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయిస్తే సరిపోతుంది. జ్వరం ఎక్కువగా ఉంటే పారాసిటమాల్ మాత్రలు వేసుకుంటే ఇబ్బందులుండవు.

- ఎస్.ఎన్.మూర్తి, చిన్నపిల్లల వైద్య నిపుణుడు

చిత్తశుద్ధి ఏదీ?

● తూతూమంత్రంగా ఎంఆర్ వ్యాక్సినేషన్
● వైద్యశాఖకు సహకరించని ఐసీడీఎస్, విద్యాశాఖ
● ఏఎన్ఎంలు, ఆశావర్కర్లపైనే భారం

చిత్తూరు టౌన్: ప్రాణాంతక తట్టు, రుబెల్లా వ్యాధుల నుంచి పిల్లలను రక్షించే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా ఎంఆర్ వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నారు. ఈనెల 1వతేదీ నుంచి మొదలైన కార్యక్రమం సెప్టెంబర్ 8వతేదీ వరకు జరుగుతుంది. ఐదువారాల పాటు జరిగే టీకా కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, స్ర్తీశిశు సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో విజయవంతంగా జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్, వలంటీర్ ఉంటారు. ఈ బృంద సభ్యులు పాఠశాలల వారీగా పర్యటించి విద్యార్థులకు టీకా పంపిణీ చేస్తున్నారు. అయితే ఆయా స్కూళ్లలో వ్యాక్సిన్ కు అర్హులైన పిల్లలు, హాజరయ్యారా లేక సెలవులో ఉన్నారా? తదితర వివరాలను హెచ్ ఎంలు అందుబాటులో ఉంచాల్సి ఉంది. ఈ విషయమై హెచ్ఎంలు, ఉపాధ్యాయుల నుంచి సహకారం అందడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. చివరికి ఎంఈవోలు కూడా టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించడం లేదని సమాచారం. ఇక బృందంలో అంగన్‌వాడీ వర్కర్లు లేకపోవడంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీవోలు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు..

స్ర్తీశిశు సంక్షేమం, విద్యాశాఖ అధికారులు సహకరించక పోవడంతో టీకా పంపిణీ బాధ్యత ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లపైనే పడింది. దీంతో రోజువారీ టీకా పంపిణీ లక్ష్యాలను చేరుకోలేక పోతున్నారు. వ్యాక్సిన్ ప్రారంభించే పాఠశాలకు ముందుగా ఏఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త, వలంటీర్ చేరుకోవాలి. అనంతరం ఏఎన్ఎం ఇంజక్షన్ ను సిరంజిలో లోడ్ చేసి పిల్లలకు వేయాల్సి ఉంది. సంబంధిత విద్యార్థికి ఆశా వర్కర్ మార్క్ చేసి టీకా వేసినట్లు ఓ ధృవపత్రం పిల్లలకు అందజేసి వారి ఫొటోలను ఏఎన్ఎం తీయడం, రికార్డుల్లో నమోదు చేయడం తదితర పనులు చేయాల్సి ఉంది. టీకా పంపిణీ సమయంలో ఈ పనులకు ఉపాధ్యాయుల సహకరించాల్సినా ఉత్సాహం చూపడం లేదని తెలిసింది. దీంతో ఒక్కో విద్యార్థిని ఇంజక్షన్ కోసం రావాలంటూ ఏఎన్ఎంలు తరగతి గదులకు వస్తూ ఇబ్బంది పడుతున్నారు. పిల్లల హాజరు, గైర్హాజరైన అర్హుల వివరాలడిగితే బదిలీల కౌన్సెలింగ్‌లో బిజీగా ఉన్నామన్న సమాధానం వస్తోంది. అన్నీ వెరసి ఫొటోలు తీసి, ధృవపత్రం అందజేసేందుకు అధిక సమయం పడుతోంది. ఈ లెక్కన రోజుకు ఓ ఏఎన్ఎం 200 మంది పిల్లలకు టీకాలు వేసి మధ్యాహ్నం ఒంటిగంటకు వైద్యశాఖ కార్యాలయానికి రిపోర్టు పంపాలి. అయితే అంగన్‌వాడీ వర్కర్ రాకపోవడం, ఉపాధ్యాయులు, హెచ్ఎంలు సహకరించక పోవడం, ఎంఈవోలు, సీడీపీవోల పర్యవేక్షణ కొరవడడంతో కార్యక్రమం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.

ఆలస్యంగా ప్రారంభమైన హెచ్‌ఎంల కౌన్సెలింగ్

● విద్యాశాఖ కమిషనర్ లాగిన్ లో సాంకేతిక సమస్యలు
● ఎట్టకేలకు రాత్రి ఏడు గంటలకు మొదలు

చిత్తూరు సిటీ: విద్యాశాఖ కమిషనర్ లాగిన్ లో సాంకేతిక సమస్యలు తదితర కారణాలతో గురువారం మధ్యాహ్నం జరగాల్సిన హెచ్ఎంల బదిలీ కౌన్సెలింగ్ ఐదు గంటల ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ ప్రక్రియ బుధవారం చేపట్టాల్సినా, టీచర్ల నుంచి పలు అభ్యంతరాలు రావడంతో ఒకరోజు ఆలస్యంగా మొదలు పెట్టారు. విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా 251 మంది రెగ్యులర్ హెచ్ఎంలు, 69 మంది అడహాక్ ప్రమోటీస్ హెచ్ఎంలు మధ్యాహ్నం ఒంటిగంటకే డీఈవో కార్యాలయం చేరుకున్నారు. అనంతరం అధికారులు పీసీఆర్ కళాశాలకు వెళ్లాలని సూచించడంతో అక్కడికి వెళ్లారు. కాగా, ఈనెల 15న తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షలో పాల్గొనేందుకు ఇన్‌చార్జి డీఈవో శామ్యూల్ తిరుపతికి వెళ్లారు. ఆయన సాయంత్రమైనా కౌన్సెలింగ్ కేంద్రానికి రాలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు విద్యాశాఖ కమిషనర్ లాగిన్ ఓపెన్ కాకపోవడంతో కౌన్సెలింగ్‌కు సంబంధించిన జాబితా వెలువడలేదు. దీంతో జిల్లా పరిశీలకులుగా వచ్చిన విద్యాశాఖ ఆర్జేడీ ప్రతాపరెడ్డి విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ సిబ్బందితో మాట్లాడి జాబితా వెలువడేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు రాత్రి ఏడుగంటల ప్రాంతంలో హెచ్ ఎంల ఖాళీల జాబితా, ఇటు సీనియారిటీ జాబితాను ప్రకటించాకే కౌన్సెలింగ్ మొదలైంది. అయితే రాత్రి పదకొండు గంటలైనా కౌన్సెలింగ్ కొనసాగుతూనే ఉంది. అంతవరకు వేచి ఉండే హెచ్ ఎంలు ఇబ్బంది పడకుండా కుర్చీలు, మంచినీరు తదితర వసతులను ఆర్జేడీ కల్పించారు.


పీసీఆర్ హైస్కూల్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు హాజరైన హెచ్ ఎంలు

ఆడికృత్తిక ఉత్సవాలను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న గురవయ్యనాయుడు, భ్రమరాంబ తదితరులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని విజ్ఞానగిరిలో ఉన్న కుమారస్వామి ఆలయంలో 10వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆడికృత్తిక ఉత్సవాలను జయప్రదం చేయాలని ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గురవయ్య నాయుడు, ఈవో భ్రమరాంబ కోరారు. గురువారం వారు ముక్కంటి ఆలయంలో ఆడికృత్తిక వార్షికోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలలో భాగంగా ఈ నెల 14న భరణి, 15న ఆడికృత్తిక, 16న తెప్పోత్సవం, 17న కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు నారాయణ యాదవ్, గుర్రప్పశెట్టి, పీఎం చంద్ర, కె.ఉమ, ప్రమీలమ్మ, ఏఈవో మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సరకుల సరఫరాకు అంతరాయం

సర్వర్‌డౌన్‌తో మూడ్రోజులుగా 17 శాతమే నిత్యావసరాల పంపిణీ ● పంపిణీకి దూరంగా 270 దుకాణాలు



చిత్తూరులోని ఓ చౌకదుకాణం వద్ద క్యూ(ఇన్‌సెట్) మొరాయించిన ఈపాస్ మిషన్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా చౌకదుకాణాల్లో ఈనెల నిత్యావసర సరకుల పంపిణీకి అంతరాయం ఏర్పడింది. సర్వర్ మొరాయింపుతో ఈపాస్ యంత్రాలు పనిచేయక పోవడమే ఇందుకు కారణం. దీంతో ప్రతి నెలా తొలి మూడురోజుల్లో 60 శాతానికిపైగా సరకుల పంపిణీ జరగాల్సినా, వందలాది దుకాణాల నుంచి బియ్యపుగింజ కూడా అందలేదు. జిల్లాలో 2852 రేషన్ షాపులుండగా, వీటి పరిధిలో 10,87,958 రేషన్ కార్డులున్నాయి. వీటికి సంబంధించి ప్రతినెలా 18,260 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ కావాల్సి ఉండగా, ఈపాస్ సర్వర్ వర్షన్ మార్పుతో సమస్య ఏర్పడింది. ఇది వరకు 4.5 వర్షన్‌లో సర్వర్ పనిచేస్తుండగా, 1వతేది నుంచి 4.6 వర్షన్‌కు అప్‌డేట్ చేశారు. దీంతో మరింత వేగంగా పనిచేయాల్సిన సర్వర్ మొరాయిస్తోంది. విషయం తెలియని కార్డుదారులు 1వతేది ఉదయం నుంచే చౌకదుకాణాల ముందు క్యూ కట్టారు. ఆ రోజు సర్వర్ డౌన్ కావడంతో అన్నిచోట్లా సరకుల పంపిణీ ఆగింది. బుధవారం అదే పరిస్థితి ఉండడంతో లబ్ధిదారులు ఉదయం నుంచి సాయంత్రం రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు పడ్డారు. కాగా, గురువారం మధ్యాహ్నం వరకు 17.81 శాతం అంటే, 1,94,450 కార్డు దారులకు బియ్యం పంపిణీ జరిగింది. సర్వర్ డౌన్‌తో 270 దుకాణాల్లో గింజ కూడా పంపిణీ కాలేదు. సర్వర్ పనిచేస్తుందన్న నమ్మకంతో పేదలు దుకాణాల ముందే గంటల తరబడి ఎదురుచూపులు చూస్తున్నారు. ఈ విషయమై డీఎస్వో చాముండేశ్వరి మాట్లాడుతూ.. సర్వర్‌లో ఏర్పడిన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో వర్షన్ మార్పు సమయంలో తలెత్తిన సాంకేతిక సమస్యను త్వరలో పరిష్కరిస్తామని వారు చెప్పారన్నారు.

హెచ్‌ఎం వేధిస్తున్నాడంటూ టీచర్లు,విద్యార్థుల ధర్నా



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రామసముద్రం : రామసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తులసీరాం వేధిస్తున్నాడంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం పాఠశాలలో ధర్నా చేపట్టారు.హెచ్‌ఎం తులసీరాం ఇక్కడకు వచ్చినప్పటి నుంచి తమతో పాటు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పీడీ రామచంద్ర, ఉపాధ్యాయుడు సుధాకర్ ఆరోపించారు.ప్రతి విషయానికీ ఉపాధ్యాయులను అవహేళనగా మాట్లాడుతున్నారని వాపోయారు.టీచర్లు శ్రీదేవి, జయశ్రీలకు రెండు నెలలుగా జీతాల్లేవని హెచ్‌ఎం వద్దకెళ్లి అడగ్గా ఎక్కువ మాట్లాడవద్దనడంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. ఉదయం 9.20గంటల నుంచి 11.20 గంటల వరకు తరగతులు జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గొడవల విషయం తెలుసుకుని హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కలెక్టరు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. హెచ్‌ఎం తులసీరాం మాట్లాడుతూ ఉపాధ్యాయులను సక్రమంగా నిర్వహించమంటే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

విద్యాపీఠంలో నేటినుంచి సంస్కృత సప్తాహం

తిరుపతి(రూరల్): సంస్కృత విద్యాపీఠంలో శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు సంస్కృత సప్తాహ సమారోహం జరుగుతుందని వర్సిటీ వీసీ ఆచార్య మురళీధరశర్మ తెలిపారు. వర్సిటీలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏటా శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సంస్కృత ఉత్సవాలు జరపడం ఆనవాయితీ అన్నారు.. సంస్కృతభాష ఆవిర్భావాన్ని ఉద్దేశించి దేశవ్యాప్తంగా ఉన్న సంస్కృత విద్యాలయాల్లో ఈ ఉత్సవం ఏడు రోజులపాటు నిర్వహిస్తారని, రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంలోనూ ఏడురోజులు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. శుక్రవారం సాయంత్రం సంస్కృత పద్యాలకనుగుణంగా చిత్రకారుడు సింగంపల్లి సత్యనారాయణ చిత్రలేఖనం, 5వతేదీ సంస్కృత కవులచే కవితాగానం, 6న విద్యాపీఠం విద్యార్థులకు శైక్షిక-సాంస్కృతిక స్పర్థలు, 7న గీతాపారాయణం,గీతాష్టావధానం,భజనలు, 8న విభిన్నదర్శనాలలో మోక్షం అనే అంశంపై జాతీయసదస్సు, 9న క్విజ్, 10వతేదీ బహుమతి ప్రదానం, అనంతరం విభిన్న పరిషత్తుల ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. ముఖ్య అతిథులుగా ఆచార్య రామకృష్ణమాచార్యులు, ముక్తేశ్వర



మాట్లాడుతున్న వీసీ మురళీధర శర్మ


రావు, స్వామి అనుపమానంద పాల్గొంటారని తెలిపారు. వర్సిటీ పీఆర్వో ఆచార్య దక్షిణామూర్తి పాల్గొన్నారు.

ఓ వర్గానికే సంస్కృతం అపోహ మాత్రమే

సంస్కృత భాష ఓవర్గానికి మాత్రమే అందుబాటులో ఉందనేది అపోహ మాత్రమేనని వీసీ పేర్కొన్నారు. ఆసక్తి ఉంటే విభిన్న వర్గాల వారు సంస్కృతం నేర్చుకునే వెసులుబాటు ఉందని చెప్పారు. సంస్కృత భాషను విశ్వవ్యాప్తం చేయాలని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. విద్యార్థులు, భాషాభిమానులు ముందుకొస్తే పదిరోజుల్లో సంస్కృతభాషను నేర్పించేలా చర్యలు చేపడుతామని వెల్లడించారు.

టంగ్ ట్విస్టర్స్

1.There those thousand thinkers were thinking how did the other three thieves go through.
2. Rory the warrior and Roger the worrier were reared wrongly in a rural brewery.
3.Green glass globes glow greenly.



సూక్తి

నీ సందేహం తీర్చడానికి ఎవరూ లేనప్పుడు నీ అనుభవమే నీకు మార్గదర్శి

చుక్కలు కలపండి



నవ్వుల్ నవ్వుల్

తల్లి : రవీ! తమ్ముడు ఎందుకు ఏడుస్తున్నాడు రా?
రవి : నేనే కొట్టానమ్మా!
తల్లి : ఎందుకు రా వెధవా!
రవి : నేనేం అడిగినా వాడు జవాబు చెప్పడం లేదు అమ్మా!
తల్లి : తమ్ముడికి ఇంకా మాటలు రాలేదు కదరా!
రవి : మరి ఆ మాట చెప్పొచ్చు కదమ్మా!
తల్లి : !!!!!!!!!!!!!!!!

మీకుతెలుసా?


'బీవర్' అనే జంతువు దంతాలు ఎప్పటికీ పెరుగుతూనే ఉంటాయి.



రంగులు అద్దండి



బొమ్మ గీయండి



ఔనా!



- మనిషి తన జీవిత కాలంలో సుమారు 25 సంవత్సరాలు నిద్రకు కేటాయిస్తాడు.
- అందులో ఆరు సంవత్సరాలు కలలకే సరిపోతాయి. రోజుకు మూడు నుంచి ఏడు కలలొస్తాయట.
- నిద్ర లేచిన నిమిషం లోపే దాదాపు 90 శాతం కలలను మరిచిపోతాం.





గోల్ఫ్ సాధించాడు

హరియాణాలోని పానిపట్‌కు సమీపంలో 'ఇస్రానా' గ్రామం ఉంటుంది. ఆ గ్రామంలో అడుగుపెడితే.. యువకులంతా కుస్తీపట్లలో మునిగిపోయి ఉంటారు. కానీ ఓ కుర్రాడు మాత్రం గోల్ఫ్ స్టిక్ పట్టుకుని పచ్చిక మైదానంలో సాధన చేస్తుంటాడు. అతడి పేరే 'శుభమ్ జగ్లాన్'. చిన్న గ్రామంలో పుట్టిన ఆ కుర్రాడు, ప్రపంచ గోల్ఫ్ వేదికలపై సత్తా చాటుతున్నాడు. గోల్ఫ్ క్రీడలో దూసుకెళ్తున్న శుభమ్ ఇప్పటికే 100కు పైగా టోర్నీల్లో విజేతగా నిలిచాడు.

పానిపట్‌లోని ఇస్రానాలో ఎక్కువమంది రెజ్లింగ్ సాధన చేస్తుంటారు. శుభమ్ జగ్లాన్ కుటుంబ సభ్యుల్లో కూడా రెజ్లింగ్‌లో పట్టు సాధించిన వారున్నారు. కానీ శుభమ్ మనసు మాత్రం మట్టికోర్టు దాటి.. పచ్చిక మైదానం వైపు ఆలోచించింది. గోల్ఫ్ ఆటపై మక్కువ పెంచుకున్నాడు. సరిగ్గా అదే సమయంలో కపూర్‌సింగ్ అనే ఓ ఎన్‌ఆర్‌ఐ 'ఇస్రానా'లో గోల్ఫ్ అకాడమీని ప్రారంభించాడు. ఐదేళ్ల వయసులో గోల్ఫ్‌ను సాధన చేయడం ప్రారంభించాడు శుభమ్. రోజు రోజుకూ ఆటలో రాటుదేలుతూ జాతీయ, అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నీల్లో సత్తా చాటాడు. ఇప్పటి వరకు దాదాపు 100కు పైగా టోర్నీల్లో విజేతగా నిలిచాడు.

"ఓ రోజు మా తాతయ్య మా గ్రామంలో కొత్తగా ప్రారంభించిన గోల్ఫ్ అకాడమీకి నన్ను తీసుకు వెళ్లాడు. అకాడమీ యజమాని కపూర్‌సింగ్‌తో నన్ను చేర్చుకోమని చెప్పాడు. అందరిలా నేను కూడా రెజ్లర్‌లా కాకుండా, మరేదైనా సాధించాలనే ఉద్దేశంతోనే ఆయన నన్ను గోల్ఫ్ అకాడమీలో చేర్చాడు. కానీ రెండు నెలల్లోనే ఆ అకాడమీని మూసివేశారు. గోల్ఫ్‌లో నా ప్రతిభను గమనించిన కపూర్ సార్, ఊరి నుంచి తిరిగి వెళ్తూ మా నాన్నతో నన్ను ప్రోత్సహించమని చెప్పారు. దాంతో మా ఇంటి వెనుక ఉన్న కొద్ది స్థలాన్ని నాన్న బాగు చేసి, గోల్ఫ్ మైదానంలా తీర్చిదిద్దారు. ఓ కంప్యూటర్ కొనిచ్చి, యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ, గోల్ఫ్ ఆటను నేర్చుకోమన్నారు. వారాంతాల్లో కర్నాల్ గోల్ఫ్ కోర్సుల వద్దకు నన్ను తీసుకెళ్లేవారు. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన 'ఢిల్లీ గోల్ఫ్ క్లబ్'కు ఓ రోజు ప్రత్యేకించి నన్ను తీసుకు వెళ్లారు నాన్న. దాని వ్యవస్థాపకుడు అమిత్ లుత్రాను కలిసి, నా గురించి వివరించారు. నా ఆటతీరును పరిశీలించిన ఆయన నన్ను వాళ్ల క్లబ్‌లో చేర్చుకున్నారు. అదే నా జీవితంలో మలుపు తీసుకు వచ్చింది. అంతే కాదు నాన్న నన్ను ఢిల్లీలోని 'లక్ష్మణ్ పబ్లిక్ స్కూల్లో' చేర్పించాడు.నా మకాం ఢిల్లీకి మారింది. ఉదయం స్కూల్లో పాఠాలు, సాయంత్రం గోల్ఫ్ క్లబ్‌లో సాధన. కొన్ని సంవత్సరాలుగా ఇదే నా జీవితం. నేను సాధించిన విజయాలు నాన్న కష్టాన్ని మరిపించాయి. అవి నాన్నను ఎంతో సంతోషపెట్టాయి'

- శుభమ్ జగ్లాన్

2013	2015	2016	2017
వరల్డ్ మాస్టర్స్ ఆఫ్ జూనియర్ గోల్ఫ్	జూనియర్ వరల్డ్ గోల్ఫ్ చాంపియన్‌షిప్	యూరోపియన్ జూనియర్ చాంపియన్‌షిప్	వెస్ట్‌బెంగాల్ జూనియర్ బాయ్స్ గోల్ఫ్ చాంపియన్‌షిప్

శుభమ్ విజేతగా నిలిచిన ప్రధాన టోర్నీలు

అమ్మపాలు అమృతం

చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం



అమ్మపాలు అమృతం. ఆ పాలు తిరుగులేని పోషకాహారం. అమ్మ ముర్రుపాలు శిశువులకు తొలి వ్యాక్సిన్X . శిశువులకు వ్యాధి నిరోధకశక్తిని ఇచ్చి.. కాచి కాపాడేది కూడా అమ్మ చనుబాలే. అమ్మపాలతో శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం ప్రాప్తిస్తుంది. ఎదుగుదలకు, రోగ నిరోధకశక్తి పెంచడానికి అవసరమైన అన్నిరకాల విటమిన్లు, ప్రొటీన్లు అమ్మపాలలో ఉంటాయి. ఇంతటి ప్రాధాన్యమున్న తల్లిపాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈనెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాల అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తోంది.

- శ్రీకాళహస్తి

పిల్లల సంపూర్ణ ఆర్యోగానికి తల్లి పాల పాత్ర వెలకట్టలేనిది. శిశువులకు త్వరగా ఆవు, గేదె పాలు పట్టడం వలన ఆరోగ్య సమస్యలకు కారణమవుతోందని కూడా సర్వేలో వెల్లడైంది. అయినా తల్లిపాలు ఇచ్చేవారి సంఖ్య అంత ఆశాజనకంగా ఉండటం లేదు. చాలా మంది చిన్నారులకు చనుబాలు చాలక తనువులు చాలిస్తున్నారని ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక తెలియజేసింది. సాధారణంగా శిశువు ప్రసవం జరిగిన గంటలోపే తల్లిపాలు పట్టాలి.అయితే చాలా మంది తల్లుల్లో పాలు ఉండటం లేదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే - 4 ప్రకారం దేశవ్యాప్తంగా కేవలం 41.6శాతం పిల్లలు మాత్రమే పుట్టిన మొదటి గంటలో అమ్మపాలు తాగుతున్నారు. అంటే 58.4శాతం నవజాత శిశువులు తల్లి చనుబాలకు నోచుకోలేకున్నారు. ఈ మధ్య కాలంలో ఆస్పత్రుల్లో ఎక్కువశాతం ప్రసవాలు జరుగుతున్నా.. అందరు తల్లులు ప్రసవించిన మొదటి గంటలో పిల్లలకు తల్లిపాలు ఇవ్వలేకున్నారు. 55శాతం పిల్లలు మాత్రమే మొదటి ఆరు నెలలు పూర్తికాలం తల్లిపాలు తాగుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో తేలింది. ఇక 6-8 నెలల వయసులో పిల్లలకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అందించే విషయంలో పదేళ్లలో 52.6శాతం నుంచి 42.7శాతానికి తగ్గింది. అంటే కేవలం 8.7శాతం పిల్లలు మాత్రమే 6-8 నెలల వయసులో తల్లిపాలతో పాటు ఎదుగుదలకు అవసరమైన అదనపు ఆహారం తీసుకుంటున్నారు.ఎక్కువమంది పిల్లలు 6-24 నెలల వయసులో ఎదుగుదలకు అవసరమైన ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. ప్రభుత్వ నివేదికలే ఈ వాస్తవాలు తెలియజేస్తున్నాయి.




ఆంధ్రజ్యోతి
మహిళ

తల్లిపాలతో ఉపయోగాలివి..

- తల్లి పాలు బిడ్డకు సర్వత్రా ఆరోగ్యకరం. తల్లిపాలలో మొదటి రెండ్రోజులు ముర్రుపాలు (కొలోస్ట్రం) తయారవుతుంది. ఈ పాలలో బిడ్డకు సంబంధించిన చాలా వ్యాధులకు రక్షణ కల్పించే రోగనిరోధకశక్తి పదార్థాలు ఉంటాయి.
- ముర్రుపాలు పట్టిస్తే శిశువుకు మంచిది కాదన్న ప్రచారం ఉంది. ఇది అపోహ మాత్రమే. ముర్రుపాలు బిడ్డకు వ్యాక్సిన్X గా పనిచేస్తాయి.
- తల్లిపాలు ఏ విధమైన చికిత్స లేకుండా పిల్లలకు ఇవ్వచ్చు. ఇతర పదార్థాల్లాగా అమ్మ పాలు కాలుష్యం కావు. వ్యాధులు రావు.
- పోతపాలతో వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నీరు, గ్లాసు, సీసా వంటివి కలుషితమైతే పిల్లలకు టైఫాయిడ్, విరేచనాలు అయ్యే అవకాశం ఉంది.
- తల్లిపాలతో ఏ విధమైనటువంటి అలర్జీలు రావు. పోతపాలలో లాక్టోస్, గెలక్టోస్, కలిపే చక్కెర వలన నిరంతరంగా అలర్జీ, విరేచనాలు అయ్యే అవకాశం ఉంది.
- తల్లిపాలు ఇస్తే.. తల్లి, బిడ్డ మధ్య మానసిక బంధం గట్టిపడుతుంది.
- తల్లిపాలలో అన్ని రకాల పోషకపదార్థాలు సరైన మోతాదులో ఉంటాయి. అన్ని రకాల ప్రొటీన్లు, మినరల్స్, సూక్ష్మ పోషకపదార్థాలు బిడ్డకు అవసరమైన మోతాదులో దొరుకుతాయి.
- ఆవు, గేదె పాలలో అయితే విటమిన్X -సి, ఐరన్X , రోగనిరోధకశక్తి అసలు ఉండవు. అంతే కాకుండా ఈ పోషకాలతో శిశువు మెదడు, శరీర భాగాలు ఎదగవలసినంతగా ఎదగవు.
- తల్లి తన బిడ్డకు పాలు ఇస్తే స్తన్యాలకు క్యాన్సర్ వచ్చే అవకాశాలు చాలా తక్కువ. బిడ్డకు పాలు ఇవ్వడం తల్లికి కూడా శ్రేయస్కరం.
- బిడ్డ జన్మించిన సమయంలో రుతుక్రమం ఆగడం వల్ల బోలు ఎముకల వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఆ వ్యాధిని నిరోధించడానికి తల్లి పాలు బిడ్డకు ఇవ్వాలి.
- తల్లి తన బిడ్డకు పాలు ఇవ్వడం వలన భావోద్వేగం అరికడుతుంది.
- హెచ్X ఐవీ, హెపటైటస్-సి వంటి వ్యాధులున్న తల్లులు తమ పిల్లలకు పాలు ఇచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లిపాల ద్వారా ఈ వ్యాధులు బిడ్డకు సోకే అవకాశం ఐదు నుంచి 10శాతం వరకు ఉంటుంది. మిగిలిన ఏ వ్యాధి ఉన్నా తల్లి నుంచి బిడ్డకు సంక్రమించదు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాలతో శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. శిశువు జన్మించిన గంట వ్యవధిలో ఇచ్చే ముర్రుపాలు వ్యాక్సిన్X గా పనిచేస్తుంది. ముర్రుపాలపై కొందరికి అపోహ ఉంది. ఆ అపోహను విడనాడాలి. ముర్రుపాలతో చిన్నారులకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. తల్లులకు కూడా ఆరోగ్యం. తల్లిపాలలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతాయి.

- డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, చిన్న పిల్లల వైద్యనిపుణుడు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, శ్రీకాళహస్తి.

దివ్యౌషధం



నవజాత శిశువుకు తల్లిపాలతో సహజసిద్ధమైన పోషకాలు లభించి దివ్య ఔషధంగా పనిచేస్తాయి. శిశువుకు ఇతర పాలు పట్టడంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. అంతే కాకుండా బిడ్డ ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తరచూ అనారోగ్యాలకు గురికావడం, న్యుమోనియా (నెమ్ము), డయేరియా వంటివి దరి చేరవు.

- డాక్టర్ విద్యావతి, శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

రొమ్ము క్యాన్సర్ నివారణ

బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆరు నెలల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టించాలి. బిడ్డకు వ్యాధి నిరోధకశక్తితోపాటు తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుంది. ప్రస్తుత రోజుల్లో బాలింతల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతోంది. ఆహార నియమాలలో పాల పెరుగుదల చేసుకోవాలి. బిడ్డకు పాలిచ్చే తల్లి పరిశుభ్రత పాటించాలి. పాలు ఇవ్వడం ద్వారా తల్లీ బిడ్డ మధ్య ఓ సహజ అనుబంధం పెరుగుతుంది.



- డాక్టర్ అనిత, శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి.

దీవించమ్మా.. అలిమేలు మంగమ్మా!

- **నేడు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం**
- **బంగారు చీరలో అమ్మ దర్శనం**
- **సాయంత్రం స్వర్ణ రథోత్సవం**
- **పలు ఆర్జిత సేవల రద్దు**

తిరుచానూరు: శ్రీవారి పట్టపురాణి తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.ఆస్థాన మండపంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ టీటీడీ అధికారులు పూర్తి చేశారు. వ్రతం సందర్భంగా శుక్రవారం ఉదయం ఆలయంలో అభిషేకానంతరం ఏడు గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. అలాగే ఆర్జిత సేవలైన లక్ష్మీపూజ, కళ్యాణోత్సవం, కుంకుమార్చన, ఊంజల్ సేవలను రద్దు చేశారు. సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారు స్వర్ణ రథంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగనున్నారు.వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి అమ్మవారి మూలవర్లు బంగారు చీరలో భక్తులకు దర్శనమిస్తారు. భక్తులకు ఆలయంలో టీటీడీ ధర్మప్రచార పరిషత్ (డీపీపీ) ఆధ్వర్యంలో కంకణాలు, గాజులు, కుంకుమ ప్యాకెట్లు అందించనున్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మునిరత్నంరెడ్డి

ముస్తాబైన ఆలయం

అలిమేలు మంగమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. పచ్చని తోరణాలు, పుష్పాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. వ్రతం జరిగే ఆస్థాన మండపం వద్ద రంగు రంగుల విద్యుద్దీపాలు, తోరణాలు, వివిధ దేవతా మూర్తుల కటౌట్లు ఏర్పాటు చేశారు. స్వర్ణ రథానికి మెరుగులు దిద్దారు. వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆస్థాన మండపంలో ఉదయం పది నుంచి 12 గంటల వరకు జరిగే వరలక్ష్మీ వ్రతానికి సుమారు 1,100 మంది భక్తులు హాజరవుతారని అధికారులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని కౌంటర్‌లో గురువారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు 220 వరలక్ష్మీ వ్రతం టికెట్లు అందజేసినట్లు డిప్యూటీ ఈవో మునిరత్నంరెడ్డి చెప్పారు. వరలక్ష్మీ వ్రతం టికెట్లు కోసం భక్తులు పోటెత్తారు. ఇక వరలక్ష్మీ వ్రతం ప్రచార వాహనం (రథాన్ని) గురువారం ఉదయం ఆలయం వద్ద అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మునిరత్నంరెడ్డి, పేష్కార్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జనార్దనరెడ్డి, సూపరింటెండెంట్ మాధవకుమార్, ఆర్జితం, ప్రసాదాల ఇన్‌స్పెక్టర్లు గురవయ్య, నాగేంద్ర పాల్గొన్నారు.



ముస్తాబైన ఆస్థాన మండపం

What is Composite Cash Credit?

BANKING KNOWLEDGE / FINANCIAL AWARENESS

1. Legislative and regulatory changes made over the last 18 months had created an enabling and supportive operational environment for ARCs and for takeover of stressed assets by PE firms/special situation funds. In the abbreviation ARC, the letter A stands for what?
a) Asset (ARC: Asset Reconstruction Company)
b) Art c) Aspect d) Atlas e) Actpr

2. As per Foreign Exchange Regulations, NRIs may invest in which of the following, in of an Indian company under Foreign Direct Investment (FDI) Scheme, subject to the terms and conditions specified in Schedule 1?
a) Company Shares
b) Compulsorily Convertible Preference Shares (CCPS)
c) Compulsorily Convertible Debentures (CCDs)
d) Warrants/ partly paid up shares
e) All the above

3. The Social Security Scheme namely, AamAadmiBimaYojana (AABY) caters to unorganised sector persons under 48 various vocational groups. Who are such persons / workers?
a) Beedi Workers b) Brick Kiln Workers, c) Rickshaw Pullers d) Auto Drivers etc.
e) All the above

4. What are the benefits available to all the RuPay ATM-cum-debit cardholders?
a) All RuPay ATM-cum-debit cardholders are presently eligible for accidental death and permanent disability insurance cover.
b) RuPay Classic cardholders are eligible for cover of Rs.1 lakh, whereas RuPay Premium cardholders are eligible for cover of Rs.2 lakh.
c) Insurance premium is paid by the National Payments Corporation of India
d) All the above e) None of these

5. Supervisory Colleges have been setup for which of the following Scheduled Commercial Banks which have sizeable international presence?
a) State Bank of India, ICICI Bank Ltd.,
b) Bank of India, Bank of Baroda,
c) Axis Bank Ltd.
d) Punjab National Bank
e) All the above six banks

6. With which bank Long Term Rural Credit Fund (LTRCF), was created with effect from 2014-15, in order to provide long term refinance to Cooperative banks and RRBs to meet the long term inve stment credit lending in agriculture, con tributed out of shortfall in achievement of Priority Sector Lending (PSL) targets by Scheduled Commercial Banks?
a) NABARD b) NHB c) LIC
d) HDFC e) ICICI

7. If any bank branch observes Monday as weekly off, that bank branch shall stay open on Monday, July 31, 2017, as it is the last date for payment of crop insurance premium. In order to facilitate collection of insurance premiums on crops. From whom crop insurance premiums are collected?
a) Farmers b) Tailors c) Traitors
d) Tutors e) Cheaters

8. The Monetary Policy Committee (MPC) scheduled to meet on August 1 and 2, 2017 for ________ the Monetary Policy Statement for 2017-18.
a) Third Bi-monthly b) Fourth bi-monthly
c) Fifth bi-monthly d) Sixth bi-monthly
e) None of these

9. 'Bank charges' printed in the bank pass book, would give details about which of the following?
a) Nature of the charges - fee/commission/fine/ penalty etc.
b) Reasons for the charges, in brief - e.g. return of cheque (number), commission/ fee on draft issued /remittance (draft number), cheque collection charge (number),
c) Charges for issuance of cheque book, SMS alerts, ATM fees, additional cash withdrawals, etc.
d) All the above e) None of these

10. 'Payment to third parties' printed in the bank pass book, should mention which of the following?
a) Name of the payee
b) Mode - Transfer, clearing, inter-branch, RTGS/ NEFT, cash, cheque (number)
c) Name of the transferee bank, if the payment is made through clearing/inter-branch transaction/ RTGS/NEFT
d) All the above e) None of these

11. When Reserve Bank of India (RBI) introduced the system of Primary Dealers (PDs) in the Government Securities (G-Sec) Market?
a) 1935 b) 1995 c) 1949 d) 1980 e) 1969

12. What are the objectives of the Primary Dealers (PD) system?
a) To strengthen the infrastructure in G-Sec market
b) Development of underwriting and market making capabilities for G-Sec
c) Improve secondary market trading system
d) To make PDs an effective conduit for open market operations (OMO)
e) All the above

13. At all times, at least how much of the paid-up share capital of the private sector banks shall be held by resident Indians?
a) 49% b) 26 % c) 15% d) 25% e) 30%

14. From all sources viz., Foreign Direct Investment, Foreign Institutional Investors, Non Resident Indians, foreign investment shall not exceed how much of paid-up capital of the private sector bank?
a) 51% b) 74 % c) 26% d) 49% e) None

15. Banks normally issue shares in which method?
a) Public Issues [(i)Initial Public Offer (ii)Further Public Offer]
b) Private Placement (Preferential Issue / Qualified Institutional Placement)
c) Rights Issue d) Bonus Issues
e) All the above methods

16. "A loan on which the interest rate is fixed for the entire tenor of the loan" is called as what?
a) Fixed rate loan b) Bank rate loan
c) Repo rate loan
d) Reverse repo rate loan e) None of these

17. What is "Floating rate loan"?
a) A loan on which interest rate does not remain fixed during the tenor of the loan.
b) It is for a boat c) It is for a ship
d) It is for bus e) None of these

18. What is "Term loan"?
a) Loan for one day
b) A loan which is repayable after a specified term period
c) Loan for 6 days d) Loan for 10 days
e) None of these

19. Interest shall be charged on all advances at which period?
a) Monthly rests b) Half yearly c) Yearly
d) For 5 years e) None of these

20. From which date all rupee loans sanctioned and credit limits renewed are priced with reference to the Marginal Cost of Funds based Lending Rate (MCLR) which will be the internal benchmark for such purposes?
a) w.e.f. April 1, 2016 b) 1.1.2015
c) 2014 d) 2013 e) None of these

21. The MCLR shall comprise, which of the following?
a) Marginal cost of funds
b) Negative carry on account of CRR
c) Operating costs d) Tenor premium
e) All the above

22. What is "Bulk Deposit"?
a) It means Rupees one crore and above for Scheduled Commercial Banks other than Regional Rural banks
b) Rs. 50 lakhs c) Rs.25 lakhs
d) Rs.10 lakhs e) None of these

BANK PO/ CLERKS EXAM SPECIAL

23. What is "Composite Cash Credit?
a) It is withdrawal
b) It means a type of loan product having a cash credit limit with a fully savings module designed to take care of farmer's interest
c) It is a mortgage d) It is a pledge
e) None of these

24. What is "Current Account"?
a) It means a form of non-interest bearing demand deposit where from withdrawals are allowed any number of times depending upon the balance in the account or up to a particular agreed amount. and shall also be deemed to include other deposit accounts which are neither Savings Deposit nor Term Deposit
b) Only for housewives
c) Only for agriculturist
d) Only for teachers e) None of these

25. What is "Daily product"?
a) Production of cotton
b) It means the interest applied on the end of day balance
c) Production of milk
d) Production of rice e) None of these

26. What is "Demand deposit"?
a) Cash withdrawal
b) It means a deposit received by the bank, which is withdrawable on demand
c) Money payment d) Fixed deposit
e) None of these

27. What is "Notice deposit"?
a) Notice period
b) It means term deposit for specific period but withdrawable on giving at least one complete banking day's notice
c) Keys deposit d) Gold deposit
e) None of these

28. What is "Scheduled commercial Bank"?
a) Banks other than co-operatives banks included in second schedule of Reserve Bank of India Act, 1934.
b) Banks mentioned in Constitution of India
c) World Bank d) ADB e) None of these

Praturi Potayya Sarma

ANSWERS

1) a	5) e	9) d	14) b	19) a	24) a	
2) e	6) a	10) d	15) e	20) a	25) b	
3) e	7) a	11) b	16) a	21) e	26) b	
4) d	8) a	12) e	17) a	22) a	27) b	
		13) b	18) b	23) b	28) a	

ఉద్యోగాలు

మిథాని

హైదరాబాద్, కంచన్ బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిథాని) - మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 10
పోస్టులు: అడిషనల్ జనరల్ మేనేజర్/ డిప్యూటీ జనరల్ మేనేజర్(మెటీరియల్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్/ సీనియర్ మేనేజర్(మెల్ట్ ఆపరేషన్స్) 1, సీనియర్ మేనేజర్/ మేనేజర్/ డిప్యూటీ మేనేజర్(మార్కెటింగ్ - రింగ్ ప్రొడక్ట్స్ 1, డై, టూల్ స్టాక్ 1), డిప్యూటీ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) 2, సీనియర్ మేనేజర్ (మార్కెటింగ్) 3
వయసు: 45 నుంచి 48 ఏళ్ల మధ్య ఉండాలి
అర్హత: అడిషనల్ జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్(మెటీరియల్స్) పోస్టులకు 60 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ + ఎంబిఏ లేదా స్పెషలైజేషన్ (మెటీరియల్స్ మేనేజ్‌మెంట్/ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్/ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్/ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్) పూర్తిచేసి ఉండాలి. పదిహేడేళ్ల అనుభవం ఉండాలి. డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులకు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పదమూడేళ్ల అనుభవం ఉండాలి. మిగిలిన పోస్టులన్నింటికీ సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ + నిర్దేశించిన మేర అనుభవం ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 16
వెబ్‌సైట్: www.midhani.com

ఎన్‌పిసిఐఎల్

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్ పిసిఐఎల్)- **ట్రేడ్ అప్రెంటిస్**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 120
కర్ణాటకలోని ఖాళీలు: 80
ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 15, టర్నర్ 5, మెషినిస్ట్ 5, ఎలక్ట్రీషియన్ 20, వెల్డర్ 10, ఇన్ స్ట్రుమెంట్ మెకానిక్స్ 15, ఎలక్ట్రానిక్ మెకానిక్ 10
గుజరాత్‌లోని ఖాళీలు: 40
ట్రేడ్స్ వారీ ఖాళీలు: ఫిట్టర్ 9, టర్నర్ 3, ఎలక్ట్రీషియన్ 9, ఇన్ స్ట్రుమెంట్ మెకానిక్ 2, పాసా 9, వెల్డర్ 2, మెషినిస్ట్ 3
అర్హత: పదోతరగతి/ పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి
వయసు: జూలై 31 నాటికి 16 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులు ముందుగా www.apprenticeship.gov.in వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తరవాత ఎన్ పిసిఐఎల్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్ లోడ్ చేసుకొని నింపి కింది చిరునామాకు పంపుకోవాలి.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: గుజరాత్ పోస్టులకు ఆగస్టు 16, కర్ణాటక పోస్టులకు ఆగస్టు 24
కర్ణాటక చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited Kaiga Site, Via Karwar, Po- Kaiga, Uttara Kannada - 581400, Karnataka
గుజరాత్ చిరునామా: Manager(HRM), Nuclear Power Corporation of India Limited Kakrapar Gujarat Site, PO - Anumala, Via -Vyara Dt, Tapi - 394651, Gujarat
వెబ్‌సైట్: www.npcil.nic.in/Opportunities

ఎన్‌హెచ్‌డిసిఎల్

ఎన్‌హెచ్ డిసి లిమిటెడ్- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 12
పోస్టులు: మెడికల్ ఆఫీసర్ 2, ట్రైనీ ఆఫీసర్(లా 2, కంపెనీ సెక్రటరీ 1, హెచ్ ఆర్ 3, ఫైనాన్స్ 3), సూపర్‌వైజర్ (సేఫ్టీ) 1
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 8 నుంచి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22
వెబ్‌సైట్: www.nhdcindia.com

సిమెంట్ తయారీలో వాడే ప్రధాన ముడి పదార్థం?

1. ఉప్పులో కరిగి ఉన్న మలినాలను తొలగించడానికి ఉపయోగపడేది?
ఎ) $CaCO_3$ బి) NaOH
సి) $Ca(OH)_2$ డి) $2nCO_3$
2. పరిశుద్ధమైన ఉప్పును పొందడానికి ఉప్పు ద్రావణంలోకి ఏ వాయువును పంపుతారు?
ఎ) Cl_2 బి) H_2 సి) HCl డి) N_2
3. బ్రైన్ ద్రావణం అంటే ....
ఎ) HCl ద్రావణం బి) క్లోరిన్ జలం
సి) బ్లీచింగ్ పౌడర్ డి) Nacl జల ద్రావణం
4. దూది, కాగితం, సిల్కు మొదలైన వాటిని విరంజనం చేయడానికి ఉపయోగించేది?
ఎ) SO_2 బి) Cl_2 సి) $CaOCl_2$ డి) $COCl_2$
5. టియర్ గ్యాస్ రసాయన ఫార్ములా?
ఎ) $COCl_2$ బి) $CHCl_3$ సి) $CaOCl_2$ డి) Cl_3CCNO_2
6. ఫాస్‌జీన్ రసాయన నామం?
ఎ) కాల్షియం క్లోరైడ్ బి) కార్బోనైల్ క్లోరైడ్
సి) కార్బన్ మోనాక్సైడ్ డి) ఏదీకాదు
7. తడిసిన రంగు పూలను క్లోరిన్ జాడీలో వేస్తే పూలు రంగును కోల్పోతాయి. దానికి కారణం? క్లోరిన్ ఏవిధంగా పనిచేస్తుంది?
ఎ) క్షయకరణి బి) విరంజనకారి
సి) ఉత్ప్రేరకం డి) ఏదీకాదు
8. ఆకుపచ్చ రంగు గల వాయువు?
ఎ) ఫ్లోరిన్ బి) క్లోరిన్ సి) బ్రోమిన్ డి) అయోడిన్
9. ఎముకల్లో ఉండేది?
ఎ) కాల్షియం పాస్ఫేట్ బి) కాల్షియం పాస్ఫైట్
సి) కాల్షియం హైడ్రాక్సైడ్
డి) కాల్షియం హైపో క్లోరేట్
10. ఫాస్ఫారికామ్లాన్ని దేనిలో కలిపి మట్టి పాత్రలో స్వేదనం చెందిస్తే ఫాస్పరస్ లభిస్తుంది?
ఎ) O_2 బి) C సి) H_2 డి) సల్ఫర్
11. ఫాస్ఫరస్ ఏ వాసనను కలిగి ఉంటుంది?
ఎ) కుళ్లిన కోడిగుడ్డు బి) పూటైన
సి) వెల్లుల్లి డి) అమ్మోనియం
12. ఆకాశంలో మెరుపులు ఏర్పడినపుడు వాతావరణంలో విడుదలయ్యే వాయువు?
ఎ) O_2 బి) CO_2 సి) N_2O డి) NO
13. గాలిలో నైట్రోజన్ భారశాతం, ఘన పరిమాణాత్మకత శాతాలు?
ఎ) 3/4, 4/5 బి) 1/5, 1/3
సి) 3/2, 4/3 డి) 1/2, 1/3
14. నైట్రోజన్ ఘనీభవన స్థానం?
ఎ) $-210.5^\circ C$ బి) $-33^\circ C$
సి) $0^\circ C$ డి) $-330^\circ C$
15. జింక్, సల్ఫర్‌లను చీకటిలో నెమ్మదిగా వేడి చేసినపుడు ఏ రంగు మంట ఇస్తుంది?
ఎ) పసుపు బి) ఆరెంజ్
సి) ఆకుపచ్చ డి) బంగారు రంగు
16. సల్ఫర్ డై ఆక్సైడ్ గాలి కంటే ఎన్ని రెట్లు బరువైనది?
ఎ) 2 1/2 బి) 1 1/2 సి) 1 డి) 2
17. పెట్రోల్ హైడ్రోజనీకరణ ప్రక్రియను కనుగొన్న శాస్త్రవేత్త?
ఎ) హేబర్ బి) బెర్జిలియస్
సి) కావెండిష్ డి) డాల్టన్
18. ప్రయోగశాలలో సులువుగా ఆక్సిజన్ తయారు చేయడానికి వాడే రసాయనం?
ఎ) KCl బి) KNO_3 సి) $Kmno_4$ డి) $K_2Cr_2O_7$
19. సోడియం లోహాన్ని ఆక్సిజన్‌తో మండిస్తే ఏర్పడే జ్వాల వర్ణం?
ఎ) ఎరుపు బి) ఆకుపచ్చ సి) నీలం డి) బంగారం


వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - కెమిస్ట్రీ

20. జుట్టును విరంజనం చేయడానికి వాడే ద్రవం?
ఎ) $Kmno_4$ బి) H_2O సి) H_2O_2 డి) D_2O
21. ఉప్పునీటి ద్రావణాన్ని ఏమని అంటారు?
ఎ) బ్రైన్ ద్రావణం బి) కఠిన జలం
సి) భారజలం డి) ఏదీకాదు
22. నీటిని విద్యుత్ విశ్లేషణం చేస్తే వెలువడే ఆక్సిజన్, హైడ్రోజన్ వాయువుల ఘన పరిమాణాల నిష్పత్తి?
ఎ) 1:2 బి) 1:3 సి) 1:1 డి) 2:3
23. కాస్టిక్ సోడా అంటే?
ఎ) సోడియం కార్బోనేట్ బి) సోడియం బైకార్బోనేట్
సి) సోడియం హైడ్రాక్సైడ్ డి) సోడియం క్లోరైడ్
24. లెడ్ పెన్సిల్‌లో ఉండే నల్లని భాగం?
ఎ) లెడ్ బి) గ్రాఫైట్ సి) సీసం డి) జింక్
25. కింది వాటిలో ద్రవరూపంలో ఉండే లోహం?
ఎ) వెండి బి) బంగారం సి) ప్లాటినం డి) పాదరసం
26. కింది వాటిలో వాయువు కానిది?
ఎ) CO_2 బి) SO_2 సి) O_2 డి) Br_2
27. ఉప్పు, కర్పూరంల మిశ్రమాన్ని ఏ పద్ధతి ద్వారా వేరు చేస్తారు?
ఎ) బాష్పీభవనం బి) ద్రవీభవనం
సి) ఉత్పతనం డి) సంఘననం
28. ఘన పరిమాణాత్మకంగా గాలిలో ఎంత ఆక్సిజన్ ఉంటుంది?
ఎ) ఒకటో వంతు బి) రెండో వంతు
సి) ఐదో వంతు డి) నాలుగో వంతు
29. దుక్క ఇనుము లేదా పోత ఇనుములో కార్బన్ శాతం ఎంత?
ఎ) 3.4% బి) 2.0% సి) 8.0% డి) 1.2%
30. పొటాషియం లాటిన్ పేరు?
ఎ) నేట్రియం బి) కాలియం
సి) భాస్వరం డి) గంధకం
31. రుణ ధృవ కిరణాలను కనిపెట్టింది?
ఎ) జెజెథామ్సన్ బి) న్యూటన్
సి) జె.చాడ్విక్ డి) సోమర్‌ఫెల్డ్
32. అత్యధికంగా చొచ్చుకొని పోయే కిరణాలు?
ఎ) α - కిరణాలు బి) β - కిరణాలు
సి) γ - కిరణాలు డి) ఏదీకాదు
33. ఆహార పదార్థాలను నిల్వ చేయడానికి ఉపయోగించే పదార్థం?
ఎ) ఎసిటికామ్లం బి) సిట్రికామ్లం
సి) బోరికామ్లం డి) బెంజొయికామ్లం
34. కింది వాటిలో అత్యంత చల్లబరిచిన పదార్థం?
ఎ) పాదరసం బి) ఐస్‌క్రీం సి) టెప్లాన్ డి) గ్లాస్
35. సిమెంట్ తయారీలో వాడే ప్రధాన ముడి పదార్థం?
ఎ) సున్నపురాయి బి) కాల్షియం
సి) మెగ్నీషియం డి) అల్యూమినియం
36. మరకతం సాధారణ రంగు?
ఎ) పసుపుపచ్చ బి) ముదురు ఆకుపచ్చ
సి) ప్రష్యన్ నీలం డి) ఊదా రంగు
37. రేడియోథెరపీ పద్ధతిలో కోబాల్ట్-60 ఏ కిరణాలను విడుదల చేస్తుంది?
ఎ) α - కిరణాలు బి) β - కిరణాలు
సి) γ - కిరణాలు డి) X - కిరణాలు
38. తెల్ల స్పిరిట్ రసాయన నామం?
ఎ) పెట్రోలియం హైడ్రోకార్బన్ ల మిశ్రమం
బి) శుభ్రపరచిన ఈథనాల్
సి) సంపూర్ణ ఈథైల్ ఆల్కహాల్
డి) డినేచర్డ్ ఆల్కహాల్
39. భారతదేశంలో ఏ రాష్ట్రం నికోటిన్, పొగాకు కలిగి ఉన్న పదార్థాలను పూర్తిగా నిషేధించింది?
ఎ) హర్యానా బి) ఉత్తరప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్
40. చల్లని నీటితో తీవ్రంగా ప్రతి చర్య జరిపే లోహం ?
ఎ) కాల్షియం బి) సోడియం
సి) మెగ్నీషియం డి) పొటాషియం
41. మానవ మూత్రపిండాల్లోని రాళ్లలో కనిపించే ప్రధానమైన రసాయన సమ్మేళనం?
ఎ) యూరికామ్లం బి) కాల్షియం ఆక్సలేట్
సి) కాల్షియం ఆక్సైడ్ డి) కాల్షియం క్లోరైడ్
42. జాతీయ పోషకాహార సంస్థ ఎక్కడుంది?
ఎ) బెంగళూరు బి) ముంబై
సి) హైదరాబాద్ డి) ఢిల్లీ
43. అంటుకోని వంటపాత్రలను దేనితో పూత పూస్తారు?
ఎ) సిలికాన్ బి) పి.వి.సి సి) గ్రాఫైట్ డి) టెప్లాన్
44. కింది వాటిలో సులభంగా లభించని లోహం?
ఎ) రేడియం బి) వెండి సి) స్టానియం డి) పాదరసం
45. సున్నపు నీరు రసాయనిక పేరు?
ఎ) కాల్షియం సల్ఫేట్ బి) కాల్షియం హైడ్రాక్సైడ్
సి) కాల్షియం కార్బోనేట్ డి) కాల్షియం ఆక్సైడ్
46. వేసవి ద్రవం అని ఏ మూలకానికి పేరు?
ఎ) గాలియం బి) థాలియం
సి) రేడియం డి) పోలోనియం
47. పెట్రోల్‌కు ప్రతి విస్ఫోటనకారిగా కలిపే పదార్థం?
ఎ) కార్బన్ మోనాక్సైడ్ బి) టెట్రా ఈథైల్‌లెడ్
సి) ఆల్కహాల్ డి) ఏదీకాదు
48. ఎల్‌పిజి లీకేజిని గుర్తించడానికి కలిపే పదార్థం?
ఎ) మిథైల్ లెడ్ బి) ఈథైల్ ఆల్కహాల్
సి) మిథైల్ మెర్కప్టాన్ డి) క్లోరాల్ హైడ్రేట్
49. కింది వాటిలో అత్యధిక కఠినమైన లోహం?
ఎ) టంగ్‌స్టన్ బి) వెండి సి) ఇత్తడి డి) ఉక్కు

సమాధానాలు

1) సి	8) బి	15) సి	24) బి	33) డి	42) సి
2) బి	9) ఎ	16) ఎ	25) డి	34) డి	43) డి
3) డి	10) బి	17) బి	26) డి	35) బి	44) ఎ
4) సి	11) సి	18) సి	27) సి	36) బి	45) బి
5) డి	12) డి	19) డి	28) సి	37) సి	46) ఎ
6) బి	13) ఎ	20) సి	29) ఎ	38) ఎ	47) బి
7) బి	14) ఎ	21) ఎ	30) బి	39) ఎ	48) సి
		22) సి	31) ఎ	40) బి	49) ఎ
		23) సి	32) సి	41) బి	

ఉద్యోగాలు

టిఎంఆర్‌బి

తమిళనాడు మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్- తాత్కాలిక ప్రాతిపదికన కింది విభాగాల్లో **అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు: 106**

విభాగం: హోమియోపతి **ఖాళీలు:** 4
అర్హత: ఆగస్టు 2 నాటికి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా (ఎ.ఎఫ్/ ఎంఎఫ్/ డిఎఫ్ - హోమియోపతి) లేదా వెస్ట్ బెంగాల్‌లోని ప్రముఖ సంస్థల నుంచి డిప్లొమా లేదా హైదరాబాద్‌లోని బోర్డ్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ వారి డిప్లొమా ఇన్ ఇంటిగ్రేటెడ్ మెడిసిన్ (హోమియోపతి) లేదా డిగ్రీ + డిప్లొమా లైసెన్స్ సర్టిఫికెట్ (ఆంధ్రా బోర్డ్ ఫర్ ఆయుర్వేద అండ్ హోమియోపతి, హైదరాబాద్ తదితర సంస్థల నుంచి) లేదా డిప్లొమా(హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జరీ) లేదా బిహెచ్ఎంఎస్/ ఎంబిబిఎస్ తదితర కోర్సులు పూర్తిచేసి ఉండాలి.
విభాగం: ఆయుర్వేద **ఖాళీలు:** 1
అర్హత: హెచ్ పిఐఎం(ఆయుర్వేద)/జిసిఐఎం (ఆయుర్వేద) / ఎల్ఐఎం/ బిఏఎంఎస్ పూర్తిచేసి ఉండాలి.
విభాగం: సిద్ధ **ఖాళీలు:** 101
అర్హత: (హెచ్ పిఐఎం/ జిసిఐఎం/ ఎండి/ బిఐఎం/ ఎల్ఐఎం)(సిద్ధ) లేదా బిఎస్ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి.
వయసు: 35 ఏళ్లలోపుండాలి
ఎంపిక: అండర్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్ ద్వారా
అండర్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్: అక్టోబరు 8న
పరీక్ష కేంద్రం: చెన్నై **పరీక్ష ఫీజు:** రూ.750
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 22
ఆఫ్‌లైన్ ఫీ పేమెంట్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 24
వెబ్‌సైట్: www.mrb.tn.gov.in

మద్రాస్ ఫెర్టిలైజర్స్

మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్- **గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ & డిప్లొమా అప్రెంటిస్**ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 89
గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ అప్రెంటిసెస్‌లు
ఖాళీలు: 6
విభాగాలు - ఖాళీలు: కెమికల్ ఇంజనీరింగ్ 5, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ 1 **స్టయిపెండ్:** నెలకు రూ.10,000
అర్హత: బిఇ/ బిటెక్(కెమికల్/ ఎలక్ట్రికల్& ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటీసెస్ ఖాళీలు: 45
విభాగాలు - ఖాళీలు: కెమికల్ 13, మెకానికల్ 20, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 5, సివిల్ 2, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ / ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజనీరింగ్ 5
స్టయిపెండ్: నెలకు రూ.9,000
అర్హత: డిప్లొమా(కెమికల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ సివిల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి.
డిప్లొమా ఇన్ మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్ అప్రెంటిసెస్
ఖాళీలు: 18
స్టయిపెండ్: నెలకు రూ.9,000
అర్హత: డిప్లొమా ఇన్ మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్
ట్రేడ్ అప్రెంటిస్‌లు **ఖాళీలు:** 20
ట్రేడ్స్ - ఖాళీలు: ఫిట్టర్ 6, టర్నర్ 1, వెల్డర్ 1, ఎలక్ట్రీషియన్ 1, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ 4, రిఫ్రిజిరేటర్ & ఏసి మెకానిక్ 1, మెకానిక్ మోటార్ వెహికిల్ 1, మెకానికల్ డీజిల్ 1, డ్రాఫ్ట్స్‌మన్ మెకానిక్ 1
అర్హత: సంబంధిత విభాగంలో ఐటిఐ పూర్తిచేసి ఉండాలి
స్టయిపెండ్: నెలకు రూ.8630 (డీజిల్ మెకానిక్ ట్రేడ్‌కు మొదటి ఏడాది రూ.7,666) **ట్రైనింగ్:** ఏడాది
అభ్యర్థులు తప్పనిసరిగా www.mhrdnats.gov.in వెబ్‌సైట్లో రిజిస్టరై ఉండాలి. డిగ్రీ/ డిప్లొమా పూర్తిచేసి మూడేళ్లు నిండకూడదు
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 9
దరఖాస్తు హార్డ్ కాపీ పంపాల్సిన చిరునామా:
The General Manager - P&A, Madras Fertilizers Limited, Post Bag No - 2, Manali, Chennai- 600068
వెబ్‌సైట్: www.madrasfert.nic.in

అడ్మిషన్స్

ఎన్ఐఇఎల్ఐటి

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఇఎల్ఐటి)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: విఎల్ఎస్ఐ& ఎంబెడెడ్ హార్డ్‌వేర్ డిజైన్, ఎలక్ట్రానిక్ సిస్టం డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్
కోర్సు వ్యవధి: 24 వారాలు
అర్హత: బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ
కోర్సు ప్రారంభం: ఆగస్టు 21
వెబ్‌సైట్: http://nielit.gov.in/calicut

ఎన్ఎల్ఎస్ఐయు

బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ దూరవిద్యా విభాగం- కింది కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సులు: మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్ (ఎంబిఎల్), ఏడాది పీజీ డిప్లొమా(హ్యూమన్ రైట్స్ లా/ మెడికల్ లా & ఎథిక్స్/ ఎన్విరాన్‌మెంటల్ లా/ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా/ చైల్డ్ రైట్స్ లా / కన్స్యూమర్ లా & ప్రాక్టీస్/ సైబర్ లా & సైబర్ ఫోరెన్సిక్స్)
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: http://ded.nis.ac.in

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులచే పరిసరాల శుభ్రత

గంగవరం : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో గురువారం వివేకానంద జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పరిసరాలను శుభ్రపరిచారు. ఆస్పత్రి ఆవరణలోని చెత్తాచెదారాన్ని, ముళ్ల కంపలను తొలగించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ తమ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లచే వారంలో ఒక రోజు పరిసరాలను శుభ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మునినంజయ్య గౌడు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాసనం ద్వారా మద్యం మాన్పించవచ్చు

యోగా గురువు రాజేంద్ర యోగి



బంగారుపాళ్యం : తాగుడు అలవాటును సింహాసనం అనే ఆసనం ద్వారా పూర్తిగా మాన్పించవచ్చని యోగా గురువు రాజేంద్ర యోగి పేర్కొన్నారు. మండలంలోని తంబుగానిపల్లెలో యోగా శిక్షణా కేంద్రంలో గురువారం ఆయన పాల్గొని ప్రసంగించారు. యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీ, ఆయుష్ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, నెహ్రూ యువకేంద్ర యూత్ కో ఆర్డినేటర్ భరత్, ఆయుర్వేదిక్ వైద్యులు విజయ్‌కుమార్, యూనాని వైద్యులు జావిద్‌ఖాన్ తో పాటు పలువురు యోగా అభ్యాసకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి రూ.10 వేల విరాళం



పలమనేరు : మున్సిపాలిటీలోని టీఎస్ అగ్రహారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఆ వార్డు కౌన్సిలర్ శ్యామ్ సుందర్ రాజ్ గురువారం రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం రెడ్డికి విరాళాన్ని అందజేశారు. ఆలయానికి ఇనుప గేట్లు ఏర్పాటుకు రూ.10 వేలు అందజేసినట్లు తెలిపారు.

మేలుమాయి ఉప ఆరోగ్య కేంద్రం తనిఖీ

గంగవరం : మేలుమాయి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం గంగవరం పీహెచ్‌సీ ఛైర్మన్ వెంకటరమణారెడ్డి తనిఖీ చేశారు. పీహెచ్‌సీ కేంద్రంలో పిల్లలకు వేస్తున్న టీకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ కేంద్రానికి కావాల్సిన సౌకర్యాలను జిల్లా అధికారులకు తెలిపి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తట్టు, రూబెల్లా వ్యాక్సిన్లపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

నవరత్న పథకాలకు విశేష స్పందన

పలమనేరు : వైసీపీ అధినేత జగన్ ప్రకటించిన నవరత్న పథకాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త సీవీ కుమార్ పేర్కొన్నారు. గురువారం వైసీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాలలో శిల్పా చక్రపాణి రెడ్డి వైసీపీలో చేరడం శుభ పరిణామమన్నారు. పట్టణ కన్వీనర్ మండీ సుధా మాట్లాడుతూ నంద్యాలలో తమ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించిందని, నంద్యాల ప్రజలు వైసీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డులు



గంగవరం : పత్తికొండ ఉన్నత పాఠశాలలో బెస్టు స్టూడెంట్స్‌ను ఎంపిక చేసి గురువారం పలమనేరు డివిజనల్ ఎల్ఐసీ అధికారులు అవార్డులు ప్రదానం చేశారు ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ బాబు మాట్లాడుతూ అవార్డు తీసుకున్న విద్యార్థులు మరింత శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఎల్ఐసీ అధికారి యుగంధర్‌బాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా మాజీ అధ్యక్షుడు గిరిధర్ మూర్తి ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు - సైన్స్ అనే అంశానికి సంబంధించి పలు ప్రయోగాలు చేసి చూపించారు.

పేదరికం చదువుకు ఆటంకం కాకూడదు

బంగారుపాళ్యం : తాను చిన్నప్పుడు చదువుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డానని, పేదరికం చదువుకు ఆటంకం కాకూడదని ప్రముఖ వ్యాపార వేత్త జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్‌నాయుడు తెలిపారు. గురువారం గుండ్లకట్టమంచి, మంగళపల్లె, చిల్లగుండ్లపల్లె, కూర్మాయిపల్లె పాఠశాలల్లోని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి దాతల ఆశయాలను నెరవేర్చాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలు

పెద్దపంజాణి : మండల కేంద్రానికి సమీపంలోని చిన్నపల్లె వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుంగనూరు మండలం కొత్తయిండ్లుకు చెందిన మునస్వామి కుమారుడు లక్ష్మయ్య(48) తీవ్రంగా గాయపడ్డాడు. ఈయన ద్విచక్రవాహనంలో పుంగనూరు వైపు వెళుతుండగా ఇన్నోవా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతనిని 108 వాహనంలో పలమనేరు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి వరహాల నాయుడు



మాట్లాడుతున్న వరహాల నాయుడు

పలమనేరు : ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే కార్మిక పరిషత్ ధ్యేయమని రాష్ట్ర కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి వరహాలనాయుడు పేర్కొన్నారు. గురువారం పలమనేరు ఆర్టీసీ డిపో వద్ద జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇటీవల పలమనేరు డిపోలో 120 మందికి పైగా ఇతర యూనియన్ నాయకులు టీడీపీ అనుబంధ సంస్థ కార్మిక పరిషత్ లో సభ్యత్వం తీసుకున్నారన్నారు. తిరుపతిలోని వర్క్ షాపును మూసి వేయాలని అధికారులు నిర్ణయించగా కార్మిక పరిషత్ రాష్ట్ర రవాణా శాఖా మంత్రితో సంప్రదించి వర్క్ షాపును మూసి వేయకుండా కొనసాగించడం జరిగిందన్నారు. అందువల్లే వర్క్ షాపులోని 65 మంది కార్మికుల్లో 40 మంది కార్మిక పరిషత్ సభ్యత్వం తీసుకున్నారన్నారు. సమావేశంలో కార్మిక పరిషత్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్, రీజనల్ సెక్రటరీ డీవీఆర్ కుమార్, రీజనల్ అధ్యక్షుడు కేఎంసీ కేశవులు, వర్కింగ్ సెక్రటరీ రవి కుమార్, డిపో నాయకులు, కార్మికులు, స్థానిక పలమనేరు రూరల్ అధ్యక్షుడు జగదీష్ నాయుడు, బ్రహ్మయ్య, కుట్టి, అమ్ములు పాల్గొన్నారు.

విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోండి



మాట్లాడుతున్న పలమనేరు ఎంపీపీ గీత

పలమనేరు : సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులను వార్డెన్లు తమ సొంత బిడ్డల్లా చూసుకోవాలని ఎంపీపీ గీత సూచించారు. గురువారం పలమనేరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సాంఘిక సంక్షేమ వసతి గృహాల సలహా సంఘ సమావేశంలో ఎంపీపీ పాల్గొని ప్రసంగించారు. వసతి గృహాల్లో చదువుకునే పిల్లలు పూర్తిగా గ్రామీణ ప్రాంతాల పేదల పిల్లలేనని, వీరిపట్ల వార్డెన్లు వాత్సల్యంతో నడుచుకోవాలన్నారు. ఎంపీడీవో హర్మత్ మాట్లాడుతూ వసతి గృహాల వద్ద పారిశుధ్యం, పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వసతి గృహాలు శుభ్రంగా ఉన్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు పౌష్టికాహారం, నైతిక విలువలు పెంపొందించాలన్నారు. ఏఎస్‌డబ్ల్యువో శ్రీనివాసులు మాట్లాడుతూ బాలుర కళాశాలకు భవనం చూపిస్తే కళాశాల వసతి గృహం ప్రారంభిస్తామన్నారు. పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు త్వరలోనే ట్యూటర్లను నియమిస్తామని, ప్రతి రోజూ స్టడీ అవర్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఆగస్టు 1వ తేది నుంచి వసతి గృహాల్లో కొత్త మెనూను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

కార్పొరేషన్ రుణాలు తక్షణమే పంపిణీ చేయండి



ఎంపీడీవోలు, బాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం రామ్మోహన్ రావు

పలమనేరు : ప్రభుత్వం మంజూరు చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలను తక్షణమే పంపిణీ చేయాలని ఎల్‌డీఎం రామ్మోహన్ రావు సూచించారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగిన ఎంపీడీవోలు, బాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016-17 రుణాలకు సంబంధించి ఇంకనూ పంపిణీ కాని రుణాలను నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. అలాగే 2017-18 రుణాల పంపిణీ కూడా ప్రారంభించాలన్నారు. ఎంపీడీవోలు, బ్యాంకర్లు సమన్వయంతో చర్చించుకొని నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ మాణిక్యం శెట్టి, పలమనేరు, గంగవరం, చౌడేపల్లె, పుంగనూరు, రామసముద్రం మండలాలకు చెందిన ఎంపీడీవోలు, బ్యాంకు మేనేజర్లు, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం

పలమనేరు : పుట్టిన పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమని అంగన్ వాడీ సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, సుగుణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పాతపేట కేవీఎస్ వీధిలోని అంగన్ వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణీలకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ తల్లి పాలు పిల్లల ఆరోగ్యానికి, ఎదుగుదలకు చక్కటి పోషకాహారం అన్నారు. పిల్లలకు కనీసం సంవత్సరం పాటు తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలు తాగిన పిల్లలు చక్కని ఎదుగుదల కలిగి ఉండడంతో పాటు రోగ నిరోధక శక్తి కలిగి ఉంటారన్నారు. బాలింతలు చక్కటి పౌష్టికాహారం, పాలు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణీలకే కాక బాలింతలకు కూడా ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందజేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్ అనసూయ, హెల్పర్ మలర్‌తో పాటు పలువురు తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

5న ఆస్తుల పంపిణీ

పలమనేరు రూరల్ : ఈ నెల 5వ తేదిన నియోజకవర్గ స్థాయి నెలవారి ఆస్తుల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హర్మత్ తెలిపారు. మంత్రి అమరనాథరెడ్డిచే నెలవారి ఆస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకర్గంలోని అన్ని మండలాల అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

నేడు గుండం కైలాసగిరిలో వరలక్ష్మీ వ్రతం

బంగారుపాళ్యం : మొగిలివారిపల్లెలో వెలసిన గుండం కైలాస గిరి పార్వతమ్మ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆయల నిర్మాణ దాత శివయ్య స్వామి తెలిపారు. మహిళలు పూజా సామగ్రిని తీసుకురావాలని కోరారు.

వారాల కృష్ణమూర్తికి కీర్తి పురస్కారం

పలమనేరు : వాయల్పాడుకు చెందిన ప్రముఖ రచయిత వారాల కృష్ణమూర్తికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అందించే కీర్తి పురస్కారం లభించింది. ప్రస్తుతం వారాల కృష్ణమూర్తి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. కృష్ణమూర్తికి పురస్కారం ప్రకటించడం పట్ల చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య సమన్వయ కర్తలు సాకం నాగరాజు, పలమనేరు బాలాజీ, చిత్తూరు జిల్లా అరసం నేతలు గంటామోహన్, యువశ్రీ మురళీలు అభినందనలు తెలిపారు.

కో ఆపరేటివ్ డైరెక్టర్లకు శిక్షణ

బైరెడ్డిపల్లె/గంగవరం : నేషనల్ కౌన్సిల్ కో ఆపరేటివ్ సంస్థ సౌజన్యంతో హైదరాబాద్‌లో ఈ నెల 1వ తేది నుంచి 3 వరకు కో ఆపరేటీవ్ డైరెక్టర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు పలమనేరు కో ఆపరేటివ్ సూపర్ బజార్ డైరెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాసులు నాయుడు హాజరయ్యారు. సూపర్ బజార్ల అభివృద్ధికి ప్రణాళిక, రూపకల్పన, డైరెక్టర్ల విధులు, బాధ్యతల గురించి శిక్షణ పొందినట్లు డైరెక్టర్లు తెలిపారు. తమకు సర్టిఫికెట్లు కూడా అందజేసినట్లు తెలిపారు.

చలమంగళంలో ఎంఆర్ శిబిరం

పెద్దపంజాణి : చలమంగళం ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు గురువారం పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి రవిశంకర్ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించండి

పెద్దపంజాణి : చెక్‌డ్యామ్‌ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఇరిగేషన్ జేఈ గంగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు ఆపేస్తామన్నారు. వర్షాలకు తుర్లపల్లె సమీపంలో పెద్దజవుకు వంకలో చెక్‌డ్యామ్ వర్షపు నీటితో నిండిపోయింది. ఈ నేపథ్యంలో నిర్మాణత పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

తిరుపతి గంగమాంబ సన్నిధిలో నేడు వరలక్ష్మీ వ్రతం

కుప్పం: కుప్పంలోని తిరుపతి గంగమాంబ సన్నిధిలో శుక్రవారం సాయంత్రం వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్‌ బిఎంకె.రవిచంద్రబాబు, డైరెక్టర్లు ఎల్‌ఎల్‌.ఉదయకుమార్‌, నాటారు కృష్ణ, వివి.యశ్వంత్‌ కుమార్‌, సికె.కృష్ణ, ఎన్‌ బికె.సురేశ్‌ , దేవరాజు, మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రాత్రి 7.15 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం ప్రారంభిస్తామన్నారు. ముత్తైదువలందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులవ్వాలని కోరారు. పూజలో పాల్గొన్న మహిళలకు జాకెట్టు, పసుపు, కుంకుమలతో కూడి ముత్తైదు సొంగెం పంపిణీ చేస్తామని వారు చెప్పారు.

మొక్కుబడిగా బ్యాంకర్ల సమావేశం

కుప్పం : ఒక్కో బ్యాంకు పరిధిలో వందల యూనిట్లు మంజూరైనా లబ్ధిదారులకు ఆయా రుణ మొత్తాలను విడుదల చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహిస్తూ వస్తున్నారు. ప్రధానంగా కార్పొరేషన్‌ రుణాలు పంపిణీ కాకుండా వందల్లో నిలిచిపోయాయి. దీనితోపాటు ముద్ర రుణాలు, డ్వాక్రా సంఘాలకు ఇవ్వాల్సిన రుణాలు, పంట రుణాలు కూడా పెండింగులోనే ఉన్నాయి. దీన్ని చక్కదిద్దడానికి కలెక్టర్‌ సంకల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఈ క్రమంలో బ్యాంకర్ల సమావేశాలు జరుగుతున్నాయి. అలాగే గురువారం నాడు కుప్పం నియోజకవర్గానికి సంబంధించి లీడ్‌ బ్యాంకు మేనేజరు రామ్మోహన్‌ రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ప్రారంభమైన సమావేశానికి హాజరైన బ్యాంకు మేనేజర్ల సంఖ్య తక్కువే. వారి తరఫున ఆయా బ్యాంకులకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత ప్రజాప్రతినిధులెవ్వరూ కనిపించలేదు. దీంతో రుణ యూనిట్ల జారీలో లక్ష్యాలు పూర్తి చేయడానికి ఉద్దేశించిన సమావేశం కాస్తా బ్యాంకర్ల కష్టాలు చెప్పుకునే చర్చా వేదికగా తయారైపోయింది. ఒక్కరంటే ఒక్క బ్యాంకరు కూడా ఎల్డీఎంకు సరైన సమాధానమివ్వలేదు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్‌ రుణాలకు సంబంధించి యూనిట్లు మంజూరైనా బ్యాంకులు లబ్ధిదారులను తమ చుట్టూ తిప్పించుకుంటున్నాయి తప్ప, నిధులను వారి అకౌంట్లకు వేయడంలేదు. చాలామంది లబ్ధిదారులు ఆయా బ్యాంకుల చుట్టూ తిరిగి, వారి నుంచి సరైన సమాధానాలు రాకపోవడంతో విసిగిపోయారు. స్థానిక ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగడం ప్రారంభించారు. వీరు ఫోన్లు చేసినా పనైతే బ్యాంకుల్లో కావడంలేదు. దీన్ని సరిదిద్ది, కార్పొరేషన్‌ రుణ యూనిట్లను లబ్ధిదారులకు వెంటనే నగదుగా మారేలా చేసి లక్ష్యం పూర్తి కావడం కోసం కలెక్టర్‌ బ్యాంకర్ల సమావేశాలను ఉద్దేశించారు. ఈ సమావేశాలకు ఎంపీపీ, జడ్పీటీసీలతోపాటు ఆయా పంచాయతీల సర్పంచ్‌లు హాజరైతే లబ్ధిదారుల కష్టాల గురించి వారికి అవగాహన ఉంటుంది కాబట్టి ఏదైనా చెప్పేందుకు వీలుంటుంది. అయితే కుప్పం మండలంలో ప్రసిద్ధమైన కనకనాశమ్మ జాతరతోపాటు, ఆడి పదునెట్టు ఆధ్యాత్మిక సంబరాలు కూడా గురువారమే కావడంతో ఏ మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు కూడా మధ్యాహ్నం 12.30 గంటలదాకా సమావేశంవైపు తిరిగి చూడలేకపోయారు. ఆలోగా ఎల్డీఎం, ఏవో మొక్కుబడిగా రుణాల గురించి ఆరా తీయడం, బ్యాంకర్లు తమ కష్టాలు ఏకరువు పెట్టడానికే సమయం గడిచిపోయింది. ఆ తర్వాత కుప్పం ఎంపీపీ సాంబశివం, జడ్పీటీసీ రాజ్‌కుమార్‌, కుప్పం సర్పంచ్‌ చిట్టెన్‌ వెంకటేశ్‌లు సమావేశానికి వచ్చినా, ఏయే బ్యాంకులో ఎన్నేసి రుణ యూనిట్లు పెండింగులో ఉండిపోయాయో లెక్క చదవడానికే మరో గంట సమయం అయిపోయింది. ఆ తర్వాత కూడా కార్పొరేషన్‌ రుణ యూనిట్లు పెండింగులో ఉండిపోవడంపై కుప్పం మండల ప్రజాప్రతినిధుల ఆక్రోశం తప్ప, బ్యాంకర్ల నుంచి సరైన సమాధానమే రాబట్టలేకపోయారు. మిగిలిన మూడు మండలాల ప్రజాప్రతినిధులు అసలు సమావేశానికి హాజరే కాలేదు. కాకపోతే రుణ లక్ష్యాలను పూర్తి చేయాల్సిందిగా పైపై ఆదేశాలు ఇచ్చిన ఎల్డీఎం తర్వాత చాప చుట్టేశారు. మొత్తంమీద బ్యాంకర్ల సమావేశం నిరర్థకంగా, నిస్సారంగా, ప్రయోజన రహితంగా ముగిసిపోయింది.

సొంత కష్టాల ఏకరువుకే పరిమితమైన బ్యాంకర్లు



బ్యాంకర్ల సమావేశంలో వివరాలు తెలుసుకుంటున్న ఎల్డీఎం రామ్మోహన్‌రావు

11న విద్యుత్‌ అదాలత్‌

శాంతిపురం : స్థానిక రెస్కో కార్యాలయంలో ఈ నెల 11న విద్యుత్‌ అదాలత్‌ నిర్వహించనున్నట్లు రెస్కో డైరెక్టర్‌ విజయకుమార్‌ తెలిపారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్‌ అదాలత్‌ ఏర్పాటు చేయడం రెస్కో వినియోగదారులకు లాభసాటి అన్నారు. రెస్కోకి దీర్ఘకాలిక బకాయిలు చెల్లించాల్సిన వినియోగదారులు విద్యుత్‌ అదాలత్‌కు హాజరైతే భారీ రాయితీ కల్పిస్తారన్నారు. అలాగే కొన్ని సంవత్సరాల నుంచి వినియోగం లేని సర్వీసులను రద్దు పరచే అవకాశం వినియోగదారులకు దక్కుతుందన్నారు. తక్కువ హెచ్‌పీకి సర్వీసు తీసుకుని ఎక్కువ హెచ్‌ పీతో మోటర్లు రన్‌ చేస్తున్నారని, అలాంటి వారందరూ అడిషనల్‌ లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

పరిహారం చెల్లించి పనులు చేయండి

హంద్రీనీవా కాలువ పనులను అడ్డుకున్న రైతులు

శాంతిపురం : పరిహారం చెల్లించి పనులు చేయాలంటూ హంద్రీనీవా కాలువ కాంట్రాక్టర్లను గురువారం రైతులు అడ్డుకున్నారు. గుండిశెట్టిపల్లె, ఎంకేపురం గ్రామాల పరిసరాల్లో జరుగుతున్న హంద్రీనీవా కాలువ పనులను పలువురు రైతులు పనులు ఆపే ప్రయత్నం చేశారు. ఇంతలోపు విషయం తెలుసుకున్న వీఆర్వో గోవిందరాజులు స్థానిక నేతలైన ప్రభాకర్‌రెడ్డి, మునెప్ప, సుధాకర్‌రెడ్డితోపాటు కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు కలిసి రైతులతో చర్చించారు. పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేసుకోవాలని రైతులు పట్టుపట్టారు. 90 శాతం మంది రైతులకు పరిహారం చెల్లించారని, మిగిలిన రైతులకు కూడా త్వరలోనే పరిహారం చెల్లిస్తారన్నారు. ఒక వేళ పరిహారం రాకపోతే తాము ముందుండి పరిహారం తీసిచ్చే బాధ్యతను తీసుకుంటామని గట్టి హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి పనులు చేసుకోవాలన్నారు. దీంతో హంద్రీనీవా కాలువ పనులు యధావిధిగా జరిగాయి.

ఎన్‌సీసీ శిబిరంలో శాంతిపురం విద్యార్థుల ప్రతిభ



శాంతిపురం : తిరుపతి 5వ ఆంధ్ర గర్ల్స్‌ బెటాలియన్‌ ఆధ్వర్యంలో కంబైన్డ్‌ ఎన్యువల్‌ ట్రైనింగ్‌ క్యాంప్‌ను తిరుపతి ఎన్‌సీసీ నగర్‌లో జూలై 25 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు నిర్వ హించారు. ఈ శిబిరంలో శాంతిపు రం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నరేష్‌, దేవేంద్ర, అరుణ్‌, ధనరాజ్‌ పాల్గొన్నారు. రాయలసీమ స్థాయి వాలీబాల్‌ పోటీల్లో బంగారు పతకాలను సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్‌ ఎం మహేశ్వరావు, పీడీ బాబు అభినందించారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలంటూ ధర్నా



రామకుప్పం : మండల కేంద్రంలోని ఉర్దూ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయుల కొరత తీర్చాలంటూ తల్లిదండ్రులతో కలిసి రోడ్డెక్కారు. నాలుగేళ్లుగా ఉపాధ్యాయుల కొరత కారణంగా తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఖాళీ కుర్చీలపై ఉపాధ్యాయుల పేరిట ఫ్లెక్సీలు, రాళ్లు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. సుమారు అరగంట సేపు రోడ్డుపై వారు బైఠాయించారు. అనంతరం పోలీసులు వారికి సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

గుడివంకలో వైభవంగా ఆడి పూజలు

గుడుపల్లె : గడివంకలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం ఆడి పదునెట్టి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారి మూల విగ్రహానికి అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు కావళ్ళ మోసుకుని కొనేరులో స్నానం ఆచరించి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

కంటి చికిత్స శిబిరాలకు విశేష స్పందన

రామకుప్పం : జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పీఈఎస్‌ వైద్య కళాశాల ఆసుపత్రి, రామకుప్పం సుబ్రహ్మణ్యాలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రామకుప్పం, విజలాపురం గ్రామాల్లో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఈ శిబిరాల్లో 75 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, చికిత్సలందించారు. 15 మంది రోగుల్ని మెరుగైన చికిత్సల కోసం పీఈఎస్‌ ఆసుపత్రికి తరలించారు.

చంద్రబాబుతోనే కార్మిక సంక్షేమం



టీఎన్టీయూసీలో చేరిన కార్మికులతో టీడీపీ నాయకులు

సీఎం వ్యక్తిగత కార్యదర్శి మనోహర్‌

కుప్పం : ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే కార్మిక సంక్షేమం సాధ్యమని సీఎం పీఏ మనోహర్‌ అన్నారు. కుప్పం ఆర్టీసీ డిపోలో నేషనల్‌ మజ్దూర్‌ యూనియన్‌ (ఎన్‌ఎంయూ) కార్మిక సంఘానికి చెందిన సుమారు 70 మంది కార్మికులు సీకేరవి ఆధ్వర్యంలో టీఎన్టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో ఆవరణలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మనోహర్‌ మాట్లాడుతూ చంద్రన్నబీమా వంటి పథకాలు కార్మికుల కోసమే ప్రభుత్వం ఉద్దేశించిందన్నారు. జడ్పీటీసీ రాజ్‌కుమార్‌, మార్కెట్టు కమిటీ మాజీ ఛైర్మన్‌ సత్యేంద్రశేఖర్‌ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీఎన్టీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నకేశవులు, వరహాలనాయుడు మాట్లాడుతూ ఇంతమంది కార్మికులు కుప్పం డిపో నుంచి ఒక్కసారిగా టీఎన్టీయూసీలో చేరుతుండడం హర్షణీయమని పేర్కొన్నారు. వారి నమ్మకం వమ్ము కాకుండా అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. అనంత రం టీఎన్టీయూసీలోకి వచ్చిన సుమారు 70 మంది కార్మికులకు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కుప్పం టీడీపీ మండల అధ్యక్షుడు చౌడప్ప, గుడుపల్లె ఎంపీపీ మునిరాజుతోపాటు పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలి

శాంతిపురం : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్‌ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆగస్టు 2వ తేదీలోపు విద్యార్థులు తమ్మస్తీ ఐటీఐ కళాశాలలో దరఖాస్తు ఫారాలు పొందవచ్చన్నారు.

పాఠశాల విద్యే భవిష్యత్‌ కు పునాది

శాంతిపురం : పాఠశాల విద్యే విద్యార్థుల భవిష్యత్‌కు పునాదని ఎంపీపీ పుష్ప అన్నారు. గురువారం శివరాంపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉండగా అందులో 9 గంటలకు ఒక ఉపాధ్యాయుడు మాత్రమే హాజరైనట్లు ఆమె గమనించారు. ఇంతలోపు మరో ఉపాధ్యాయుడు హాజరయ్యాడు. 103 మంది విద్యార్థులుండగా ఒకేసారి ఇద్దరూ ఉపాధ్యాయులకు సెలవు ఇచ్చేస్తే పాఠ్యాంశాలు ఎలా పూర్తి చేస్తారని ఎంపీపీ ఎంఈవోను ప్రశ్నించింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులు నడుచుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వి.కోట : పత్రపల్లి-వి.కోట ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకులదొడ్డికి చెందిన రాజశేఖర్‌రెడ్డితోపాటు పత్రపల్లికి చెందిన శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు. గురువారం రాత్రి పత్రపల్లి సమీపంలో రోడ్డుదాటుతున్న వ్యక్తిని ఆకులదొడ్డికి చెందిన యువకుడు ద్విచక్ర వాహనంపై వస్తూ అతనిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇరువురూ గాయపడ్డారు. స్థానికులు ఇరువురినీ ఆసుపత్రికి చేర్చి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం యువకుడిని పీఈఎస్‌ ఆసుపత్రికి తరలించారు.

సినిమా గైడ్

శ్రీమహాలక్ష్మి	దండుపాళ్యం-2
లక్ష్మీ మూవీలాండ్	ఫిదా
ఎస్‌ఆర్‌ఎం	నిన్నుకోరి
మురుగన్	మాయామాల్

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 4, 6



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.



మిథునరాశి:(మే21-జూన్21): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అ శాంతికి గురవుతారు



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి కొంత నిరుత్సాహకరంగా ఉంటుంది.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్‌ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

6న ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సభ్యుడి రాక

చిత్తూరు కలెక్టరేట్: ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సభ్యుడు, మాజీ జిల్లా జడ్జి ఎల్.రవిబాబు ఈనెల 6, 7 తేదీల్లో జిల్లా పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ ప్రద్యుమ్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వతేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు ఏపీఏటీ సభ్యుడు హైదరాబాద్ నుంచి విమానంలో బయలుదేరి 1.35 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడినుంచి నేరుగా శ్రీకాళహస్తి చేరుకుని ముక్కంటిని దర్శనం చేసుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి, 7వతేదీ ఉదయం 7.30 నుంచి 9 గంటల నడుమ ఆలయంలో జరిగే రాహుకేతు పూజల్లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు రేణిగుంట నుంచి విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు వేమూరులో జాబ్ మేళా

పూతలపట్టు: మండలంలోని వేమూరు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. మేళాను ఏపీఎస్ఎస్‌డీసీ డైరెక్టర్ కె.లక్ష్మీనారాయణ ప్రారంభిస్తారని, టెన్త్, ఇంటర్, బీటెక్, డిగ్రీ విద్యార్థుల హాజరు కావచ్చని చెప్పారు. ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సురేంద్రబాబు మాట్లాడుతూ మొత్తం 12 కంపెనీల ఆధ్వర్యంలో 4 వేల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.8 వేల నుంచి రూ.20 వేల వరకు నెలవారీ వేతనం ఉంటుందన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.31కోట్లు

ఆంధ్రజ్యోతి, తిరుమల: శ్రీవారికి హుండీ ద్వారా రూ.3.31కోట్ల ఆదాయం లభించింది. బుధవారం వచ్చిన కానుకలను గురువారం లెక్కించగా ఈ మేరకు ఆదాయం సమకూరినట్లు అధికారులు ప్రకటించారు.

మార్కెట్ ధరలు

తిరుపతి బులియన్

24 క్యారెట్ల అపరంజి	**బంగారు**
10గ్రాముల ధర	రూ.29,410
22 క్యారెట్ల ఆర్నమెంటు	**బంగారు**
గ్రాము ధర	రూ.2,711
రిటైల్ వెండి గ్రాము ధర	రూ.40.60


మదనపల్లెలో

పట్టుగూళ్ల ధరలు

కనిష్ఠం	330.10
గరిష్ఠం	408.10
సగటు	377.24

టమోటా ధరలు

మొదటి రకం	
కనిష్ఠం	32.00
గరిష్ఠం	44.00
రెండో రకం	
కనిష్ఠం	18.00
గరిష్ఠం	30.00



కోడిగుడ్లు (నెక్)

రైతు గేటు ధర-చిత్తూరు (వందగుడ్లు)	365.00
చెన్నై	: 372.00

ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌కు ఏటీఎల్ మంజూరు

తిరుపతి (విశ్వవిద్యాలయం): ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌కు అటల్ టింకరింగ్ లేబొరేటరీ (ఏటీఎల్) మంజూరైంది. దీనిద్వారా విద్యార్థులకు సైన్స్‌పై మక్కువ పెంచే వివిధ అంశాలను తెలియజేయనున్నారు. ఇందులో అత్యాధునిక శాస్త్ర పరికరాలను ఏర్పాటు చేస్తారు. దీనికి ఐదేళ్లపాటు ప్రతి ఏడాదికి రూ.20లక్షల చొప్పున కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నీతి ఆయోగ్ నిధులు సమకూర్చనుంది. ఈ ల్యాబ్ విద్యార్థులను పరిశోధనల వైపు నడిపించేందుకు తోడ్పడుతుందని వీసీ దామోదరం, రెక్టార్ భాస్కర్, రిజిస్ట్రార్ దేవరాజులు, స్కూల్ హెడ్మాస్టర్ వెంకటేశ్వరరాజు పేర్కొన్నారు.



ఉత్తర్వులను చూపుతున్న వీసీ దామోదరం

15న చిత్తూరులో జేసీ జాతీయ పతాకావిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న చిత్తూరులో జాయింట్ కలెక్టర్ శ్రీగిరీషా జాతీయ పతాకావిష్కరణ చేస్తారని కలెక్టర్ ప్రద్యుమ్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా, డివిజన్, మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో తప్పనిసరిగా జెండా వందనం చేయాలని ఆయన ఆదేశించారు.

పద్మావతి వర్సిటీలో 9న ఎంబీఏ స్పాన్సర్ సీట్ల భర్తీ

తిరుపతి (విశ్వవిద్యాలయం): పద్మావతి వర్సిటీలోని ఎంబీఏ విభాగంలో ఖాళీగా ఉన్న 10 స్పాన్సర్ సీట్లను ఈనెల తొమ్మిదో తేదీన భర్తీ చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. వివరాలకు 0877-2284530 నెంబరు లేదా ఎస్పీఎంవీవీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వర్సిటీ అధికారులు తెలిపారు.

నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

ఆంధ్రజ్యోతి, తిరుమల: డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం జరగనుంది. తిరుమల అన్నమయ్య భవన్‌లో ఉదయం 8.30-9.30 గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులను నేరుగా టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌కు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చు. ఇందుకోసం భక్తులు 0877-2263261 నెంబరుకు కాల్ చేయాలి. కాగా, ఈ కార్యక్రమం ఎస్వీబీసీలో గంటపాటు ప్రత్యక్ష ప్రసారమవుతుంది. అదే సమయంలో శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు జరుగుతాయి. రెండు కార్యక్రమాలను ఒకేసారి ప్రసారం చేయడం సాధ్యపడదు కాబట్టి.. ఉదయం జరిగే స్నపన తిరుమంజనాన్ని రికార్డ్ చేసి.. శుక్రవారం రాత్రికి ప్రసారం చేయనున్నారు.

నందకుమార్‌కు ఇండస్ట్రీ ఎక్స్‌లెన్స్ అవార్డు

నిండ్ర: నిండ్రలోని నేటమ్స్ షుగర్స్ కర్మాగారు ఛైర్మన్ నందకుమార్‌కు ఇండస్ట్రీ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. గురువారం షుగర్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 75వ వార్షిక సమావేశం కొచిలో జరిగింది. చక్కెర పరిశ్రమ, అనుబంధ సంస్థల అభివృద్ధి, పెరుగుదలకు నందకుమార్ చేసిన విశిష్ట సేవలను గుర్తించి ది షుగర్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారు ఈ అవార్డును ప్రదానం చేశారు. నందకుమార్‌కు ఈ అవార్డు లభించడం పట్ల కర్మాగార సిబ్బంది,చెరకు రైతులు హర్షం వ్యక్తం చేశారు.



భవన నిర్మాణ కార్మికులకు రూ.6.10 లక్షల సాయం

తిరుపతి (ఆటోనగర్): జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులకు, వారి కుటుంబాలకు వివిధ పథకాల కింద రూ.6.10 లక్షల ఆర్థిక సాయం చేసినట్లు తిరుపతి ఉపకార్మిక కమిషనర్ కె.విద్యాసాగర్ తెలిపారు. సహజ మరణం కింద ఏర్పేడు మండలం పరమాలపల్లెకు చెందిన పి.గుర్రమ్మ, శ్రీకాళహస్తి మండలం రామలింగాపురం దళితవాడకు చెందిన ఎం.నాగరాజు, గుడుపల్లె మండలం కనమనపల్లెకు చెందిన వి.మునస్వామిలకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున రూ.1.50లక్షలు మంజూరు చేశామన్నారు. ప్రసూతి సహాయం పథకంలో 21 మందికి ఒక్కొక్కరికి రూ.20వేల చొప్పున రూ.4.20 లక్షలు మంజూరు చేశామన్నారు. వివాహ కానుక పథకంలో ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున వై.జగన్నాథం, పి.వెంకటేశు, పి.రాజారెడ్డి, టి.పద్మావతమ్మలకు రూ.40వేలను మంజూరు చేశామన్నారు. లబ్ధిదారుల సౌలభ్యం మేరకు మంజూరు చేసిన మొత్తాలను బ్యాంక్ ఖాతాల్లోకి ఆన్‌లైన్ ద్వారా జమచేశామన్నారు. ఆమేరకు మంజూరు చేసిన సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశామన్నారు. బోర్డు సభ్యులు సి.సాంబశివ, పురుషోత్తం, పి.గిరి, ఎం.నరసింహప్రసాద్, ఆర్.సదాశివం, టి.సురేష్‌బాబు, కె.మురళి, శ్రీరామచంద్రయ్య, ఎ.మల్లికార్జునరావు, పీఎస్ రాజశేఖరగుప్తా పాల్గొన్నారు.

బీఎన్ ఆర్‌పేటలో 7న బేస్‌బాల్ జట్ల ఎంపిక

చిత్తూరు కల్చరల్: చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్ఆర్ పేట ఉన్నత పాఠశాలలో ఈనెల 7న బాలబాలికల జిల్లా సబ్ జూనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. 2002, జనవరి 1 నుంచి 2004 , డిసంబర్ 31 నడుమ జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఆధార్‌కార్డు లేదా బర్త్ సర్టిఫికెట్ తీసుకొని పోటీలకు రావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18 నుంచి 20వతేదీ వరకు కడప జిల్లా జమ్మలమడుగులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఇతర వివరాలకు నెం.9440757933ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

సహకార, కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (టీటీడీ): కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 20 వారాల శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సహకార విద్యాశాఖాధికారి కె.సుధాకర్ గురువారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. జిల్లాలో సహకార సంస్థ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులు 1964 సహకార చట్టం ప్రకారం తప్పనిసరిగా శిక్షణ పొందాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతపురం రామనగర్‌లోని రాయలసీమ సహకార శిక్షణకేంద్రంలో విజయవాడ ఏపీ స్టేట్ సహకార యూనియన్ లిమిటెడ్, రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామన్నారు. సహకార రంగంపై ఆసక్తి కలిగి డిప్లొమా కోర్సు చేయడానికి ఇంటర్ చదివి వారు కూడా ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 'ప్రిన్సిపాల్, రాయలసీమ సహకార శిక్షణ కేంద్రం, రామ్‌నగర్, అనంతపురం' అనే చిరునామాకు ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తులు పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నెం.9490540224ను సంప్రదించాలని సుధాకర్ సూచించారు.

మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శిగా అంకయ్య



తిరుపతి (టీటీడీ): మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శిగా తిరుపతికి చెందిన పైడి అంకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు తిరుపతిలోని వేదిక కార్యాలయంలో అంకయ్యకు నియామకపత్రాన్ని వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ ప్రసాద్ గురువారం అందజేశారు. జిల్లా వినియోగదారుల ఫోరం జిల్లా ఛైర్మన్‌గా, దళిత సాహితీ అకాడమీ జిల్లా అధ్యక్షుడిగా, వే ఫౌండేషన్ నిర్వాహకుడిగా అంకయ్య చేసిన సేవలను ప్రసాద్ కొనియాడారు.

విద్యుత్తు పంపిణీలో విప్లవాత్మకమైన మార్పులు

● ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ హెచ్‌వై దొర
● సీజీఆర్‌ఎఫ్ కోర్టుహాలు ప్రారంభం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ సీఎండీ హెచ్‌వై దొర

తిరుపతి(పద్మావతినగర్): ఏపీఎస్పీడీసీఎల్‌లో వినియోగదారుల కోసం విప్లవాత్మకమైన మార్పులు ప్రవేశ పెట్టామని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ హెచ్‌వై దొర పేర్కొన్నారు. విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్)కు సంబంధించి తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కోర్టు హాలును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని విద్యుత్తు వినియోగదారులకు విద్యుత్తు పంపిణీ వ్యవస్థలో ఎదురయ్యే సేవాలోపాలను సత్వరం పరిష్కరించేందుకు సీజీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిత్తూరు జిల్లాలోని రెస్కో కుప్పం కూడా ఈ ఫోరం పరిధిలోకి చేర్చామన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు సీజీఆర్‌ఎఫ్‌లో అనుభవజ్ఞులైన నలుగురు అధికారులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా విశ్రాంత న్యాయమూర్తి జగదీష్ చంద్రరావు సీజీఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్‌గా నియమితులయ్యారని, శ్రీనివాసులురెడ్డి ఫైనాన్స్ మెంబర్‌గా, డి.సుబ్బారావు టెక్నికల్ మెంబర్‌గా, కన్స్యూమర్ అఫైర్స్ మెంబర్‌గా డాక్టర్ ఆర్.సురేంద్ర కుమార్ ఉన్నారని చెప్పారు.

● నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలి

విద్యుత్తు సంస్థ వినియోగదారులకు అందించాల్సిన సేవలపై ప్రతి సేవకు నిర్ణీత కాలపరిమితి ఉందన్నారు. విద్యుత్తు నియంత్రణ మండలి నియమావళి ప్రకారం సకాలంలో వినియోగదారులకు న్యాయం చేయాల్సి ఉందన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వినియోగదారులు తమ సమస్యలను ఫోరం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాజపత్రం ఏపీఈఆర్‌సీని అనుసరించి నిర్దిష్ట సేవలైన 11 సేవలను సీజీఆర్‌ఎఫ్ ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

● 81 శాతం వినియోగదారులకే అనుకూలం

సీజీఆర్‌ఎఫ్ ద్వారా ఇప్పటివరకు పరిష్కరించిన కేసుల్లో 81 శాతం వినియోగదారులకే అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పారు. కేవలం 19 శాతం మాత్రమే ఎస్పీడీసీఎల్‌కు అనుకూలంగా తీర్పులున్నాయని చెప్పారు.

● డిజిటల్ పే

డిజిటల్ విధానంలో రుసుములు చెల్లించే విధానాన్ని వినియోగదారులు అందిపుచ్చుకోవాలని కోరారు. ఏపీఎస్పీడీసీఎల్ రూ.1.10 కోట్లు చెల్లింపులు అందుకుంటోందని, అయితే వీటిలో కేవలం 15 శాతం మాత్రమే డిజిటల్ పే ద్వారా వస్తున్నాయని చెప్పారు. క్యూలలో నిలబడి సమయాన్ని వృథా చేసుకోకుండా ఆన్‌లైన్ పేమెంట్, ఎస్పీడీసీఎల్, బీమ్, ఐబీపీఎస్ ఆప్‌లను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని వివరించారు. ఇండస్ట్రియల్ కనెక్షన్లను ఇచ్చే విధానాన్ని సులభతరం చేశామని, కేవలం ఆధార్, యాజమాన్య హక్కుల సంబంధించిన పత్రాలను అందచేస్తే చాలని వెల్లడించారు.

● విద్యుత్తు ప్రమాదాలకు నష్టపరిహారం

విద్యుదుత్పాదన, పంపిణీ, విద్యుత్తు వాడకంలో నిర్వహణస్థాయి లోపం వల్ల విద్యుత్తు ప్రమాదానికి గురయ్యే మనుషులకు, జంతువులకు, ఆస్తికి ఇచ్చే పరిహారాన్ని పెంపొందించామని చెప్పారు. మనిషి ప్రాణనష్టానికి, పూర్తి అంగవైకల్యానికి రూ.5 లక్షలు, శాశ్వత, పాక్షిక అంగవైకల్యానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు, తీవ్రమైన గాయానికి రూ.లక్ష, సాధారణ గాయానికి గరిష్ఠంగా రూ.25 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు.జంతువు ప్రాణనష్టం జరిగితే గరిష్ఠంగా రూ.లక్ష వరకు నష్టపరిహారం చెల్లిస్తామని, ఇందు కోసం సీఎండీని సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ ఛైర్‌పర్సన్ జగదీష్‌చంద్ర, ఫైనాన్స్, టెక్నికల్, కన్స్యూమర్స్ అఫైర్ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావు, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

తారకరామా స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

- తిరుపతికి 6న సీఎస్ దినేష్‌కుమార్ రాక



అధికారులకు సూచనలిస్తున్న ప్రద్యుమ్న

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): తారకరామా స్టేడియంలో పంద్రాగస్టు వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం సాయంత్రం కలెక్టర్ ప్రద్యుమ్న పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ డీఐజీ విజయ్‌కుమార్, జేసీ గిరీషా, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనరు హరికిరణ్, జేసీ-2 చంద్రమౌళి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా, వేడుకలకు సంబంధించిన ఏర్పాట్ల పరిశీలనకు ఈనెల 6వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ తిరుపతి వస్తారని అధికారులు తెలిపారు.

సమన్వయంతో పనిచేద్దాం

● రాష్ట్రస్థాయి పంద్రాగస్టు వేడుకలు వైభవంగా నిర్వహిద్దాం
● అధికారులకు కలెక్టర్ ప్రద్యుమ్న పిలుపు

తిరుపతి నగరం: 'సమన్వయంతో పనిచేద్దాం. తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పంద్రాగస్టు వేడుకలను వైభవంగా నిర్వహిద్దాం' అని అధికారులకు కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న పిలుపునిచ్చారు. పంద్రాగస్టు వేడుకలపై గురువారం మధ్యాహ్నం మరోసారి వివిధ శాఖల అధికారులతో ఆయన తిరుపతి సబ్ కలెక్టరేట్‌లో చర్చించారు. ప్రభుత్వ శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెల 10వ తేదీలోపు సివిల్ వర్క్‌లను పూర్తి చేయాలన్నారు. తిరుపతివాసులు వీక్షించేలా నగర కూడళ్లలో ఎల్‌ఈడీ స్క్రీన్లను పెట్టాలన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకలకు ఆతిథ్యమిస్తున్న ఎస్వీయూ క్రీడామైదానాన్ని సర్వాంగం సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. వేదికను అన్ని హంగులతలో ఏర్పాటు చేయాలన్నారు. ఫోర్ట్‌వాల్, వీఐపీలు, మీడియా గ్యాలరీలు, మైక్ సిస్టమ్, ఎల్ ఈడీ స్క్రీన్ల ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు, ఎన్‌సీసీ దళాల మార్చ్‌ఫాస్ట్, ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాట్లు మొక్కుబడిగా ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఆకట్టుకునే భావాంశాలతో ప్రదర్శనలు ఉండాలన్నారు. తిరుపతి రైల్వేస్టేషన్, విమానాశ్రయాల వద్ద వీఐపీలకు స్వాగత ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు మెరుగైన విధానాలను అనుసరించాలన్నారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు, పాస్‌ల పంపిణీ విషయంలో వివాదాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. నిరంతరం విద్యుత్X సరఫరా చేయాలన్నారు. నీరు, స్నాక్స్ సరఫరా చేయాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ మెడికల్ సెంటర్లను, అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ భవనాలకు లైటింగ్ పనుల విషయంలో టీడీడీ, నగరపాలక సంస్థలు కీలకంగా పనిచేయాలన్నారు. ప్రైవేటు ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రద్యుమ్న

ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా పండగ: జిల్లా, మండల కేంద్రాల్లో, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆగస్టు 15వ తేదీన ఉదయం తప్పనిసరిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని ప్రద్యుమ్న అన్నారు.

జెండా వందనం చేసి, జాతీయ గీతాలాపన చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవో పి.భాస్కర్, జేసీ గిరీషా, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరికిరణ్, సబ్ కలెక్టర్ నిషాంతX కుమార్, జేసీ2 చంద్రమౌళి, అసిస్టెంట్ కలెక్టర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు.




వికలాంగులు, వృద్ధుల టోకెన్లజారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఈవో, జేఈవో - సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల వ్యవస్థపై చర్చిస్తున్న ఈవో, జేఈవో, సీవీఎస్వో

దివ్యాంగుల టోకెన్లలో జాప్యం వద్దు

ఈవో ఏకే సింఘాల్

తిరుమలలో ఈవో, జేఈవో తనిఖీలు

ఆంధ్రజ్యోతి, తిరుమల: వృద్ధులు, దివ్యాంగులకు టోకెన్లు జారి చేయడంలో ఎటువంటి జాప్యం చేయవద్దని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అక్కడి సిబ్బందికి సూచించారు. తిరుమలలో మ్యూజియంకు ఎదురుగా ఉన్న వృద్ధులు, దివ్యాంగుల టోకెన్ జారీ కేంద్రాన్ని ఈవో, జేఈవో గురువారం పరిశీలించారు. అనంతరం పీఏసీ-4లో ఉన్న సెంట్రల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వెళ్లారు. సీసీ కెమెరా వ్యవస్థ గురించి సీవీఎస్వో రవికృష్ణ వారికి వివరించారు. అనంతరం లగేజీ భద్రపరిచే కేంద్రాన్ని ఈవో తనిఖీ చేసి ఆలస్యంగా కాకుండా లగేజీ, సెల్‌ఫోన్లు భక్తులకు అందించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. వంటశాలను పరిశీలించి బ్రహ్మోత్సవాల సమయంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో భక్తులకు ఈ వంటశాల నుంచి అన్నప్రసాదాల పంపిణీ చేయాలని సూచించారు. అదేవిధంగా నాలుగు మాడవీధులు, ఇతర ప్రాంతాలలో జరుగుతున్న బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఈవో, జేఈవో ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఈ-2రామచంద్రారెడ్డి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో కోదండరామారావు, వీఎస్వో రవీంద్రరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

వైభవంగా ఆడి పూజలు



ప్రత్యేక అలంకరణతో కనకనాశమ్మ

● బ్రహ్మదేవర చేన్లకు పోటెత్తిన ఆంధ్ర, తమిళనాడు భక్తులు

కుప్పం రూరల్ : చల్లంగా చూడు... కనకనాశమ్మా అంటూ వేలాదిమంది భక్తులు పూనకంతో ఊగిపోయారు. ఇటు ఆంధ్ర, అటు తమిళనాడు ప్రజలు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ఈసారి ఆడి పదునెట్టిని పురస్కరించుకుని కుప్పం మండలం కంగుంది పంచాయతీ బ్రహ్మదేవర చేన్ల వద్ద వెలిసిన ప్రసన్న కనకనాశమ్మ జాతరను పురస్కరించుకుని రెస్కో చైర్మన్ పీఎస్ మునిరత్నం, సీఎం పీఏ మనోహర్, మదనపల్లె సబ్ కలెక్టర్ వెట్రిశెల్వి పర్యవేక్షణలో గురువారం పూజలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ పూజారులు కనకనాశమ్మకు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కోళ్ళు కోసి, పొంగళ్ళు పెట్టి జాతర జరుపుకున్నారు. పలువురు తలనీలాలు సమర్పించి పక్కనే ఉన్న కోనేటి చెక్ డ్యాంలో స్నానం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే ఆడిని పురస్కరించుకుని చెక్కునత్తం పంచాయతీలో వెలిసిన బాలసుబ్రహ్మణ్యం ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు. నూలుకుంటలో వెలిసిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు నోటికి శూలం గుచ్చుకుని నిమ్మకాయల హారాలతో హోం హర హర వేల్ మురుగా అంటూ నినదిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.



భక్తురాళ్ల పొర్లు దండాలు



వీపునకు శూలాలు గుచ్చుకున్న భక్తుడు

విభిన్న పాత్రలు చేయడమే లక్ష్యం

● ఫిదా విజయయాత్రలో హీరో వరుణ్‌తేజ్



అభిమానులను ఆకట్టుకునే మాస్ పాత్రలే కాకుండా విభిన్న పాత్రలు చేయడం తన లక్ష్యమని వర్ధమాన కథానాయకుడు వరుణ్‌తేజ్ చెప్పారు.ఆయన హీరోగా నటించిన ఫిదా చిత్రం విజయయాత్రలో భాగంగా చిత్రబృందంతో కలసి గురువారం వరుణ్‌తేజ్ తిరుపతి వచ్చారు. సంధ్య థియేటర్‌లో మధ్యాహ్నం ప్రేక్షకులతో కలసి సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిదా సినిమాను ఇంత హిట్ చేసినందుకు ప్రేక్షకులకు రుణపడి ఉంటానన్నారు. వెంకీ అనే కొత్త దర్శకుడితో ఓ చిత్రంలో నటిస్తున్నట్లు చెప్పారు. 'ఈ పిల్లకు నో లెక్క... ఓన్లీ తిక్కే' అంటూ ఫిదా సినిమాలో డైలాగ్ చెప్పి అలరించారు.హీరోయిన్ సాయిపల్లవి మాట్లాడుతూ ఫిదా చిత్రం బంపర్ హిట్ కావడం ఆనందంగా ఉందన్నారు.ప్రేక్షకుల ప్రేమకు ధన్యవాదాలు తెలియజేశారు.ఓ డైలాగ్ చెప్పి అలరించారు. చిత్ర దర్శకుడు శేఖర్ కమ్ముల, నటులు రాజేష్, సాయిచరణ్ మాట్లాడుతూ ఫిదా చిత్రాన్ని క్లాస్, మాస్ ఆడియన్స్ పెద్ద హిట్ చేశారని ఆనందం వ్యక్తం చేశారు.నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ ఆడియో పంక్షన్‌లోనే ఫిదా చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ అవుతుందని తాను చెప్పానన్నారు. విజయోత్సవ యాత్రను తిరుపతి నుంచే ప్రారంభించామన్నారు.పవన్ కళ్యాణ్‌కు ఖుషీ, బన్నికి ఆర్య చిత్రాల లాగా వరుణ్‌తేజ కెరీర్‌లో ఫిదా చిత్రం అలాంటిదన్నారు. క్లాస్ సినిమాను మాస్ ఆడియన్స్ ఇంత పెద్ద హిట్టు చేయడం ఆనందంగా ఉందన్నారు. వరుణ్ తేజ, సాయిపల్లవి నడుమ లవ్ కెమిస్ట్రీ బాగా కుదిరిందన్నారు. టీటీడీ మాజీ డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ,ప్రముఖ నిర్మాత ఎన్‌వీ ప్రసాద్,ఎన్‌వీ పూజ, పాండ్రవేటి వివేక్ తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(విద్య)

అలరించిన శ్రీకృష్ణ పారిజాతం

నృత్యరూపకం



శ్రీవారి ఆలయం ముందున్న నాదనీరాజనం వేదికపై గురువారం సాయంత్రం శ్రీకృష్ణపారిజాతం నృత్యరూపకం భక్తులను అలరించింది. అమెరికాలో స్థిరపడిన ప్రవాసాంధ్రులు ముంగర శ్రీదేవిచిన్మయి బృందం శ్రీకృష్ణ పారిజాతం ఘట్టాన్ని కళ్లకు కట్టినట్టుగా కూచిపూడి నృత్యరూపకం ద్వారా ప్రదర్శించారు. అనంతరం ఎస్వీబీసీ అధికారులు కళాకారులను ఘనంగా సన్మానించారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

పారిశుధ్య కార్మికుల నిజాయితీ

ఆంధ్రజ్యోతి, తిరుమల: తిరుమల గెస్ట్‌హౌస్‌లో వదిలివెళ్లిన బంగారు ఆభరణాలను భక్తులకు అప్పగించి పారిశుధ్య కార్మికులు నిజాయితీ చాటుకున్నారు. శ్రీవారి దర్శనార్థం హైదరాబాద్‌కు చెందిన రితీష్ కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం తిరుమల వచ్చారు. అన్నమయ్యభవన్‌లోని 11నంబర్ గది అద్దెకు తీసుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం గురువారం ఉదయం గది ఖాళీచేసి వెళ్లారు. తరువాత పారిశుధ్య కార్మికులు గది శుభ్రంచేస్తుండగా యాబైగ్రాముల బరువైన తాళిబొట్టు, బంగారం గాజు, చైను లభించాయి. . వెంటనే వారు వాటిని అన్నమయ్య భవన్ అటెండర్ ప్రకాష్‌కు అప్పగించారు. రిజిష్టర్‌లో నమోదైన సెల్ నెంబర్ ఆధారంగా సొంతదారులకు సమాచారం అందించారు. అనంతరం పద్మావతినగర్ మేనేజర్ కామేశ్వరరావు, విజిలెన్స్ సిబ్బంది సమక్షంలో ఆభరణాలను భక్తులకు అప్పగించారు.





బంగారు ఆభరణాలను భక్తులకు అప్పగిస్తున్న టీటీడీ సిబ్బంది

ఆంధ్రజ్యోతి
చిత్తూరు
పుత్తూరు జోన్
శుక్రవారం 4 ఆగస్టు 2017



కారుణ్య

జనాభా వారోత్సవాల పోటీల్లో డైట్ విద్యార్థుల ప్రతిభ

కార్వేటినగరం: ప్రపంచ జనాభా వారోత్సవాల పోటీల్లో జిల్లా విద్యా శిక్షణ సంస్థ విద్యార్థిని కారుణ్యకు ద్వితీయ స్థానం వచ్చినట్టు డైట్ ప్రిన్సిపాల్ రంగారెడ్డి తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కారుణ్య ఎస్సీఈఆర్టీ అమరావతిలో మూడు రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచి అవార్డును అందుకుని డైట్ పేరు ప్రతిష్టతను నిలిపిందన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం సాయిప్రతాప్, ఉమాశంకర్, జయదేవ్, సుధీర్, గంగిరెడ్డి, దేవప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి ఆ విద్యార్థినిని అభినందించారు.

రెవెన్యూ లీల

రేషన్ కార్డులో ఫొటో మార్చేశారు



యజమాని ఇచ్చిన అసలు ఫొటో- రేషన్ కార్డులో పెట్టిన ఫొటో

వెదురుకుప్పం: రేషన్ కార్డులో పిల్లల పేర్లు చేర్పించాలని గ్రూపు ఫొటో ఇస్తే.. ఏకంగా ఫొటో మార్చి చుక్కలు చూపించారు. ఈ సంఘటన వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. వెదురుకుప్పం మండలం పాతగుంట గ్రామానికి చెందిన ఎ.వెంకటేష్ ఆచారికి డబ్ల్యుఏపీ 104303100017 నెంబరుతో రేషన్‌కార్డు ఉంది. అయితే గతంలో భార్య, ఒక బిడ్డతో కార్డు ఉండేది. మరో ముగ్గురి పిల్లల పేర్లను చేర్చడానికి పాతగుంట మీ-సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఆ కుటుంబం ఫొటో ఇచ్చారు. కానీ, రెవెన్యూ సిబ్బంది రేషన్‌కార్డులో కుటుంబం ఫొటో లేకుండా మార్చేసి చుక్కలు చూపించారు. సిబ్బంది తప్పిదం పిల్లల చదువులకు ఆటంకం కలుగుతోందని ఆ కుటుంబం బాధపడుతోంది. రెవెన్యూ లీలా.. మజాకా!.

ఒకరి అరెస్టు.. 10 లీటర్ల సారా స్వాధీనం


నిందితుని అరెస్టు చూపుతున్న సీఐ విజయకుమార్

కార్వేటినగరం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పాలసముద్రం మండలం మిట్టకండ్రిగ గ్రామంలో సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ విజయకుమార్, ఎక్సైజ్ సీఐ నీరజ తెలిపారు. గురువారం ఉదయం దాడులు నిర్వహించి మణి వద్ద ఉన్న పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. మణిని చిత్తూరు కోర్టుకు తరలించినట్టు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్ఐలు విజయకుమార్, వరుణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన బాబు

నారాయణవనం: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణవనం మండల పరిధిలో గురువారం జరిగింది. నాగలాపురం మండలం అచ్చంనాయుడు కండ్రిగ దళితవాడకు చెందిన బాబు(35) గురువారం మధ్యాహ్నం పుత్తూరు సమీపంలోని నేసనూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. సాయంత్రం ద్విచక్రవాహనంపై తమ గ్రామానికి తిరిగి వెళుతుండగా సిద్ధార్థ కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై నారాయణవనం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూమి కొనుగోలు పథకం సద్వినియోగం చేసుకోండి

శ్రీరంగరాజపురం: భూములు లేని దళితులు భూమి కొనుగోలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటలక్ష్మమ్మ అన్నారు. గురువారం ఎస్ఆర్‌పురం మండలంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూమిలేని ఎస్సీల కోసం ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మాగాణి అయితే ఎకరాకు రూ.3 లక్షల వంతున మూడు ఎకరాలు కొనుగోలు చేసుకోవచ్చునని, ఇందులో 75 శాతం ఎస్సీ కార్పొరేషన్, 25 శాతం బ్యాంకు రుణం ద్వారా పొందవచ్చునని తెలిపారు. అలాగే పుంజ భూమి అయితే ఎకరాకు ఆరు లక్షల వంతున రెండు ఎకరాలు కొనుగోలు చేసుకోవచ్చునని అవసరమైన వారు తహసీల్దార్ కార్యాలయం లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డీటీ మధుబాబు, డీలర్ల సంఘ అధ్యక్షుడు జయరాం నాయుడు, సీఎస్‌డీటీ మోహన్, గురప్ప పాల్గొన్నారు.

సినిమా గైడ్

పుత్తూరు

శాంతి	నవమన్మథ
విష్ణుమహల్	ఫిదా
శ్రీనివాస	గౌతమ్ నంద

యధేచ్ఛగా ఇసుక దందా

అడుగడుగునా నిబంధనల బేఖాతరు • వసూళ్లతో సరిపెడుతున్న రెవెన్యూ సిబ్బంది



ట్రాక్టర్లలో ఇలా ఇసుక తరలింపు - ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మార్గం ఇదే

వెదురుకుప్పం: అక్రమ ఇసుక వ్యాపారానికి కళ్లెం వేయాలని సీఎం చంద్రబాబు ఆదేశిస్తూ ఉన్నా.. క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వల్ల వ్యాపారులకు వరంగా మారింది. రెవెన్యూ చిరుద్యోగికి సైతం కాసుల పంట పండిస్తోంది. వెదురుకుప్పం మీదుగా ఇసుక దందా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం మీదుగా వ్యాపారం జోరుగా సాగుతోంది. కార్వేటినగరం, ఎస్సార్ పురం మండలాల్లో కుశస్థలి నది ఉంది. ఈక్రమంలో ఎస్సార్‌పురం మండల పరిధిలోని ఉడమకుడితి సమీపంలో, కార్వేటినగరం మండలంలోని కత్తిరపల్లె సమీపంలో కుశస్థలి నదీలో నుంచి తెల్లబంగారం తోడేస్తున్నారు.

తరలిపోతున్న తెల్లబంగారం

నిత్యం ట్రాక్టర్లలో ఇసుకను కుశస్థలి నది నుంచి ఎర్రమరాజుపల్లె రోడ్డు మార్గంలో కొరమగుంట క్రాస్ రోడ్డులో వెదురుకుప్పం, రామచంద్రాపురం మండలంలోని పలు గ్రామాలకు ఇసుకను తరలిస్తున్నారు. విరాటపురం రోడ్డు మార్గంలో కూడా పచ్చికాపల్లం చేరుకుని ఇసుకను తరలిస్తున్నారు. పెనుమూరు మండలం కలవగుంట నుంచి ఇసుకను వెదురుకుప్పం మీదుగా తరలిస్తున్నారు. ఉడమలకుడితి, కత్తిరపల్లె వద్ద ఇసుక తరలించే ప్రాంతాల్లో రెవెన్యూ చిరుద్యోగి ఒకరు ఒక ట్రాక్టరుకు వంద నుంచి 150 రూపాయలు వసూలు చేస్తూ.. లక్షల రూపాయలను ఆర్జిస్తున్నట్లు వ్యాపారులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే వ్యవసాయ పనుల నిమిత్తం కొనుగోలు చేసిన ట్రాక్టర్లలో ఇసుక తరలించరాదనే నిబంధన ఉంది. అయితే ట్రాక్టర్లను నెంబరు ప్లేట్లు లేకుండా.. డ్రైవర్లకు లైసెన్సులు లేకుండా, సరైన రికార్డులు లేకుండా నిత్యం ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టరు సన్న జల్లు పడితే రూ.2500, పెద్ద జల్లులైతే రూ. 1900, జల్లుపట్టకుండా ట్రాక్టరు ఇసుకను రూ.1500కు విక్రయిస్తున్నారు. ఇసుక రవాణాను అరికట్టాల్సిన అధికారులు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇసుక అక్రమ వ్యాపారంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టడం లేదు. ఇసుక వ్యాపారంపై నిఘా పెట్టి.. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై వెదురుకుప్పం ఇన్‌ఛార్జి ఎస్ఐ వాసంతిని వివరణ కోరగా.. ఇసుక అక్రమ తరలింపుపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు రాజకీయ రంగు పులమడం న్యాయం కాదు


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

పుత్తూరు: ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా ఎమ్మెల్యే రోజా రాజకీయ రంగుపులమడం దారుణమని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ యుగంధర్, వైస్‌చైర్మన్ రత్నం భాస్కర్ ధ్వజమెత్తారు. గురువారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పంపిణీలో పక్షపాతం చూపిస్తున్నారని ఎమ్మెల్యే ఆరోపించడం అర్థరహితమన్నాం ు. వైసీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి మహీన్ కుమారుడికి కూడా పుత్తూరు మున్సిపాలిటీ తరపున సామాజిక వికలాంగ పింఛన్ అందజేస్తున్నామని తెలిపారు. అదే విధంగా అర్హులైన పేదవారందరికీ అందజేస్తున్నామని తెలిపారు. ఆనవాయితీ ప్రకారం పుత్తూరు పంచాయతీ నుంచి ద్రౌపదీ తిరుణాళ్ళకు రోడ్ల మరమ్మతులు, భక్తులకు తాగునీరు సరఫరా చేస్తుంటే ద్రౌపదీదేవి తిరుణాళ్ళకు మున్సిపాలిటీ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించడం ఆమె తెలివి తక్కువతనానికి నిదర్శనమన్నారు. అధికార పార్టీ వారు అక్రమాలకు పాల్పడి నిధులు స్వాహా చేస్తున్నారని ఆరోపించడం అర్థరహితమన్నారు. అన్ని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ఆమోదించిన తరువాత టెండర్ల ద్వారా పనులు చేస్తుంటే నామినేషన్లపై పనులు చేసుకుంటున్నారని ఆరోపించడం దారుణమన్నారు. ప్రతి రోజు ట్యాంకర్ల ద్వారా ఎక్కడ నీటి ఎద్దడి ఉంటే అక్కడ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమనాయుడు కృషితో కరువు సహాయ నిధి కింద సీఎం నిధుల నుంచి 32 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. మున్సిపాలిటీలో శ్మశానాలు ఆక్రమించుకుని ప్లాట్లు వేసుకుంటున్నది మీ పార్టీవారేనని ఆరోపించారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపుపై బహిరంగ చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. సమావేశంలో కౌన్సిలర్లు రాజశేఖరవర్మ, ఆనంద్, గోపి ఆచారి, గోవర్ధన్, ప్రసాద్‌నాయుడు,వెంకటేష్ పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమే : షీటీం ఎస్ఐ గిరిజ

పుత్తూరు: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే తమ భవిష్యత్ నాశనమవుతుందని పుత్తూరు షీటీం ఎస్: గిరిజ హితవు పలికారు. గురువారం పుత్తూరు శ్రీ రమణ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఒకసారి శిక్ష పడితే విద్యార్థులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోవలసి వస్తోందన్నారు. కావున విద్యార్థులు ర్యాగింగ్ భూతంలో పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణ, కరస్పాండెంట్ ఇందిర, అధ్యాపకులు పాల్గొన్నారు.

హంస వాహనంపై ఊరేగిన ద్రౌపదీ అమ్మవారు


హంస వాహనంపై ఊరేగుతున్న ద్రౌపది అమ్మవారు

పుత్తూరు: పట్టణంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల వార్షిక ఉత్సవాల్లో భాగంగా ద్రౌపదీ అమ్మవారు హంస వాహనంపై అత్యంత వైభవంగా ఊరేగారు. కార్యక్రమం 18వ వార్డు కౌన్సిలర్ ఆనంద్, ఆయన సోదరుడు ఆనంగిరవి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. సాయంత్రం పుష్పాలంకరణ, విద్యుత్ దీపాలంకరణలతో ద్రౌపదీ అమ్మవారు వైభవంగా పట్టణ పురవీధుల్లో హంస వాహనంపై ఊరేగారు. ఈ కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ యుగంధర్, మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏళుమలై, సభ్యులు శివలింగారెడ్డి, మోహన్, వాగ్దేవి పాల్గొన్నారు.

అన్నిదానాల్లో కన్నా విద్యాదానం మిన్న


విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేస్తున్న చైర్మన్ , ఎంపీపీ

పుత్తూరు: అన్నిదానాల్లో కన్నా విద్యాదానం మిన్న అని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ యుగంధర్, ఎంపీపీ గంజి మాధవయ్య తెలిపారు. గురువారం పుత్తూరు మున్సిపాలిటీగేటు పుత్తూరులోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు అభ్యసన సామగ్రి, పుస్తకాలు,యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేదవారేనని వీరిని ప్రోత్సహించడానికి దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం పుత్తూరు శ్రీకృష్ణ హోటల్ యాజమాన్యం బాబు, తులసిలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రత్నం భాస్కర్, కౌన్సిలర్లు వెంకటేష్, గోపి ఆచారి, ఆనంద్, మాజీ చైర్మన్ కరుణాకరన్, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గణేష్, కరుణ, ఎంఈవో తిరుమలరాజు,ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వరలక్ష్మీ వ్రతం

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, చైర్మెన్ పి.జగన్నాథరెడ్డి, బి.హరినాథరెడ్డి తెలిపారు. మహిళా భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె: టీఎంవీఎస్‌ఆర్‌ఎం ప్రభుత్వ ఐటీఐలో రెండోసారి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంరెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ పది పాసైన అభ్యర్థులు నేటినుంచి రూ.10 చెల్లించి స్థానిక ఐటీఐలో అప్లికేషన్ పొందవచ్చన్నారు. అప్లికేషన్ పూర్తి చేసిన వారు ఈనెల 15లోగా స్థానిక ఐటీఐ నందు సమర్పించాలన్నారు. ఈనెల 17న ఉదయం 10గంటలకు దరఖాస్తు చేసుకున్న తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఐటీఐలో జరగబోయే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే

కఠిన చర్యలు

వాల్మీకిపురం: అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ప్రమీల హెచ్చరించారు. బుధవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని రూ.25వేలు జరిమానా విధించారు. అనంతరం గురువారం ట్రాక్టర్ యజమానులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ఇసుకను అనుమతి లేకుండా బయట ప్రాంతాలకు తరలించడం నేరమన్నారు. అనుమతి ఉన్న రీచ్‌ల నుంచే ఇసుక ఎత్తాలని ఎక్కడపడితే అక్కడ ఇసుక ఎత్తడం కూడా నేరమన్నారు. ట్రాక్టర్ యజమానులు ప్రభుత్వం ఇసుక ఉచితం అనగానే ఇష్టమొచ్చినట్లు మదనపల్లెకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మండల పరిధిలో ఎత్తే ఇసుకను ఈ ప్రాంతంలో జరిగే అభివృద్ధి పనులకు మాత్రమే ఉపయోగించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, ఆర్ఐ ఫిరోజ్‌ఖాన్ లు పాల్గొన్నారు.

నూతన ఆలోచనలపై అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట: మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన డియాలో మిట్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యియల్ డెవలప్‌మెంటు సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డైనమిక్ ఐడియాస్ బై యంగ్ అక్సిడెంట్ అనే అంశంపై విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు నూతన ఆలోచన విధానాలను, సాంకేతిక సామాజికతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో మెకానికల్ విభాగానికి చెందిన వినీల్‌కుమార్ ప్రథమ బహుమతి రూ.7వేలు, ఈసీఈ విభాగానికి చెందిన విష్ణుప్రకాష్ ద్వితీయ బహుమతి రూ.5వేలు, సీఎస్ఈ విభాగానికి చెందిన తేజసాయి తృతీయ బహుమతి రూ.3వేలు చొప్పున బహుమతులు పొందారు. అలాగే శశికుమార్‌రెడ్డి, దాత్రిలు రూ.1000 చొప్పున గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యవరాజ్ బహుమతులను అందజేశారు.

జాతీయరహదారిపై ఆక్రమణల తొలగింపు

ములకలచెరువు: ముంబై-చెన్నై జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు నడుం బిగించారు. సీఐ రుషికేశవ, ఎస్ఐ ఈశ్వరయ్యలు గురువారం వేపూరికోటలోని ఆక్రమణలు, చెట్ల కొమ్మలు తొలగించారు. చెట్ల కొమ్మలు భారీగా పెరిగి రోడ్డుపైకి రావడంతో ముందు వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. అలాగే జాతీయ రహదారి పక్కన బండలు, రాళ్లు వేయడంతో వాహనాల రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈనేపథ్యంలో ఈప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో సీఐ, ఎస్ఐలు చొరవ తీసుకుని జేసీబీ సాయంతో రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. జాతీయ రహదారిలో రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలను కూడా తొలగించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఏదేమైనా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సీఐ, ఎస్ఐలు తీసుకుంటున్న చొరవను గ్రామస్థులు అభినందిస్తున్నారు.



వేపూరి కోటలో ఆక్రమణలు తొలగిస్తున్న పోలీసులు

రికార్డు లేని వాహనాలకు జరిమానా

కురబలకోట: రికార్డులు లేని వాహనాలకు ముదివేడు ఎస్ఐ వెంకటేశ్వర్లు జరిమానా విధించారు. గురువారం మండలంలోని సర్కారుతోపు వద్ద తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించని 50 వాహనాలకు రూ.7,500 జరిమానా విధించారు.

పంటల పరిరక్షణపై

రైతులు అవగాహన పెంచుకోవాలి

ఏడీఏ భాస్కర్‌రెడ్డి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ భాస్కర్‌రెడ్డి తదితరులు

నిమ్మనపల్లె: పంటల పరిరక్షణపై రైతులు అవగాహన పెంచుకుని అధిక దిగుబడులు సాధించాలని కృషి విజ్ఞాన సంస్థ శాస్త్రవేత్త గణేష్, ఏడీఏ భాస్కర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో వరి, వేరుశనగ, మునగ, టమోటా, మిరప పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశనగ కలుపుతీత సమయంలో ఎకరాకు 200కేజీల జిప్సం వాడాలన్నారు. పంటల పరిరక్షణపై రైతులు అవగాహనతో మెలిగి వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అదేవిధంగా జింకు, బోరాన్ లోపాలున్న భూమి రైతులకు వందశాతం సబ్సిడీతో సూక్ష్మపోషకాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం రైతులకు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఏవో నాగప్రసాద్, ఏఈవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశ గడువు పొడగింపు

బి.కొత్తకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రవేశానికి సంబంధించిన అభ్యర్థులు కళాశాలలో చేరేందుకు ఈనెల 16 వరకు పొడగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎంఈ రెడ్డిశివశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే

విజయాలు సొంతం

వ్యక్తిత్వ వికాస నిపుణుడు క్రియేటర్



విద్యార్థులకు సూచనలిస్తున్న క్రియేటర్

కురబలకోట: ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే విజయాలను సొంతం చేసుకోవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణులు క్రియేటర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంగళ్లు సమీపంలోని ఎస్వీటీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక విద్య వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడులకు తలొగ్గరాదన్నారు. విద్యార్థులు తమలో దాగి ఉన్న జ్ఞాపక శక్తిని పెంపొందించుకోవడంతో నైపుణ్యాలను ప్రదర్శించుకోవచ్చన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీడీ వెంకటరమణారెడ్డి, రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో చేతివాటం

తంబళ్లపల్లె: వృద్ధాప్య, వికలాంగ, వితంతువుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ల పంపిణీలో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో ఒక్కొక్క గ్రామంలో ఒక్కో విధంగా పింఛన్ పంపిణీలో రూ.10 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. ఇదేమని అడిగితే ట్యాబ్‌లు సరిగా పని చేయడం లేదని, నెట్‌వర్క్ సరిగా రావడం లేదని మరమ్మతుల కోసమని చెబుతున్నారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కార్యదర్శి పాండురంగయ్యను వివరణ కోరగా ట్యాబ్ మరమ్మతులకు గురైందని వాటి మరమ్మతుల కోసం రూ.20 స్థానిక సిబ్బంది వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే నేటికీ 900పింఛన్ల పంపిణీలో 490పూర్తయ్యాయని 210 రెండు రోజుల్లోగా పూర్తి చేస్తామని చెప్పారు.

రేపు బీసీ సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ బీసీ సంక్షేమ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు తెలిపారు. నూతన మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం 10గంటలకు నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం జరుగుతుందన్నారు. బీసీ సంక్షేమ సంఘ నాయకులందరూ హాజరు కావాలన్నారు. ఈసమావేశానికి జిల్లా బీసీ నాయకులు, హాజరవుతారన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన

మహిళ మృతి



మృతిచెందిన ఆదిలక్ష్మి

మదనపల్లె అర్బన్: మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ చిలుకవారిపల్లెకు చెందిన శంకరయ్య కుమారుడు సుధాకర్ కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. అయితే ఒక్కగానొక కుమారుడి మృతిని తట్టుకోలేక సుధాకర్ తల్లి ఎమ్.ఆదిలక్ష్మి(56)బుధవారం మనస్తాపంతో గుళిక మందుతిని ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఆదిలక్ష్మిని కుటుంబీకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా గురువారం తెల్లవారుజామున బాధితురాలి పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈక్రమంలో బుధవారం సుధాకర్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించగా, గురువారం ఆదిలక్ష్మి మృతదేహానికి అంత్యక్రియలు జరిగాయి. ఒక్క రోజు వ్యవధి లోనే ఒకే ఇంట్లో తల్లీ, కొడుకు మృతిచెందడంపై బాధిత కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. వీరిద్దరి మృతితో అటు సుధాకర్ భార్యాపిల్లలు, ఇటు శంకరయ్య అనాథలయ్యారు. ఈ వరుస ఘటనలతో చిలుకవారిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈమేరకు కేసునమోదు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు శూన్యం

నిమ్మనపల్లె: మండలంలోని సామకోటవారిపల్లె పంచాయతీలోని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టలేదని గురువారం వార్డు సభ్యుడు రమణ ఆరోపించారు. సర్పంచ్ లు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు డ్రైనేజి కాలువలు శుభ్రం చేయలేదన్నారు. ప్రతి పనికి పనులు చేయకనే బిల్లులు చేసుకుని పంచాయతీ కార్యదర్శితో కుమ్మక్కై గ్రామాలను పట్టించుకోలేదన్నారు. దీని వలన ఇళ్ల ముందర మురికినీరు నిల్వ ఉండి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని దీనిపై ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు.

నాలుగో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్షలు

బి.కొత్తకోట: పార్లమెంటు సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక జ్యోతిబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలేదీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ఎస్సీ రిజర్వేషన్ బిల్లును ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ భాను, అనీల్, కదిరప్ప, భవానీవెంకటేష్, చౌడప్ప, సుధాకర్, శ్రీనివాసులు, శంకర్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటి ప్రచారం

పెద్దమండ్యం: అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందాలని బీజేపీ కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి చల్లపల్లె నరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాపేపల్లెలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సమాజంలో నిరుపేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేసిందన్నారు. మండల బీజేపీ బూత్ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజన, జీవనజ్యోతి బీమా యోజన, ముద్రాయోజన, సుకన్య సమృద్ధియోజన, గరీబ్ కళ్యాణ యోజన తదితర 16 పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బీజేపీ కార్యకర్తలు పేదల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అవినీతి అలుముకుందన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ మైనార్టీ యువమోర్చా కార్యదర్శి పరీద్‌ఖాన్, బీజేపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర, నాయకులు రాజేష్, నిమ్మా నాగేశ్వర్‌రావు, రామచంద్ర, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి చల్లపల్లె నరసింహారెడ్డి

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కేవీబీపురం: జ్వరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సురేష్‌బాబు ప్రజలకు సూచించారు. గురువారం ఆయన కళత్తూరు గ్రామం,దళితవాడలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు సోకితే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షించుకోవాలన్నారు. అనంతరం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ప్రసాద్, రత్నకుమారి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.


రోగిని పరీక్షిస్తున్న వైద్యాధికారి

ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు

ఏర్పేడు: బిడ్డకు తల్లి ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు లీలావతి, గౌరి, రమాదేవి సూచించారు. గురువారం ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని చెల్లూరు, మునగలపాళెం, పాగాలి, కాట్రకాయలగుంట అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గర్భిణులు, బాలింతలతో మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు అమృతం వంటివని తెలిపారు. ముర్రుపాల వలన బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం తల్లిపాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

బుడతలకు బూచోడి భయం!


రాజీవ్‌నగర్ నుంచి పాఠశాలకు నడిచివస్తున్న చిన్నారులు

తొట్టంబేడు: మండలంలోని రాజీవ్‌నగర్ నుంచి రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు బూచోడి భయం పట్టుకుంది. రాజీవ్‌నగర్ నుంచి ప్రతి రోజూ 10 మంది విద్యార్థులు సుమారు 2 కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాలకు వస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆటోలో వచ్చే సదుపాయాన్ని కల్పించారు. అయితే ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులు పాఠశాలకు నడిచే వెళుతున్నట్లు వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల విద్యార్థులు పాఠశాల ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అటకాయించి భయభ్రాంతులకు గురిచేసినట్లు వారు చెబుతున్నారు.

దీంతో ఐదుగురు విద్యార్థులు భయంతో పాఠశాలకు రావడం మానేశారు. అధికారులు తక్షణం స్పందించి విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా ధర్మరాజస్వామి తిరునాళ్లు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో గురువారం తిరునాళ్ల ఘనంగా జరిగాయి.ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి అమ్మవార్లు కామదేనువు వాహనంలో గ్రామవీధుల్లో ఊరేగారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చేనేత సంఘం వారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం హరికథా కాలక్షేపం ఏర్పాటు చేశారు.


కామధేను వాహనంపై ద్రౌపదీదేవి

బెల్ట్‌షాప్ నిర్వాహకుడి అరెస్టు

తొట్టంబేడు: మండలంలోని బోనుపల్లె గ్రామంలో బెల్టు షాప్ నిర్వహిస్తున్న పట్టాభిరామయ్య అనే వ్యక్తిని గురువారం తొట్టంబేడు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు... విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పట్టాభిరామయ్య ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో 14 మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించి అతడ్ని అరెస్టు చేసి, రిమాండుకు పంపారు. ఈ దాడిలో హెడ్‌కానిస్టేబుల్ రవి, కానిస్టేబుళ్లు హరి, రత్నం, పెంచలయ్య పాల్గొన్నారు.

కూలీ అదృశ్యంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి గ్రామంలో కరుణాకర్ అనే కూలీ అదృశ్యమైనట్టు అతడి తల్లి చెంగమ్మ తహసీల్దార్ జయచంద్రకు గురువారం ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తన కుమారుడు కరుణాకర్‌ను ఈ నెల 1వ తేదీన నలుగురు వ్యక్తులు వచ్చి బలవంతగా తీసుకెళ్లారని తెలిపింది. మూడు రోజులు గడిచినా తన కుమారుడి ఆచూకీ తెలియ రాలేదని వాపోయింది. తమ బిడ్డ ఆచూకీ తెలపాలని వేడుకుంది. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దనుంజయ్య, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పెరిందేశం దళితవాడలో దారి సమస్య పరిష్కరిస్తాం

కేవీబీపురం: మండలంలోని పెరిందేశం దళితవాడలో దారి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దారు ప్రకాష్‌బాబు అన్నారు. దారి విషయమై కొంత కాలంగా రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. దీంతో ఒక వర్గానికి చెందినవారు మరో వర్గంవారి దారిలో నడవకూడదని, పశువులను తోలుకుపోవద్దని చెప్పడంతో వివాదం తలెత్తింది. దీనిపై తహసీల్దారు ప్రకాష్‌బాబు, ఎస్ఐ పరశురాముడు గురువారం ఇరువర్గాలతో చర్చించారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అప్పటి వరకు ఎలాంటి వాగ్వాదాలకు పాల్పడవద్దని సూచించారు. దీంతో ఇరువర్గాలవారు శాంతించారు.

చెత్త నుంచి సంపదపై కమ్యూనిటీ సిబ్బందికి శిక్షణ

తొట్టంబేడు: స్థానిక చెత్త నుంచి సంపద తయారు కేంద్రంలో వి.కోట, పాకాల పంచాయతీలకు చెందిన కమ్యూనిటీ ట్రైనర్స్ (చెత్త సేకరించే సిబ్బంది)కు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఇందులో గ్రామాల్లో తడి, పొడి చెత్తలను సేకరించే విధానం, చెత్త నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసే పద్ధతి, గ్రామాల్లో చెత్తను బహిరంగంగా పడేయకుండా ఉండటానికి ప్రజలకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై వారికి శిక్షణ ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అంకయ్య, డైట్ కో-ఆర్డినేటర్ రాధమ్మ, లింక్ ఆఫీసర్ సమత, తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలతో బీజేపీని పటిష్టం చేయాలి

● పార్టీ రాష్ట్ర పరిశీలకుడు రత్నం


సమావేశంలో పాల్గొన్న రత్నం తదితరులు

బుచ్చినాయుడుకండ్రిగ : గ్రామాలలో బూత్ కమిటీల ద్వారా పార్టీని పటిష్టం చేయాలని బీజేపీ రాష్ట్ర పరిశీలకుడు దాసరి రత్నం సూచించారు. బీఎన్ కండ్రిగలో గురువారం మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు హిమాచలం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను గ్రామాలలో ప్రచారం చేయాలన్నారు. వచ్చే ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయాలన్నారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మునిచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, జిల్లా కిసాన్ యువమోర్చ ప్రధాన కార్యదర్శి హరిబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి


బిల్లులు రాని వారి వివరాలు సేకరిస్తున్న అధికారులు

కేవీబీపురం: మండలంలో ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తవ్వుకున్న లబ్ధిదారులు తమ ఆధార్, బ్యాంకు ఖాతా నెంబర్లను బిల్లులకు తప్పకుండా అనుసంధానం చేయాలని ఏపీవో కృష్ణయ్య సూచించారు. ఇంకుడు గుంతలు తవ్వుకున్న వారికి బిల్లులు రాలేదన్న ఆరోపణలపై ఏపీవో గురువారం వేమలపూడి, ఆదవరం గ్రామాలోని లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో జరిగే అన్ని పనులకు ఆధార్, బ్యాంకు ఖాతా నెంబర్లు తప్పక అనుసంధానం చేయాలన్నారు. అలా చేయని వారు ఆధార్, బ్యాంకు ఖాతా నెంబర్లు కార్యాలయంలో అందజేస్తే బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకుడు జనార్ధన్ , లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి జిమ్నాస్టిక్స్ పోటీలు

శ్రీకాళహస్తి అర్బన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తేదీ నుంచి జిల్లా స్థాయి జిమ్నాస్టిక్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 98495 70064 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

'స్విమ్స్' వైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో పాల్గొన్న స్విమ్స్ వైద్య బృందం

వరదయ్యపాళెం: మండలంలోని కువ్వాకుల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల ఆవరణలో తిరుపతి స్విమ్స్ వైద్య బృందం జిల్లా సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) సహకారంతో గురువారం ఎన్టీఆర్ వైద్య సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ఈ శిబిరంలో 336 మందికి ఉచితంగా గుండె, షుగర్ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశామన్నారు. ప్రత్యేక వైద్య పరీక్షలు అవసరమైన ముగ్గుర్ని స్విమ్స్‌కు రెఫర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్‌కుమార్, వేణుగోపాల్, జయబాబు, హరికృష్ణ, అనిల్, రాహుల్, రవిశంకర్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ హర్షవర్ధన్, అమర్, స్విమ్స్ సిబ్బంది, పద్మావతి మహిళా వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగపు విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వరలక్ష్మి వ్రతం

మదనపల్లెటౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరి ఆలయంలో వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పతంజలిశాస్త్రి తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

రేపు శనిత్రయోదశి ప్రత్యేక పూజలు

మదనపల్లెటౌన్: యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 5శనివారం శనిత్రయోదశి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అలయ అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. ఉదయం 6 గంటలకు తైలాభిషేకం, సాయంత్రం తైలాభిషేకంతో కూడిన రుద్రాభిషేకం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పిల్లలకు ఎంఆర్ టీకాలు తప్పనిసరి


ఎంఆర్ టీకాలు వేయిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మదనపల్లెటౌన్: పిల్లలకు ఎంఆర్ టీకాలు తప్పని సరిగా వేయించాలని లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ గంగారపు గౌతంరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆరోగ్యమాత ప్రైవేటుస్కూల్‌లో పిల్లలకు ఎంఆర్ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారపు గౌతంరెడ్డి మాట్లాడుతూ తట్టు మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం ముందుకొచ్చి టీకాలను వేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భవానీ ప్రసాద్, కామకోటి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రాకాలనీలో...

పట్టణ శివారులోని చంద్రాకాలనీలోని గురుకుల పాఠశాలకు చెందిన 480మంది విద్యార్థినులకు గురువారం మీజిల్స్ రుబెల్లా(ఎంఆర్) టీకా వేయించినట్లు ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు.ఆ ప్రాంత ఏఎన్‌ఎమ్, హెల్త్‌సూపర్‌వైజర్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లలకు ఎంఆర్ టీకాలు వేశారు. ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలో ఎనిమిదిమందికి తీవ్రగాయాలు



గాయపడిన బాధితులు

మదనపల్లె అర్బన్: భూతగాదాల కారణంగా జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కురబలకోట మండలం మట్లి వారిపల్లె పంచాయతీ జబ్బావారిపల్లెకు చెందిన నరసింహులు, పక్కగ్రామం గొడ్డిండ్లవారిపల్లెకు చెందిన గంగులప్పల పొలాలు పక్కపక్కనే ఆనుకుని ఉండటంతో కొంతకాలంగా వీరి మధ్య భూవివాద గొడవలు జరుగుతున్నాయి. కాగా ఇటీవల నరసింహులు తమ్ముడు సురేంద్ర పొలంలో మొక్కజొన్న కర్రలు సాగు చేశాడు. కాగా ఆ పొలంలో తమకూ భాగం ఉందంటూ గురువారం గంగులప్ప కుమారుడు శేఖర్ ట్రాక్టర్‌తో మొక్కజొన్న కర్రలను దున్నేశాడు. దీంతో ఇరువర్గాల వారు మాటా మాటా పెంచుకుంటూ ఘర్షణపడ్డారు. ఈ దాడిలో నరసింహులు(44), అతని తమ్ముడు సురేంద్ర(37), గంగులప్ప(70), అతని కుటుంబీకులు శేఖర్(45), ఆనంద్(20), చిన్నప్ప(55), రమణమ్మ(40), అమరనాథ్(30)లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కుటుంబీకులు చికిత్స నిమిత్తం 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు గ్రామంలో విచారణ చేస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష


పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మదనపల్లెటౌన్: చంటి పిల్లలకు తల్లిపాలే శ్రీరామ రక్షఅని సీడీపీవో యల్లమ్మ పేర్కొనోన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో బాగంగా గురువారం పట్టణంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏవీ నాయుడు కాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో యల్లమ్మ మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డలకు శ్రేయష్కరమన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించడం ద్వారా రోగ నిరోదక శక్తి పెరుగడంతో అనేక జబ్బుల నుంచి తట్టుకునే శక్తిని సమకూరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు మణిమాల, రాధ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

మదనపల్లె

ఏఎస్‌ఆర్	గౌతమ్‌నంద
ఎంఎస్‌ఆర్	నాకు నేనే
సిద్ధార్థ	శమంతకమణి
మినీసిద్ధార్థ	డాక్టర్ చక్రవర్తి
శ్రీకృష్ణ	నిన్ను కోరి
సాయిచిత్ర	గౌతమ్‌నంద
రవి	డీజే దువ్వాడ జగన్నాథమ్
సునిల్	ఫిదా

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ధర్నా


మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లెటౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఉపాధ్యాయులు మున్సిపల్ కార్యాలయం ముందు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఉపాధ్యాయుల సంఘ నేత ఆశోక్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్‌రూల్స్ రూపొందించిన అనంతరం అందులోని కొన్ని అంశాల్లో సవరణలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో అన్ని తరగుతుల్లో తెలుగు మాద్యమాన్ని కొనసాగించాలని, వ్యాయమ, ఉపాధ్యాయ పోస్టులను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉర్దూ పాఠశాలలో అవసరాల మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని, అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులను ఏకీకృత సర్వీసు రూల్స్ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ ఇంఛార్జి కమిషనర్ మహేష్‌ను కలసి వినతిపత్రం అందజేశారు.

పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలే కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి

మదనపల్లెటౌన్: పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలే కీలకమని మాజీ ఎమెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నరేష్‌కుమార్‌రెడ్డి నివాసంలో గురువారం టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి వందమంది కార్యకర్తలకు ఒక నాయకుడిని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి మూడురోజుల్లో బూత్ కమిటీల ఎన్నిక ప్రక్రియను చేపడుతున్నట్లు చెప్పారు. మున్సిపల్ చైర్మన్ కొడవలి శివప్రసాద్ మాట్లాడుతూ హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి పక్కా గృహాలను ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మొదటి విడతలో ఇంటి స్థలాలు కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తూ మదనపల్లె పట్టణానికి 1029 గృహాలు మంజూరు కాగా అందులో 60శాతం అర్హులకు ఇళ్లు కేటాయించినట్లు చెప్పారు. గతంలో ఇళ్లు మంజూరై పునాదుల పూర్తి చేసి బిల్లులు తీసుకున్న లబ్దిదారులు వారికి కేటాయించిన స్లిప్పులను ఆరు రోజుల్లోపు మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. అటువంటి వారికి ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదేళ్ల విద్యాసాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాటకొండ గుర్రప్పనాయుడు, ప్రభుత్వాసుపత్రి కమిటీ చైర్మన్ పోతుల విజయ్‌కుమార్, కౌన్సిలర్లు బండి నాగరాజు, రామిశెట్టి ఆంజనేయులు, నీలకంఠ, బాబునాయుడు లక్ష్మిదేవి, భావన, రాధా, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

జేసీ ఆదేశాలు అమలు చేయాలి

మదనపల్లె: ప్రభుత్వం తమకు మంజూరు చేసిన ఇంటి స్థలాల విషయంలో అప్పటి జేసీ పి.ఎస్.ప్రద్యుమ్న ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని బాధితులు డి.వెంకటరమణ, డి.నజీర్‌అహ్మద్, ఎస్.రుద్రయ్యలు గురువారం తహసీల్దార్ నాగార్జునరెడ్డిని కోరారు. మదనపల్లె మండలం బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వేనంబర్:1037-2లో 1991లో అప్పటి రెవెన్యూ అధికారులు తమకు ఇంటి పట్టాలు మంజూరు చేశారని వారు పేర్కొన్నారు. అప్పటి నుంచి గుడిసెలు వేసుకుని నివశిస్తున్న తాము ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతుంటే..కొందరు పెద్దలు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అప్పటి ఆర్డీవో, జేసీల దృష్టికి తీసుకెళ్లగా, విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారని, వాటిని అమలు చేయడంలో ఇక్కడి అధికారులు ఏళ్ల తరబడి తమను కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిప్పుకుంటున్నారని వాపోయారు. మదనపల్లె పట్టణం, మండలంలోని ఇసుకనూతిపల్లెకు చెందిన రుద్రయ్య, నజీర్‌అహ్మద్, డి.వెంకటరమణలతోపాటు మరికొంత మందికి ఇంటిస్థలాలు మంజూరు చేశారు. అందులో కొందరి స్థలాలను పట్టణంలోని కొందరు భూస్వాములు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని, తమపై కూడా దౌర్జన్యం చేస్తూ ఆ స్థలాలను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. జేసీ తమకు అనుకూలంగా ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా రెవన్యూ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఇద్దరు మహిళల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్: వేర్వేరు కారణాలతో ఇద్దరు మహిళలు ఆత్మహత్యకు యత్నించారు. పీటీఎం మండలం బురుజుపల్లె గ్రామానికి చెందిన రామాంజులు, భార్య లక్ష్మిదేవి(30) బుధవారం రాత్రి కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మిదేవి గుళిక మందుతిని ఆత్మహత్యకు యత్నించింది. తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లె పంచాయతీ యర్రగుండ్లపల్లెకు చెందిన శ్రీనివాసులు భార్య నిర్మల(27)కూలిపనులు చేస్తుండేది. కాగా గురువారం తీవ్రమైన కడుపునొప్పి భరించలేక మనస్తాపం చెంది పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. వీరిని కుటుంబీకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.

న్యాయం చేయకపోతే ఆమరణదీక్ష

మదనపల్లెటౌన్: అర్హులైన వికలాంగులకు పక్కాగృహాలు మంజూరు చేయకపోతే ఆమరణదీక్ష చేస్తామని ఏపీ నిరుద్యోగ ప్రత్యేక ప్రతిభావంతుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయ డీటీ షంషీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మండలంలో అర్హులైన 132 మంది వికలాంగులకు న్యాయం చేయాలని గత నెలలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు దీక్షలు చేపట్టామన్నారు. అయినా అధికారులు నుంచి ఎటువంటి స్పందన లేకపోయిందన్నారు. ఈ క్రమంలో కొంత మంది వికలాంగులకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కావడంతో దీక్షను రద్దుచేసుకున్నట్లు చెప్పారు. 7వ తేది సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా, అనంతరం ఆమరణనిరహారదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలీ ముర్తుజ, దొరబాబు, సుబ్రహ్మణ్యం, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతం


వ్రతంలో పాల్గొన్న టీచర్లు, చిన్నారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీలో గల శ్రీచైతన్య పాఠశాలలో గురువారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి ఉత్సవమూర్తికి విశేష పూజలు చేశారు. పలువురు ముత్తైదువులు, ఉపాధ్యాయినులు పూజల్లో పాల్గొన్నారు. వరలక్ష్మి వ్రతం ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపాదేవి, ప్రశాంతి, జానకి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించండి

● తెట్టు సమీప ప్రజల నిరసన


నిరసన తెలియజేస్తున్న మహిళలు, నేతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెట్టు వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఎన్X హెచ్X వాడ, ఎస్ఎస్‌వాడ, తెట్టు ప్రాంతాలవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం తెట్టు కూడలిలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెట్టు కూడలిలో నివాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడానికి ఎక్సైజ్‌శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేయడం బాధాకరమన్నారు. వీటి ఏర్పాటుపై గతంలో తాము నిరసనలు చేపట్టగా అనుమతులు రద్దు చేస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పుడు మళ్లీ ఇక్కడ ఒక మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, మరో దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేయడం బాధాకరమన్నారు. మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తుంటే పోలీసులను పంపి భయభ్రాంతులను చేస్తున్నారని ఆరోపించారు. దుకాణం తొలగించే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ఆందోళనకారులకు వైసీపీ ఫ్లోర్‌లీడర్ హరి, శివశంకర్, మేరీ, పద్మ, కృష్ణమ్మ, కమలమ్మ, వనజమ్మ, రాధ, పాపమ్మ మద్దతు తెలిపారు.

పురపాలక ఉపాధ్యాయులపై వివక్ష తగదు

● ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా


ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: పురపాలక బడుల్లో పనిచేసే ఉపాధ్యాయులపై వివక్ష తగదని ఫ్యాప్టో నాయకులు పేర్కొన్నారు. ఆ మేరకు రాష్ట్ర శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయం వద్ద గురువారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నేతలు మాట్లాడుతూ పురపాలక బడుల్లో కార్పొరేట్ తరహా విద్య పేరుతో ప్రయోగాలు చేస్తుండటంతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించాల్సి ఉండగా... ఫౌండేషన్X పేరుతో కొద్ది మందికి మాత్రమే ప్రత్యేక బోధన చేస్తున్నారని వాపోయారు. పురపాలక బడుల్లో బలవంతంగా ఆంగ్ల మాధ్యమం రుద్దడం మంచిది కాదన్నారు. తెలుగు మాధ్యమానికి సమాంతరంగా ఆంగ్ల మాధ్యమం నిర్వహించాలే తప్పా...తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయించడం మంచిది కాదన్నారు. విద్యాశాఖతో సంబంధం లేకుండానే పురపాలక మంత్రి నారాయణ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. పాఠశాలలు పునఃప్రారంభించి 50 రోజులు దాటినా ఇప్పటికీ తెలుగు మాధ్యమం పాఠ్యపుస్తకాలు అందించకపోవడం బాధకరమన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ ఉత్తర్వుల్లో ఉన్న అసంబద్ధాలను సవరించాలని, పురపాలక పాఠశాలల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్న తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులను ఏకీకృత సర్వీసు రూల్స్ పరిధిలోకి తేవాలని, ఆన్X లైన్X లో అంతర్గత బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుణశేఖర్ రెడ్డి, ఎస్టీయూ నేత యువశ్రీ మురళి, ఏపీటీఎఫ్ నాయకులు సుధాకర్, జయరాం, ఫ్యాప్టో నేతలు శ్రీహరి, మధు, మురళి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లకోసం వృద్ధుల పడిగాపులు


పురపాలకసంఘ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు

శ్రీకాళహస్తి : స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద గురువారం పింఛన్ల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చిందని వృద్ధులు వాపోతున్నారు. వారు పింఛన్ల కోసం కార్యాలయానికి ఉదయమే వచ్చారు. అయితే 11 గంటలు దాటినా అక్కడి సిబ్బంది మాత్రం రాలేదు. దీంతో లబ్ధిదారులు కొందరు నీరసించిపోయి అక్కడే పడుకున్నారు. మరికొందరు ఆకలితో అలమటిస్తూనే సిబ్బంది కోసం నిరీక్షించారు. మధ్యాహ్నం వరకు సిబ్బంది అక్కడకు చేరుకోకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎండలు మండుతున్న ఈ సమయంలో వృద్ధులను గంటల తరబడి నిరీక్షింపజేయడం ఎంత వరకు సబబని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణం స్పందించి సకాలంలో పింఛను పంపిణీ చేసేందుకు చర్యలు తీసు కోవాలని వారు కోరుతున్నారు.

'రూబెల్లా'తో చిన్నారులకు పరిపూర్ణ ఆరోగ్యం


మంగళపురిలో చిన్నారులతో వైద్య సిబ్బంది

శ్రీకాళహస్తి రూరల్: మీజిల్-రూబెల్లా వ్యాక్సిన్X చిన్నారుల ఆరోగ్యానికి శ్రేష్ఠమని ఎంపీహెచ్X ఈవో నాగభూషణం పేర్కొన్నారు. మండలంలోని మంగళపురి ప్రభుత్వ పాఠశాల చిన్నారులకు ఆయన గురువారం మీజిల్-రూబెల్లా వ్యాక్సిన్X వేయించారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన చిన్నారుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్X ఎం జ్యోతిలక్ష్మి,సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి అర్బన్:పట్టణంలోని ఏవీఆర్ పాఠశాల విద్యార్థులకు మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్X పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డీజీఎం సుబ్రహ్మణ్యంరెడ్డి వ్యాక్సిన్X ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్, మహేష్, వైద్య సిబ్బంది నాగరాజు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాలో 17 మంది ఎంపిక

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో 17మంది ఎంపికైనట్లు జేకేసీ సమన్వయకర్త రేవతి తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంకు, టీవీఎస్, టీసీఎస్‌లో ఉద్యోగాల కోసం ఈ మేళా నిర్వహించామన్నారు. మేళాకు 60 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాములు, అరవింద్, కుమారి, అరీఫా, ఐసీఐసీఐ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ ధర్మన్X , తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల ప్రారంభం

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరులో ఉన్న అన్నపూర్ణాదేవి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను గురువారం ధ్వజారోహణతో ఘనంగా ప్రారంభించారు. అంతకు ముందు ముక్కంటి ఆలయం నుంచి పాలక మండలి చైర్మన్X గురవయ్యనాయుడు,ఈవో భ్రమరాంబ మంగళవాయిద్యాలతో స్వామి, అమ్మవార్లకు సారె తీసుకొచ్చారు. అనంతరం కొడి ఉత్సవంతో పది రోజులపాటు జరగనున్న పవిత్రోత్సవాలను ప్రారంభించారు. పండితులు జనార్ధన్X శర్మ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరనాధరెడ్డి,ఏపీసీడ్స్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విశేషాలంకారంలో స్వామి, అమ్మవారు -
సారె తెస్తున్న గురవయ్యనాయుడు, భ్రమరాంబ తదితరులు

హోమియో మందులతో డెంగీ నిర్మూలన


హోమియో మందు వేస్తున్న వైద్య సిబ్బంది

శ్రీకాళహస్తి అర్బన్: హోమియో మందులతో ప్రాణాంతకమైన డెంగీ, చికెన్X గున్యా జ్వరాలను నిర్మూలించవచ్చని శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రి హోమియో వైద్యాధికారి బాబు పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలోని ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హోమియో వైద్యులు బాబు మాట్లాడుతూ హిపటోరియం పర్ఫ్ అనే హోమియో గుళికలతో డెంగీ వంటి వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోమియో ఫార్మసిస్టు తారకనాధ్, ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఉచిత బజార్

శ్రీకాళహస్తి: పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత బజార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు, నిరుపేదలకు ఊయలలు, వాకర్లు, క్యారంబోర్డులు, వాటర్ బాటిళ్లు తదితర వస్తువులు, దుస్తులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మాట్లాడుతూ పేదలకు సేవ చేయాలనే ఆశయంతో ఈ ఉచిత బజార్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు మునీర్‌బాషా, సభ్యులు జి.రమేష్, కె.ఉదయ్, చిల్డ్రన్X్స ఫ్యాన్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఉచిత బజారు నిర్వహిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

సినిమా గైడ్

శ్రీకాళహస్తి

సాయిరాం	:	ఫిదా
బలరాం	:	గౌతమ్‌నందా
శ్రీనివాస	:	నిన్ను కోరి
విజయలక్ష్మి	:	.వాసుకి
ఆర్.ఆర్	:	బాహుబలి-2
రామచంద్ర	:	దువ్వాడ జగన్నాధం

టమోటా పంట బీమాకు దరఖాస్తుల ఆహ్వానం

కలకడ: మండలంలో టమోటా సాగు చేసిన రైతులు పంట బీమాకు ఈనెల 9 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన అధికారి నవీన్‌కుమార్ కోరారు. హెక్టారుకు రూ.50 వేల పంట బీమాకు రైతు రూ.2.500 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకుని ఉన్నందున రైతులు సూక్ష్మ సేద్య పద్ధతుల్లో పంటలకు నీటి తడులు ఇవ్వాలన్నారు. అలాగే ప్రతి రైతు తప్పనిసరిగా పారంపాండ్ నిర్మించుకోవాలన్నారు. వేరుశనగ పంటకు కూడా స్ప్రింక్లర్లు, మైక్రో స్ప్రింక్లర్లు రాయితీతో పొందవచ్చని ఆయన సూచించారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడండి


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పీలేరు: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్తదానం చేసి ఆదుకోవాలని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, రక్తహీనత, ఇతరత్రా ఆపరేషన్లకు సంబంధించి ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని, ఇలాంటి వారిని ఆదుకోవడానికి యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. విద్యార్థులు 41యూనిట్లు రక్తాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యసిబ్బంది మల్లికార్జున, మునాఫ్, అధ్యాపకులు కిషోర్‌కుమార్‌రెడ్డి, అల్లాహుద్దీన్ సాహెబ్, ఆదిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నిరుద్యోగభృతి ఇవ్వాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కుమార్‌రెడ్డి

భాకరాపేట: అర్హులైన వారందరికీ నిరుద్యోగభృతి ఇవ్వాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి జయచంద్ర అన్నారు. గురువారం చిన్నగొట్టిగల్లులో నిరుద్యోగ యువతీ యువకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టీటీడీలో ఖాళీగా వున్న ఉద్యోగాలను, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలన్నారు. జిల్లాలో నెలకొల్పే పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం రాష్ట్రకార్యదర్శి యాదగిరి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కేవీపీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సహదేవయ్య, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని క్వారీల అనుమతి రద్దుచేయాలి

కేవీపల్లె: మండలంలోని తీతవగుంటపల్లెలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్వారీల అనుమతి రద్దు చేయాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సామర్థ్యం కలిగిన జెలిటిన్‌స్టిక్స్ నల్లమందు, తూటాలు పేల్చుతున్నారని, దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లు బీటలువారుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో యుగంధర్, రెడ్డిప్రసాద్, రెడ్డికుమార్, మనోజ్, ఎర్రమ్మ, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్లభాషా మేళా

పీలేరు: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో ఆంగ్లభాషా మేళాను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ గాయత్రి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషపై పట్టు కలిగి ఉన్నప్పుడే రాణించగలరని, ఈ క్రమంలో చిరుప్రాయం నుంచే విద్యార్థుల్లో ఆంగ్లభాషపై అవగాహన కల్పించేందుకు తమ పాఠశాలలో ఇంగ్లీషు క్లబ్ ఏర్పాటు చేశామన్నారు. ఉన్నత స్థాయి చదువులకు చిన్నారులు చేరువ కావాలనే ఆశయంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో మండల సమగ్రాభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధ్యక్షుడు శివకుమార్

భాకరాపేట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితో మండల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్, జడ్పీటీసీ శోభామోహన్‌రెడ్డి అన్నారు. ప్రగతికి పదిసూత్రాల అమలులో చిన్నగొట్టిగల్లు మండలానికి ద్వితీయస్థానం లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. చిన్నగొట్టిగల్లులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నీరు-ప్రగతి, పంటసంజీవిని, స్వచ్ఛ పంచాయతీ, ఓడీఎఫ్, సిమెంటు రోడ్ల నిర్మాణాల్లో అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా పూర్తిచేయడం వల్ల మండలానికి జిల్లా స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించి పేదల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటసుబ్బయ్య, బావాజాన్, ఆర్వీ రమణారెడ్డి, బెల్లంకొండ రమణ, శ్రీనివాసులు, బాలకృష్ణ, హరినాథరెడ్డి, చంద్రశేఖర్, రాజగోపాల్ నాయుడు, మల్లికార్జునరెడ్డి, నరసింహారెడ్డి, మదన్మోహన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సాయంతో క్రీడా మైదానం అభివృద్ధి


క్రీడా మైదానాన్ని చదును చేయిస్తున్న సీఐ తదితరులు

పీలేరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పేరుకుపోయిన దిబ్బలు, ముళ్ల పొదలను గురువారం పోలీసుల ఆధ్వర్యంలో తొలగించారు. పోలీసుశాఖ విద్యాలయాలను దత్తత తీసుకుంటున్న నేపథ్యంలో పీలేరు పోలీసులు కళాశాల క్రీడా మైదాన అభివృద్ధికి ఉపక్రమించారు. క్రీడా మైదానంలో ప్రహరీ చుట్టూ ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోవడం, పరిసరాల్లో నివసిస్తున్న ఇళ్ల వారు చెత్త వేస్తుండడంతో దిబ్బలు పేరుకుపోయి క్రీడల నిర్వహణకు అసౌకర్యంగా ఉంది. అంతేకాకుండా విద్యార్థులకు వ్యాయామ తరగతులు, క్రీడాంశాల నిర్వహణకు ఇబ్బందికరంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో క్రీడా మైదానంలోని సమస్యలను గుర్తించిన పోలీసు సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పీలేరు అర్బన్ సీఐ నాగరాజ, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి స్పందించి ముళ్లపొదలు, దిబ్బలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్లు, డ్రోజర్లు, ట్రాక్టర్ల సహాయంతో ప్రహరీ చుట్టూ ఉన్న దిబ్బలను, ముళ్లపొదలను తొలగించారు. అలాగే పోలీసు సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థుల సహాయంతో క్రీడా మైదానంలో ఉన్న రాళ్లు ఏరివేసి మైదానాన్ని చదును చేశారు. ప్రహరీ చుట్టూ ఇళ్లల్లోని చెత్త వేసే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ అన్నారు. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసురేష్, యువనాయకుడు కంభం భాస్కర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై ప్రణాళికల తయారీ


సమావేశంలో కలికిరి, కేవీపల్లె ఎంపీడీవోలు ఇందిర, రామచంద్ర తదితరులు

కలికిరి: ఉద్యానవన పంటల సాగుపై కలికిరి, కలకడ, కేవీపల్లె మండలాల అధికారులు గురువారం కలికిరి మండల పరిషత్ కార్యాలయంలో ప్రణాళికలు తయారు చేశారు. కలెక్టర్ ప్రద్యుమ్న బుధవారం కలకడ మండల పరిషత్ కార్యాలయంలో ఆయా మండలాల అధికారుల సమీక్షా సమావేశం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వేరుశనగ దిగుబడి ఆశాజనకంగా లేదని, రైతులు టమోటా, మామిడి, బొప్పాయి తదితర ఉద్యానవన పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాలని ఇందుకోసం మండలాలవారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలని వారిని ఆదేశించారు. వేరుశనగ సాగు చేసి రైతులు నష్టపోకుండా ఉండేందుకు ఉద్యానవన పంటలపట్ల మొగ్గు చూపేలా ప్రోత్సహించాలన్నారు. ఈ నేపథ్యంలో మూడు మండలాల అధికారులు ఎన్ని హెక్టార్లలో ఉద్యానవన పంటలు అదనంగా సాగు చేసుకునే ఆస్కారం ఉందో జాబితాలు రూపొందించి కలెక్టర్‌కు నివేదించనున్నారు. సమావేశంలో ఎంపీడీవోలు ఇందిర, రామచంద్ర, ఈవోపీఆర్‌ఆర్‌డీ నారాయణ, ఉద్యానవన అధికారి నవీన్‌కుమార్, ఏవోలు హేమలత, నీలవేణి, శ్రావణి, ఏపీవోలు సౌభాగ్యవతి, రెడ్డిజవహర్, ఐడబ్ల్యూ ఎంపీపీవో శ్రీనివాసులురెడ్డి, ఇసి రఘునాథ్, ఎంఐఏవోలు ప్రదీప్, భవ్యశ్రీ, ఈజీఎస్ సూపర్‌వైజర్ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల స్వయం పోషక స్వేచ్ఛ చట్టం రద్దు చేయాలి


రాస్తారోకో నిర్వహిస్తున్న నరేష్‌కుమార్ తదితరులు

కలికిరి: విద్యాసంస్థల స్వయం పోషక స్వేచ్ఛ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి నరేష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం వైఎస్ఆర్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఇందిరమ్మ కాలనీ వద్ద రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఒలంపి యాడ్, టెక్నో, ఈటెక్నో తదితర పేర్లతో కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడీ చేస్తున్నాయన్నారు. స్వయం పోషక స్వేచ్ఛ చట్టంతో దోపిడీ మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం రద్దుకు కలెక్టరేట్ ఎదుట కూడా ఆందోళన చేపడతామన్నారు. వైఎస్ఆర్ విద్యార్థి విభాగం నాయకులు రాజశేఖర్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో మాట్లాడొద్దన్నందుకు వివాహిత ఆత్మహత్యాయత్నం

పీలేరు: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చెంగల్రాయులు కుమార్తె ఉషారాణి(20) గురువారం మధ్యాహ్నం శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు... ఉషారాణికి ఏడు నెలల క్రితం పుంగనూరుకు చెందిన గంగాధరంతో వివాహమైంది. అయితే ఇటీవల కొంతకాలంగా పీలేరులోని పుట్టింటిలో ఉంటోంది. ఆమె మూర్ఛవ్యాధితో చికిత్స పొందుతోందని, ఫోన్‌లో ఎక్కువ మాట్లాడరాదని వైద్యులు చెప్పడం జరిగిందన్నారు. అయితే గురువారం మధ్యాహ్నం ఉషారాణి ఫోన్‌లో మాట్లాడుతుండగా గమనించిన తండ్రి మందలించడంతో క్షణికావేశానికి లోలైన ఆమె శరీరంపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను పీలేరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌హెచ్‌వో ఉమామహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2017-18 సంవత్సరానికి మొదటి దఫాలో మిగిలిన ఖాళీల ప్రవేశానికి పదోతరగతి పాసైన అభ్యర్థులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే పదోతరగతి ఫెయిల్ అయిన అభ్యర్థులు వెల్డర్, ట్రేడ్‌లకు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నంద్యాలలో టీడీపీ విజయం తథ్యం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పీలేరు: నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కోటపల్లె బాబురెడ్డి, మండల అధ్యక్షుడు కేశవర్ధన్ అన్నారు. గురువారం పీలేరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో అక్కడ టీడీపీ అభ్యర్థి అత్యధిక మెజారిటీతో గెలుపొందుతారని చెప్పారు. ప్రభుత్వం ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని వైసీపీ నాయకులు ఆరోపించడం సరికాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, అమరనాథరెడ్డి, రవినాయుడు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హత్యకు గురైన వ్యక్తి ఆచూకీ కోసం ముమ్మర ప్రయత్నాలు

కలకడ: మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లెకు సమీపం హంద్రీ-నీవా కాలువ గట్టుపై ఈ నెల 1వ తేదీ రాత్రి హత్యకు గురైన వ్యక్తి ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మృతుని జేబులో దొరికిన బస్సు టికెట్లు, విజిటింగ్ కార్డుల ఆధారంగా కడపజిల్లా వాసి అయి ఉంటాడనే నిర్ధారణకు వచ్చారు. దీంతో గురువారం వాల్మీకిపురం సీఐ శ్రీధర్‌నాయుడు, కలకడ ఎస్ఐ చాన్‌బాషా, సిబ్బందితో కలిసి కడపజిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లినట్లు తెలిసింది.

సినిమా గైడ్

షుకూర్	ఫిదా
ఎస్వీ మహల్	నిన్నుకోరి
ఎస్వీ డీలక్స్	పెళ్లికిముందు ప్రేమకథ
అజంతా	గౌతమ్‌నంద

ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా కోమలేశ్వరి



నాగలాపురం: నాగలాపురం మండల పరిషత్ కార్యాలయ సూపరిండెంట్‌గా కోమలేశ్వరి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత కొద్ది రోజులుగా ఖాళీగా ఉన్న ఈ పదవిలో నెల్లూరు రీజనల్ విజులెన్స్ మరియు ఎన్ ఫోర్స్‌మెంట్ కార్యాలయం నుంచి కోమలేశ్వరి నాగలాపురం సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయుటకు కృషిచేస్తానని ఆమె తెలిపారు.

బంగారు నగలు స్వాధీనం : ఇద్దరి అరెస్టు



నగరి పోలీస్ స్టేషన్ లో ముద్దాయి అరెస్టు చూపుతున్న ఎస్ఐ, సిబ్బంది

నగరి: నగరి మండలంలోని బుగ్గ అగ్రహారంలో గత నెల 28 రాత్రి జరిగిన దొంగతనం కేసులో బంగారు నగలు స్వాధీనం చేసుకున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామానికి చెందిన చెల్లమ్మ అనే మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తులు యాభై గ్రాముల బంగారు చైను తాళిబొట్టుతో సహా లాక్కెల్లారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన ఎం.గోవింద రెడ్డి(50), దేశూరు అగరం గ్రామానికి చెందిన సుధాకర్(38)లను అరెస్టు చేసి వీరి నుంచి ఒక లక్షా యాభై వేలు విలువ చేసే యాభై గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

రేపు శని త్రయోదశి పూజలు

నాగలాపురం: మండల పరిధిలోని సురుటుపల్లి గ్రామంలో వెలసిన శ్రీపళ్లికొండేశ్వరుని ఆలయంలో రేపు (శనివారం) శని త్రయోదశి పూజలను వైభవంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఆలయాధికారి ఏర్పాట్ల పనిని పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా ఒకటి లేక రెండుసార్లు వచ్చే శని త్రయోదశి పూజలకు భక్తులు వేల సంఖ్యలో తరలి వస్తారు. భక్తుల సౌకర్యార్థం దృశ్య తాగు నీటి వసతి, క్యూలైన్లు, చలువ పందిళ్లు, వైద్య శిబిరాలు వంటివి ఏర్పాటు చేశారు. వివిధ రకాల ప్రసాదాలు, సుమారు 1000 మందికి ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ కొరకు నాగలాపురం పోలీస్‌స్టేషన్ నుంచి 10 మంది పోలీసుల బందాన్ని మరియు క్యూలైన్ల వద్ద తోపులాటలు లేకుండా ఉండుటకు సత్యవేడు దాస్ ఆర్ట్ కళశాల నుంచి 30 మంది వాలంటీర్లను కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా తమిళనాడు ఊత్తుకోట డిపో నుంచి సురుటుపల్లి, చెన్నైకి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

'సగం ధర' కుచ్చు టోపీపై బాధితుల ధర్నా



గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

సత్యవేడు: సాయిరాం ట్రేడర్స్ యజమానులపై కేసు నమోదు చేసి భాదితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ విగ్రహం వద్ద సిపీఐ డివిజన్ కార్యదర్శి చిన్నరాజ్ ఆద్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సగంధరకే గృహోపకరణాలు అందిస్తామంటూ సామాన్యుల నుంచి అధికమొత్తంలో నగదు వసూలు చేసుకుని ఉడాయించిన తమిళనాడు వాసి రాజన్‌పై వెంటనే కేసు నమోదు చేసి బాధితులకు న్యాయంచేయాలన్నారు. ప్రజల బలహీనతను ఉపయోగించుకుని సాయిరాం ట్రేడర్స్ యజమాని లక్షల రూపాయలు దండుకోవాలనే దురుద్దేశంతోనే ఇక్కడ ఇలాంటి దుకాణం ప్రారంభించారన్నారు. గతంలో సిరి గోల్డ్ ఇలాంటి మోసాలకు పాల్పడిందని తాము స్పందించటంతోనే బాదితులకు న్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దర్నాపై స్పందించిన ఎస్సై మల్లేష్‌యాదవ్ తప్పకుండా బాధితులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు శాంతించి ఆందోళన విరమించారు. అంతేకాకుండా విచారణలో పోలీసులకు సహకరించేవిధంగా కమిటీ నియమించుకుందామని కొందరు సూచించారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు సోమశేఖర్, శ్యాంప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలి

పుత్తూరురూరల్: శ్రీ వెంకటేశ పెరుమాళ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి మాట్లాడుతూ విద్యార్థులు పీజీ డిగ్రీని పూర్తి చేయడానికి యూనివర్సిటీ సూ చించిన నియమ నిబంధనలను తెలియజేస్తూ భవిష్యత్ కోసం ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా ముందడుగు వేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉపాధి కోసం వేచి చూడకుండా ఇతరులకు ఉపాధిని కల్పించే స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. ఓరియంటేషన్ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థుల కోసం ఉపయోగకరమైన కార్యక్రమాలు నిర్వహించినందుకు కళాశాల ప్రిన్సిపాల్‌ని బోధన సిబ్బందిని అభినందించారు. వైస్ ఛైర్మన్ రావూరి బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ మధురాంతకం, వివిధ విభాగాల అధిపతులు హరుణ్, శంకర్‌బాబు, నాగరాజారావ్, మునిశంకర్, లక్ష్మీపతి, వరప్రసాద్ పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా గంగజాతర

నింద్ర: శ్రీరామపురం దళితవాడలో గంగజాతర వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగింది. జాతర వేడుకలను పురస్కరించుకుని బుధవారం అమ్మవారికి అంబళ్లు పోసి, సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని విశేష అలంకరణతో అలంకరించి పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. గురువారం సాయంత్రం అమ్మవారిని నిమజ్జనం చేశారు.

పన్ను రాయితీ జీవోపై ఎందుకు కాలయాపన ?

కమిషనర్‌ను నిలదీసిన టీడీపీ నాయకులు



కమిషనర్‌తో మాట్లాడి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు

నగరి: మున్సిపాలిటీలోని పవర్‌లూమ్స్ కుటుంబాలకు ప్రభుత్వం యాభై శాతం ఇంటి పన్నుల రాయితీపై జీవో విడుదలైనా ఇంతవరకు అమలు చేయలేకపోతున్నారంటూ మున్సిపల్ కమిషనర్‌ను టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు నిలదీశారు. గురువారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ వెంకటేశ్వర్లతో తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిపారు. మున్సిపాలిటీ ఏకాంబరకుప్పం, సత్రవాడ, చింతలపట్టెడ, పుదుపేట, కేవీఆర్ పేటలలో ఇంటి పన్నులకు సంబంధించి యాభై శాతం రాయితీతో మూడు నెలల క్రితమే జీవోను విడుదల చేసింది. అయితే ఇంత వరకు దానిని ఇంత వరకు అమలు చేయలేకపోతున్నారు అని కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో విడుదలైన తరువాత ఇప్పటి వరకు మూడు కౌన్సిల్ సమావేశాలు జరిగినా కౌన్సిల్‌లో ఎందుకు ఆమోదించలేకపోయారు అంటూ నిలదీశారు. అందుచేత ఇప్పటికైనా ఇది అమలు చేస్తారా.. చేయరా... అంటూ గట్టిగా నిలదీశారు. చేయని పక్షంలో రాత మూలకంగా ప్రభుత్వానికి తెలపాలని కమిషనర్‌ను కోరారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పాకారాజ, పార్టీ అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి గుణశేఖర్, అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నుస్వామి, రమేష్, నటేశన్, సలీం, కౌన్సిలర్లు లత, వాసు, దేశప్పన్, కుప్పస్వామి, కృష్ణారెడ్డి, బాబురెడ్డి, దేవరాజ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా రథోత్సవం



అగ్నికుండలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నాగలాపురం: నాగలాపురంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వారి ఆలయంలో ధర్మరాజుల తిరునాళ్లలో భాగంగా గురువారం అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేసి, మహాదీపారాధనలు చేపట్టారు. అనంతరం అర్జునుడి ఉత్సవ విగ్రహాన్ని సుందరంగా ముస్తాబు చేసి మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ అత్యంత వైభవంగా అర్జునుడికి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో వచ్చిన స్వామివారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు పట్టారు. సాయంత్రం స్థానిక మహిళలు సుమారు 100 మంది ఆనవాయితీ ప్రకారం అగ్ని కుండలతో చెల్లియమ్మ ఆలయం నుంచి ధర్మరాజుల స్వామి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. అనంతరం అగ్ని కుండలను ఆలయం వద్ద సమర్పించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి ద్రౌపతీ అమ్మవారికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

ఈ పూజా కార్యక్రమాలకు ఆర్యవైశ్య కులస్థులు ఉభయధారులుగా వ్యవహరించారు.

అమ్మవారి సేవలో గ్రామస్థులు

సత్యవేడు: మండల పరిధిలోని కొల్లడం, ఆరురూ గ్రామాలలో గురువారం అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. కొల్లడం గ్రామంలో రామచెల్లాతమ్మ అమ్మవారికి నూతన ఆలయం నిర్మించి రెండు రోజులుగా కుంబాభిషేకం పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఊరేగింపునిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులు పలువురు ఇళ్ల వద్ద ఘనంగా స్వాగతం పలుకుతూ జంతు బలులు ఇచ్చారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. అదే విదంగా ఆరురూ గ్రామంలో గంగజాతర నిర్వహించారు. ఎనిమిది సంవత్సరాల క్రితం నిర్వహించిన ఈ గంగజాతరను తిరిగి జరపడంతో గ్రామస్థులు ఎంతో ఆనందంతో జాతరను నిర్వహించడం జరిగింది. బుధవారం రాత్రి అమ్మవారిని ఊరేగింపు నిర్వహించి గురువారం భక్తుల దర్శనార్థం గురువారం ఉదయం అమ్మవారిని నడివీధిలో ఉంచడం జరిగింది.

మహిళా సంఘాలకు గృహ రుణాలిస్తాం



నూతన బ్యాంకు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

సత్యవేడు: మహిళా సంఘాల సభ్యులు కోరితే గృహరుణాలు మంజూరు చేస్తామని సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ సూరిబాబు పేర్కొన్నారు. గురువారం దాసుకుప్పం గ్రామీణబ్యాంకు శాఖ కార్యాలయ మార్పుచేశారు. ముఖ్యఅతిదిగా విచ్చేసిన ఆయన నూతన కార్యాలయాన్ని ప్రాంభించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలోని మహిళా సంఘాలకు 3.75కోట్ల రూపాయలు చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళాసంఘాలకు బ్యాంకులింకేజీ రుణాలకింద 7.5లక్షల రూపాలయు మాత్రమే ఇస్తుండే వారమని ప్రస్తుతం 10లక్షల రూపాయల వరకు రుణాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా గ్రూపు సభ్యులు కోరితే గృహరుణాలు కూడా మంజూరుచేసేందుకు గ్రామీణబ్యాంకు ముందుకొస్తుందని దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఐదు లక్షల వరకు పరిమితి విధించి రుణాలు మంజూరుచేస్తామని వ్యక్తిగంతగా కుడా గ్రూపులోని సభ్యురాలికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. మహిళాసంఘాలకు గ్రామీణ బ్యాంకు శాఖలు అధికమొత్తంలో రుణాలు మం జూరుచేస్తున్నాయని వాటిని సక్రమమైన పద్దతిలో చెల్లించినట్లైతే తిరిగి రుణాలు పొందే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టంచేశారు.

ఈ కార్యక్రమంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ జయరాంనాయుడు, దాసు కుప్పం, సత్యవేడు గ్రామీణబ్యాంకు మేనేజర్లు లోకయ్య, జిల్లాపరిషత్ ఉపాధ్యక్షుడు సుందరరామిరెడ్డి, ఎంపీపీమస్తాన్, వైసీపీ రాష్ట్రసంయుక్తకార్యదర్శి ఏవిఎంబాలాజీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసిన చిలకం

విజయపురం: మండలంలోని ముత్యాలరెడ్డి కండ్రిగలో పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ ను రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు చిలకం రామచంద్రారెడ్డి గురువారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు అంటు వ్యాధులు సోకకుండా, తట్టు అమ్మవారు, వైరస్ నుంచి వచ్చే వ్యాధులను అరికట్టడం కోసం మీజిల్స్ టీకాను అందుబాటులో తెచ్చిందని, ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐటీఐకి దరఖాస్తుల ఆహ్వానం

విజయపురం: మాధవరం వద్ద నెలకొల్పిన ప్రభుత్వ ఐటీఐకి రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తులను 15 లోపు కార్యాలయంలో రూ.10 చెల్లించి తీసుకోవాలని, పూర్తి చేసిన దరఖాస్తులను సాయంత్రం 5 గంటల లోపు అందించాలన్నారు.

10నుంచి రెవెన్యూ సదస్సులు

చౌడేపల్లె: భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 10తేదీ నుంచి సెప్టెంబరు 29 తేదీ వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు చౌడేపల్లె తహసీల్దార్ భాగ్యలత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 10న ఏ.కొత్తకోట, 11న దుర్గసముద్రం, 17న చారాల, 18 శెట్టిపేట, 24న పందిళ్లపల్లె, 31 పెద్దయల్లకుంట్ల, సెప్టెంబరు 1న పుదిపట్ల, 7న 29ఏ. చింతమాకులపల్లె, 8న లద్దిగం, 14న కాటిపేరి, 15న కాగతి, 21 దిగువపల్లె, 22న పెద్దకొండమర్రి, 28న గడ్డంవారిపల్లె, 29 చౌడేపల్లె పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

రామసముద్రం: మండలంలోని చొక్కాండ్లపల్లె పంచాయతీ పురాండ్లపల్లెలో నూతనంగా నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఒక్క టీకా రెండు వ్యాధులకు చెక్



విద్యార్థులకు టీకాలు వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

రామసముద్రం: ఒక్క టీకాతో రెండు రకాల వ్యాధులకు చెక్ పెట్టవచ్చని డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని మట్లవారిపల్లె ఉన్నత పాఠశాలలో మీజిల్స్, రుబెల్లా టీకాలు విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు ఉన్న వారందరూ ఎమ్మార్ టీకా వేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నందకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.● సోమల మండలంలోని అడుసుపల్లె, దాసరివారిపల్లె, చిన్న సోమల పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యాధికారి సోనియా ఎమ్మార్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మార్ టీకాతో రెండు వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రహీమా, మధునిక, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల రక్షణ కోరిన ప్రేమజంట

పుంగనూరు రూరల్: తల్లిదండ్రుల నుంచి తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట గురువారం పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని మంగళం పంచాయతీ కంగానెల్లూరుకు చెందిన వెంకటరమణ కుమారుడు గిరిబాబు(25) పెద్దపంజాణి మండలం కరసనపల్లెకు చెందిన నంజప్ప కుమార్తె విజయకుమారి(22) కొంత కాలంగా ప్రేమించుకున్నారు. బుధవారం కాణిపాకంలో వివాహం చేసుకున్నారు. గురువారం పుంగనూరు పోలీసు స్టేషన్ చేరుకుని రక్షణ కల్పించాలని కోరినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర	పిదా
తాజ్‌మహల్	గౌతమ్‌నంద
గోకుల్	దర్శకుడు
ఎంఎస్ఆర్	నక్షత్రం

ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పుంగనూరు/సోమల/చౌడేపల్లె: తల్లి ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకాగా పనిచేస్తుందని, జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించగలరని పుంగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి భారతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం పుంగనూరులోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన అర్ధగంట తరువాత పిల్లలకు కొంత మంది చెక్కర నీటిని తాపడం జరుగుతుందన్నారు. అలాంటి వాటికి స్వస్తి చెప్పి తల్లి పాలు తాగించేలా వారిలో చైతన్యం తీసుకు రావాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ చంద్రకళ, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.● సోమల అంగన్‌వాడీ కేంద్రంలో ఏసీడీపీవో వాణిశ్రీదేవి మాట్లాడుతూ పుట్టిన అర్ధగంటలోపు బిడ్డకు ముర్రుపాలను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. దీని వల్ల బిడ్డల్లో రోగనిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లత, అంగన్‌వాడీ కార్యకర్తలు సరస్వతమ్మ, నందిని, నాగరత్న, ఉషా, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు. ● చౌడేపల్లె ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ తదితరులు

సోమల: ప్రజా సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్‌ల సంఘ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులునాయుడు అన్నారు. గురువారం ఇరికిపెంట పంచాయతీ కార్యాలయంలో రైతుల సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ ప్రతి గురు, శుక్రవారాల్లో రెవెన్యూ సమస్యలపై స్థానికంగా సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ విష్ణురాం, వీఆర్వో గోపాల్, నీటి సంఘ అధ్యక్షుడు కోటీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం

రొంపిచెర్ల/కల్లూరు: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వైద్యాధికారి రాజు, ఐసీడీఎస్ అధికారి ప్రదీప అన్నారు. గురువారం రొంపిచెర్లలోని ఉర్దూ పాఠశాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమన్నారు. బిడ్డ పుట్టిన అరగంట లోపు ముర్రుపాలును తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. దీని వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాలక్ష్మి, హెచ్‌ఈ మహమ్మద్‌రఫీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనితావాణి, ఆరోగ్య కార్యకర్తలు అలివేలు, మనోహర్, గుండమ్మ తదితరులు పాల్గొన్నారు. ● తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని పులిచెర్ల ఎంపీపీ మురళీధర్ అన్నారు. పులిచెర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, పావని తల్లిపాల ప్రాముఖ్యాన్ని వివరించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచు రాణి, హెచ్‌ఎం కుసుమకుమారి, రవిశంకర్ రాజు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పులిచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

రొంపిచెర్ల: మండలంలో మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఉమాలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు పూర్తి చేసిన మరుగుదొడ్ల నిర్మాణాలకు లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. మండలంలో 10 పంచాయతీల్లో డంపింగ్‌యార్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్వచ్ఛభారత్‌లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.

ఆటో సహా ఎర్రచందనం స్వాధీనం



నిందితుడు, ఎర్రచందనం దుంగలతో పోలీసులు

రొంపిచెర్ల: మండల పరిధి గానుగచింత పంచాయతీ మల్లెమిట్టప్రాజెక్టు సమీపంలో గురువారం ఆటో సహా ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రహీముల్లా తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... ఎర్రచందనం తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి 35కిలోల బరువైన మూడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు పరారవగా వెదురుకుప్పం మండలం మారేపల్లె దళితవాడకు చెందిన జయరాం (28)ను అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

యథేచ్ఛగా గుట్కా విక్రయాలు

సదుం: మండలంలో గుట్కా అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సదుంలోనే కాక మారుమూల పల్లెల్లోనూ గుట్కా ప్యాకెట్లు అందుబాటులో ఉంటున్నాయి. గుట్కా అమ్మకాలు జోరుగా సాగుతున్నా వీటిని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం లేదు. గుట్కా అమ్మకాలపై నిషేధం ఉన్నా బీడీ కొట్లు నుంచి పెద్దపెద్ద కిరాణాషాపుల్లోనూ వ్యాపారాలు జోరుగా జరుగుతున్నారు. ప్యాకెట్‌పై రూ.2 ఎమ్మార్పీ ఉన్నా హీరా, బాషా, బాద్‌షా, పన్‌పరాగ్‌లను రూ.10, రూ.5 ఎమ్మార్పీ ఉన్న హాన్స్ ప్యాకెట్ రూ.20కి విక్రయిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం నుంచి వేలూరు, చిత్తూరు మీదుగా కల్లూరు నుంచి చిన్న, పెద్ద వాహనాల్లో సదుంకు గుట్కా ప్యాకెట్లు సరఫరా అవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గుట్కా అమ్మకాలను అరికట్టాల్సిన అవసరం ఉంది.

నేడు ఎమ్మెల్యే తిప్పారెడ్డి పర్యటన

రామసముద్రం: మదనపల్లె ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి శుక్రవారం రామసముద్రం మండలం అరికెలలో పర్యటించనున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అరికెలలో సిమెంటు రోడ్డుకు భూమి పూజ, చిన్నప్పల్లెలో సిమెంటు రోడ్డును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సదుం: ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం సదుంలో జరిగింది. సోమల మండలం 81ఉప్పరపల్లె పంచాయతీ ఇర్లపల్లెకు చెందిన గణేశ్(28), వెంకటరమణ(40) మధ్యాహ్నం 3గంటల సమయంలో ద్విచక్రవాహనంపై సదుం మీదుగా కల్లూరు వైపు వెళుతుండగా బట్టువారిపల్లె క్రాస్ వద్ద వాహనం అదుపు తప్పి కిందబడ్డారు. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న వెంకటరమణకు స్వల్ప గాయాలు కాగా వెనుక ఉన్న గణేశ్ బండరాయిపై పడటంతో తలకు తీవ్ర రక్త గాయమైంది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గణేశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పుంగనూరు మండలానికి ఇద్దరు హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్లు

పుంగనూరు రూరల్: పుంగనూరు మండలానికి ఇద్దరు హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్లను ప్రభుత్వం నియమించినట్లు హౌసింగ్ ఏఈ ఓబుల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చిత్తూరులో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న జ్ఞానశేఖర్, ఎర్రవారిపాళ్యంలో పనిచేస్తున్న తనూజాలను పుంగనూరుకు బదిలీ చేసినట్లు తెలిపారు. మండలంలో జరుగుతున్న ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

సోమల: మండలంలోని అడుసుపల్లె పాఠశాల విద్యార్థులకు రూ.15 వేలు విలువ చేసే విద్యాసామగ్రిని పూర్వపు విద్యార్థి వాసుదేవకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో బాలాజీనాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి పూర్వపు విద్యార్థుల కృషి హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు, హెచ్‌ఎం పార్థసారథి, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యం అందక పాడిఆవు మృతి

రామసముద్రం: వైద్యం అందక రూ.50వేల విలువ చేసే పాడి ఆవు మృతి చెందింది. రామసముద్రం దిగువపేటకు చెందిన అక్బర్‌సాబ్ పాడిఆవుతో జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం ఉదయం మేత కు పొలం వద్దకు తీసుకెళ్లి చెట్టుకు కట్టేసి గడ్డి వేశాడు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కట్టు తెంచుకున్న ఆవు వేరుశనగ పొలంలోని జొన్న కర్రలు మేయగా కడుపు ఉబ్బిపోయి కిందపడిపోయింది. గమనించిన రైతు వెంటనే స్థానిక పశువైద్యశాలకు వెళ్లాడు. అక్కడ వైద్యులు, సిబ్బంది ఎవ్వరూ లేరు. వైద్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. పాడిఆవు మృతి చెందడంతో తమ కుటుంబం జీవనాధారం కోల్పోయిందని అక్బర్‌సాబ్ విలపించారు.